www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 4-5-2026 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 24 సంచిక (Issue) : 57

శ్రీ పరాభవ నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, వైశాఖమాసం, బహుళపక్షం, తిథి: తదియ తె.5:24 తదుపరి చవితి, నక్షత్రం: అనూరాధ ఉ.9:58 తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: సా. 4:15-6:03, దుర్ముహూర్తం: మ.12:37-1:28, పున: మ.3:09-4:00, అమృతఘడియలు: తె.3:02-4:49, రాహుకాలం: ఉ. 7:30-9:00, సూర్యోదయం: 5:51, సూర్యాస్తమయం: 6:32,

గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

9 మంది సజీవ దహనం!

2

ఢిల్లీలో ఏసీ అవుట్‌డోర్ యూనిట్ పేలి, ఘోర అగ్నిప్రమాదం

నివాస భవనంలో మంటలు

ఏడాదిన్నర చిన్నారి సహా తొమ్మిది మంది మృతి

స్మార్ట్ లాక్‌లు జామ్ అవ్వడంతో ఇళ్లల్లో చిక్కుకుపోయిన బాధితులు



పేలిపోయిన ఏసీ అవుట్‌డోర్ యూనిట్



విలపిస్తున్న బాధితులు

పవన్ 'మ్యాజిక్' భేష్

గ్రామీణాంధ్రప్రదేశ్ కోసం వినూత్న కార్యక్రమాలు

సరికొత్త మ్యాజిక్ డ్రెయిన్లతో పారిశుధ్యం మెరుగు

ప్రజలకు ఆరోగ్యం.. భూగర్భ జలాలు వృద్ధి

ఉప ముఖ్యమంత్రికి పీవీ సింధు ప్రశంసలు

11



Carrier

11

శ్రీసిటీకి 'క్యారియర్'!

వెయ్యి కోట్లతో ఏసీల పరిశ్రమ పెట్టనున్న దిగ్గజ సంస్థ

ఎల్లుండి శంకుస్థాపన.. హాజరుకానున్న లోకేశ్

'స్వచ్ఛ రథం' సూపర్ హిట్

పంచాయతీల్లో భారీగా ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ

ఏప్రిల్‌లో 1866 టన్నులు.. బదులుగా గ్రామీణులకు 3.3 కోట్ల విలువైన నిత్యావసర వస్తువుల పంపిణీ

రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సిద్ధమైన వాహనాలు



'స్వచ్ఛ రథం' వాహనాలను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

11

ఫోరెన్సిక్‌తో నేరాలకు బ్రేక్!

అమరావతిలో అంతర్జాతీయ స్థాయి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ రెడీ

ఐదెకరాల్లో 5 భవనాల నిర్మాణం పూర్తి

రూ.252 కోట్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ప్రాజెక్టు

2017లో చంద్రబాబు చేతుల మీదుగా పనులు ప్రారంభం

అధికారంలోకి రాగానే నిర్మాణం ఆపేసిన వైసీపీ ప్రభుత్వం

2024లో కూటమి రాకతో పనులు వేగం.. నిర్మాణాలు పూర్తి

త్వరలోనే అత్యాధునిక పరికరాలూ అందుబాటులోకి

ఈ నెలాఖరులో సీఎం చేతుల మీదుగా ప్రారంభం



అమరావతిలో సిద్ధమైన ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

నేర పరిశోధనలో ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్)లు కీలక పాత్ర పోషిస్తాయి. నేరం జరిగిన ప్రదేశం నుంచి చిన్న ఆధారాలను సైతం శాస్త్రీయంగా విశ్లేషించి నిందితులను త్వరగా గుర్తించేందుకు, కోర్టుల్లో నేరం నిరూపించేందుకు సహాయపడతాయి. ప్రత్యక్ష సాక్షులు లేని కేసుల్లో.. ఈ ఫోరెన్సిక్ నివేదికలే నిజమైన నేరస్థుడిని పట్టుకోవడానికి ఉపయోగపడతాయి. ఇంతటి ప్రాధాన్యం కలిగిన అధునాతన ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్.. రాష్ట్ర రాజధాని అమరావతిలో సిద్ధమైంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి నిధులతో తుళ్లూరులోని ఎన్-14, ఈ-5 జంక్షన్‌లో

మిగతా 11వ పేజీలో...

నేరస్థుల గుర్తింపులో కీలకం..

నేరం జరిగిన స్థలంలో లభించే రక్తం, లాలాజలం, వెంట్రుకలు, చర్మ కణాల వంటి చిన్న చిన్న ఆధారాలతో డీఎన్ఏ ప్రొఫైలింగ్ పరీక్ష ద్వారా నేరస్థుడి డీఎన్ఏను గుర్తించి, నేరాన్ని నిరూపించవచ్చు.

సైబర్ నేరాలు, ఆర్థిక మోసాల కేసుల్లో డిజిటల్ ఫోరెన్సిక్ ద్వారా మొబైల్స్, కంప్యూటర్ల నుంచి తొలగించిన డేటాను తిరిగి పొందవచ్చు.

ఆటోమేటెడ్ ఫింగర్‌ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ (ఏఎఫ్ఐఎస్) ద్వారా వేలిముద్రలను విశ్లేషించి, డేటాబేస్‌లో ఉన్న వేలిముద్రలతో వాటిని సరిపోల్చి నేరస్థులను గుర్తించవచ్చు.

కాల్పుల సంఘటనల్లో తుపాకీలు, తూటాలను విశ్లేషించవచ్చు. విషప్రయోగం, లేదా మత్తు పదార్థాల వల్ల జరిగిన మరణాల కేసుల్లో శవపరీక్షల ఆధారంగా మరణానికి కారణాలను గుర్తించవచ్చు.

పాత పద్ధతులతో పోలిస్తే అధునాతన ల్యాబ్‌ల్లో డీఎన్ఏ విశ్లేషణ, డిజిటల్ ఫోరెన్సిక్ వంటివి కొన్ని గంటలు లేదా రోజుల్లోనే నివేదికలు అందిస్తాయి.



విజయవాడలోని ఓ పరీక్షా కేంద్రం వద్ద భారీగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

ఈసారి సులువుగా 'నీట్'!

జీవశాస్త్రంలో అత్యధిక మార్కులు వచ్చే అవకాశం

రసాయన శాస్త్రంలో ఐదారు ప్రశ్నలే కఠినం

మధ్యస్థంగా భౌతిక శాస్త్రం ప్రశ్నలు

570 మార్కులొస్తే కన్వీనర్ కోటా సీటు!

రాష్ట్రవ్యాప్తంగా 28 నగరాల్లోని 180 కేంద్రాల్లో పరీక్ష

దాదాపు 59 వేల మంది హాజరైనట్లు అంచనా

నెలాఖరులోగా కీ.. జూన్ రెండో వారంలో ఫలితాలు

అమరావతి/హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): దేశంలోని వైద్యకళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర కోర్సుల్లో చేరేందుకు ఉద్దేశించిన ప్రవేశ పరీక్ష నీట్ యూజీ-2026 ప్రశ్నపత్రం మోడరేట్‌గా ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. సాపేక్షంగా బయాలజీ సులువుగా ఉంది. చాలావరకు ప్రశ్నలు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచి అడిగారు. ఎక్కువ ప్రశ్నలు స్టేట్‌మెంట్ ఆధారంగా ఇవ్వడంతో బయాలజీలో సమాధానాలు గుర్తించేందుకు గంటసేపు పట్టింది. రసాయన శాస్త్రంలో అడిగిన ప్రశ్నల నిడివి ఎక్కువ కాగా వాటి స్థాయి ప్రామాణికంగా ఉంది. ఆర్గానిక్, ఇనార్గానిక్, ఫిజికల్ కెమిస్ట్రీల మధ్య సమతుల్యత పాటించారు. ఫిజిక్స్ మోడరేట్ నుంచి

మిగతా 12వ పేజీలో...

కొత్త చరిత్రా? పాత ఫలితమా?

నేడే నాలుగు రాష్ట్రాలు.. పుదుచ్చేరి ఓట్ల లెక్కింపు

పటిష్ఠ ఏర్పాట్లు చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

బెంగాల్‌లో ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ

అక్కడ బీజేపీ గెలిస్తే సరికొత్త చరిత్రే

తమిళనాడులో రిసార్టు రాజకీయాలు మొదలు

గెలిచే అభ్యర్థులను కాపాడుకొనే పనిలో విజయ్

మళ్లీ ఎల్డీఎఫ్ గెలిస్తే కేరళలో సరికొత్త రికార్డు

అస్సాంలో తేలనున్న 722 మంది అభ్యర్థుల భవిత



ఆదివారం కోల్‌కతాలో ఓ స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ఠ భద్రత

న్యూఢిల్లీ, మే 3 (ఆంధ్రజ్యోతి): కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మరికొన్ని గంటల్లో వెలువడనున్నాయి. అంతకుముందే ముఖ్యమంత్రి పినరయి విజయన్ తన పేరు వెనుక సీఎం అనే పదాన్ని తొలగించుకున్నారు.. తమిళనాడులో ఓట్ల లెక్కింపునకు ఒకరోజు ముందే రిసార్టు రాజకీయాలు మొదలయ్యాయి. ఈసారి రాష్ట్రంలో హంగ్ వస్తుందని.. తానే కింగ్ మేకర్ అవుతానన్న ధీమాతో ఉన్న టీవీకే అధ్యక్షుడు దళపతి విజయ్, తన ఎమ్మెల్యేలందరినీ రిసార్టుకు తరలించే ఏర్పాట్లు చేసుకున్నారు. టీఎంసీ, బీజేపీ మధ్య నువ్వా-నేనా అన్నట్లుగా పోటీ ఉన్న బెంగాల్‌లో ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సీఎం మమతాబెనర్జీ సిద్ధమయ్యారు. ఆదివారమే తన పార్టీ కౌంటింగ్ ఏజెంట్లకు

మిగతా 2వ పేజీలో...

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో ఇబ్బందులతో సరికొత్త బాటలో యువత

ఏఐ, డేటాసైన్స్, సైబర్ సెక్యూరిటీ, బయోటెక్ స్కిల్స్ వైపు చూపు

సౌర విద్యుత్, డ్రోన్ టెక్నాలజీకి డిమాండ్

విభిన్న స్వయం ఉపాధి మార్గాల్లోనూ అడుగులు



ఐటీ దిగాలు.. కొత్త ఉపాధి జిగేలు

హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో ఒకప్పుడు ఇంజినీరింగ్ పూర్తయిందంటే చాలు.. అమెరికా విమానం ఎక్కడమో లేదా బెంగళూరు, హైదరాబాద్‌లోని ఐటీ ఉద్యోగంలో చేరడమో లక్ష్యంగా ఉండేది. కానీ ఏఐ యుగంలో ఐటీ రంగం ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. ఐటీ దిగ్గజాలు కూడా ఖర్చుల కోత పేరుతో ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతుంటే.. ఆ నిరాశ మధ్య యువత 'నైపుణ్యాల' పెంపుతో సరికొత్త ఉపాధి మార్గాలను వెతుక్కుంటోంది. మార్కెట్ అవసరాలను గుర్తించి

మిగతా 11వ పేజీలో...

ఖైదీల సొమ్ముకూ కక్కుర్తి!



పెట్రోలు బంకుల ఆదాయం భారీగా మళ్లింపు

జైళ్లలో ఖైదీలను సంస్కరించాల్సిన కొందరు జైలు అధికారులు వారి సొమ్ముల కోసం కక్కుర్తి పడ్డారు. ఏపీ జైళ్ల శాఖ పరిధిలోని పెట్రోలు బంకుల నుంచి వచ్చే ఆదాయాన్ని భారీగా దారి మళ్లించారు. ఖైదీల సంక్షేమానికి వినియోగించాల్సిన రూ.కోట్ల నిధులను సొంతానికి వాడుకున్నారు.

జైళ్లశాఖలో పక్కదారి పట్టిన కోట్ల రూపాయలు

నెలలోగా చెల్లించకపోతే చర్యలు: ప్రిజన్స్ డీజీ

15ఏళ్ల సంక్షేమ నిధిపై ఆడిట్ చేపట్టాలని ఆదేశం

సీసీ కెమెరాలు, లైవ్ వైర్‌తో భద్రత కట్టుదిట్టం

పదోన్నతులు, పారదర్శక బదిలీలపై హర్షం

అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): జైళ్లలో పెట్రోల్ బంకుల ఆదాయం అడ్డగోలుగా దారిమళ్లుతోంది. అక్రమాలకు పాల్పడుతున్న కొందరు అధికారులు సంక్షేమ ఫండ్ ఆడిట్ జరగకుండా ఇన్నాళ్లూ జాగ్రత్తపడ్డారు. ఇప్పుడు ఆ అధికారులకు ఇన్‌చార్జి డీజీ బాలసుబ్రహ్మణ్యం షాక్ ఇచ్చారు. గత 15ఏళ్లకు సంబంధించి మొత్తం ఆడిట్ చేపట్టాలని ఆదేశాలివ్వడంతో రూ.కోట్లు స్వాహా చేసిన అవినీతి అధికారులు వణుకుతున్నారు. రాష్ట్రంలోని నాలుగు కేంద్ర కారాగారాలు, ఎనిమిది జిల్లా జైళ్లు, 90 వరకూ ఇతర సబ్ జైళ్లలో సుమారు 7వేల మందికి పైగా

మిగతా 3వ పేజీలో...

మన బంగారం.. మన దేశానికి



2025-26లో 1,68,060 కిలోల పసిడిని విదేశీ బ్యాంకుల నుంచి తీసుకొచ్చిన ఆర్బీఐ

2023-24, 2024-25 సంవత్సరాల్లో కూడా లక్ష కిలోలకు పైగా పుత్తడి తరలింపు

యుద్ధాలతో నెలకొన్న రాజకీయ, భౌగోళిక అనిశ్చిత పరిస్థితులే ఇందుకు ప్రధాన కారణం

మన దేశ మొత్తం పుత్తడి నిల్వ 880 టన్నులు

అందులో 378.95 టన్నుల పసిడి గడిచిన మూడేళ్లలో విదేశీ బ్యాంకుల నుంచి తెచ్చిందే

(సెంట్రల్ డెస్క్)

1,68,060 కిలోలు.. అక్షరాలా లక్షా అరవై ఎనిమిది వేల అరవై కిలోలు.. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విదేశాల నుంచి మన దేశానికి తెచ్చిన మన బంగారం ఇది! గడిచిన మూడేళ్లలో ఇలా బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, స్విట్జర్లాండ్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్స్ వంటి విదేశీ బ్యాంకుల వాల్టుల్లో మూలుగుతున్న మన బంగారాన్ని లక్ష కిలోలకు పైగా ఇక్కడకు తరలించడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం. 2023-24లో 107.21 మెట్రిక్ టన్నులు (ఒక మెట్రిక్ టన్ను అంటే వెయ్యి కిలోలు), 2024-25లో 103.68 మెట్రిక్ టన్నుల మేర పుత్తడిని ఆర్బీఐ

మిగతా 12వ పేజీలో...

తారెత్తించిన ఎండ.. దంచికొట్టిన వాన!

3

తుపాకులతో వచ్చి.. నగల దుకాణంలో దోపిడీ

కరీంనగర్ నడిబొడ్డున పట్టపగలే ఘటన

షాపులోకి తుపాకులతో చొరబడ్డ దుండగులు

సిబ్బందిని బెదిరించి కిలో బంగారు నగల దోపిడీ

తిరగబడ్డ మేనేజర్, సిబ్బందిపై కాల్పులు

12

ముగ్గురికి గాయాలు.. 2 బైకులపై దొంగల పరార్

1.8 కిలోల ఆభరణాలున్న మరో బ్యాగును నగల దుకాణంలోనే వదిలేసి ఉడాయించిన వైనం

అంతరిక్షంలో మన 'దృష్టి'

ప్రపంచంలోనే తొలి ఆప్టోసార్ ఉపగ్రహం కక్ష్యలోకి

భూపరిశీలన ఉపగ్రహ ప్రయోగం విజయవంతం

కాలిఫోర్నియా నుంచి ప్రయోగించిన బెంగళూరు స్టార్టప్ 'గెలాక్సీఐ'

2

శాస్త్రవేత్తల బృందానికి ప్రధాని మోదీ అభినందన

మామిడి ధర ఢమాల్

విదేశాలకు నిలిచిన ఎగుమతులు

పొరుగు రాష్ట్రాల్లో అమ్మినా నష్టాలే

రూ.30 మించని నంబర్‌వన్ బంగినపల్లి

తోతాపురి ధర పతనం

మామిడి రైతు కుదేలు

(ఆంధ్రజ్యోతి, విస్సన్నపేట/రెడ్డిగూడెం/ఇబ్రహీంపట్నం)

యుద్ధం ప్రభావం వల్ల గల్ఫ్ దేశాలకు మన ఉద్యాన ఉత్పత్తుల ఎగుమతులు నిలిచిపోయాయి. ఇది ఈ సీజన్‌లో అధికంగా వచ్చే మామిడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఎగుమతులు లేక.. ధర పతనం కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. అసలే నల్లి తామరతో ఆశించిన స్థాయిలో దిగుబడులు రాక అల్లాడుతున్న రైతులను... ధర పతనం మరింత

మిగతా 12వ పేజీలో...



విస్సన్నపేట మార్కెట్‌లో తోతాపురి రకం మామిడి

తేడా వస్తే.. దాడి తప్పదు

» ఇరాన్ తప్పుగా వ్యవహరిస్తే మళ్లీ దాడులు: ట్రంప్



వాషింగ్టన్/ టెహ్రాన్, మే 3: ఇరాన్‌తో యుద్ధం, శాంతి ఒప్పందం విషయాల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'బెదిరించి దారికి తెచ్చుకొనే' ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నారు. తాజాగా ఇరాన్‌తో శాంతి ఒప్పందానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని చెబుతూనే.. ఆ దేశం తప్పుగా ప్రవర్తిస్తే మళ్లీ దాడులు తప్పవని హెచ్చరించారు. ఫ్లోరిడాల్లో వెస్ట్ పామ్ బీచ్ నుంచి శనివారం (స్థానిక కాలమానం) మియామీ వెళ్లే ముందు ఆయన మీడియాతో మాట్లాడారు. 'శాంతి ఒప్పంద ప్రణాళిక గురించి వాళ్లు (ఇరాన్) నాకు చెప్పారు. త్వరలో కచ్చితమైన ప్రతిపాదన చేయబోతున్నారు' అని తెలిపారు. ఇరాన్‌పై మళ్లీ దాడులు మొదలుపెట్టే అవకాశం ఉందా? అన్న ప్రశ్నకు బదులిస్తూ.. 'ఆ విషయాన్ని నేను ఒక మీడియా ప్రతినిధితో చెప్పలేను. ఒకవేళ వాళ్లు తప్పుగా ప్రవర్తిస్తే, ఏమైనా చెడు చేస్తే.. దాడులు తప్పకపోవచ్చు' అని అన్నారు. అనంతరం సోషల్ మీడియాలో స్పందిస్తూ.. ఇరాన్ ప్రతిపాదనలు ఆమోదయోగ్యంగా ఉంటాయని అనుకోవటం లేదని ట్రంప్ పేర్కొన్నారు.

14 అంశాలతో ఇరాన్ కొత్త శాంతి ప్రణాళిక ప్రతిపాదన

యుద్ధాన్ని ముగించేందుకు ట్రంప్ 9 షరతులతో ఓ ప్రతిపాదన చేయగా.. ప్రతిగా ఇరాన్ 14 అంశాలతో కొత్త శాంతి ప్రణాళికను ప్రతిపాదించింది. దీనిని పాకిస్థాన్ ద్వారా అమెరికాకు అందజేసింది. 'లెబనాన్‌పై దాడులు సహా యుద్ధాన్ని వెంటనే ఆపేయాలి. మాపై ఆంక్షలను పూర్తిగా ఎత్తేయాలి. యుద్ధం వల్ల మాకు జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలి. హోర్ముజ్ జలసంధిలో అమెరికా నౌకాదళం దిగ్బంధనాన్ని తొలగించాలి. అమెరికా బలగాలను పూర్తిగా ఉపసంహరించుకోవాలి. విదేశాల్లో ఉన్న ఇరాన్ ఆస్తులను జప్తు నుంచి విడిపించాలి. హోర్ముజ్ జలసంధి నిర్వహణకు కొత్త వ్యవస్థను ఏర్పాటుచేయాలి' అని డిమాండ్ చేసింది. ఈ ప్రతిపాదనలు పంపిన తర్వాత ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి కజమ్ ఘరిబబాది మీడియాతో మాట్లాడుతూ.. తాము శాంతికైనా, యుద్ధానికైనా సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఇక నిర్ణయం తీసుకోవాల్సింది అమెరికాయేనని పేర్కొన్నారు.

అమెరికా నుంచి ఎఫ్-35ఐ ఎఫ్-15ఐఏ యుద్ధ విమానాల కొనుగోలు

» వెల్లడించిన ఇజ్రాయెల్ రక్షణ శాఖ

న్యూఢిల్లీ, మే 3: అమెరికాకు చెందిన లాక్‌హీడ్ మార్టిన్, బోయింగ్ సంస్థల నుంచి ఇజ్రాయెల్ అత్యాధునిక ఎఫ్-35ఐ, ఎఫ్-15ఐఏ యుద్ధ విమానాలను కొనుగోలు చేయనుంది. ఈమేరకు ఇజ్రాయెల్ రక్షణ శాఖ ప్రకటించింది. రెండు స్క్వాడ్రన్ల వరకు ఈ యుద్ధ విమానాలను కొనుగోలు చేయనుంది. ఈమేరకు తమ రక్షణ రంగాన్ని బలోపేతం చేసేందుకు 119 బిలియన్ల డాలర్ల వ్యయమయ్యే ఆయుధ సేకరణ ప్రణాళికకు ఇజ్రాయెల్ మినిస్టీరియల్ కమిటీ ఆమోదం తెలిపింది. ఇజ్రాయెల్ భద్రతను ఇది మరింత బలోపేతం చేస్తుందని ఆ కమిటీ ఆదివారం పేర్కొంది. తక్షణ యుద్ధ అవసరాలతో పాటు రానున్న కాలంలోనూ యుద్ధాల్లో పైచేయి సాధించేలా చూడాల్సిన బాధ్యత తమపై ఉందని ఇజ్రాయెల్ రక్షణ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ అమీర్ బరామ్ ఈ సందర్భంగా చెప్పారు. అమెరికా, ఇజ్రాయెల్ - ఇరాన్‌ల మధ్య సాగుతోన్న యుద్ధం అత్యాధునిక యుద్ధ విమానాల ప్రాధాన్యాన్ని తెలియజేసిందని ఆయన పేర్కొన్నారు. ఎఫ్-35ఐ, ఎఫ్-15ఐఏల కొనుగోలు ఇప్పటికే బలమైన ఇజ్రాయెల్ గగన తల ఆధిపత్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు.

భారత్‌కు మరో 45 వేల టన్నుల ఎల్పీజీ

» హోర్ముజ్ దాటిన కార్గో నౌక 'సర్వ్ శక్తి'.. 13న విశాఖకు

న్యూఢిల్లీ, మే 3: భారతదేశానికి 45 వేల టన్నుల ఎల్పీజీ(వంట గ్యాస్) తీసుకొస్తున్న కార్గో నౌక 'సర్వ్ శక్తి' శనివారం సురక్షితంగా హోర్ముజ్ జలసంధిని దాటింది. ఈ నౌక మార్షల్ ఐలాండ్స్ జెండాతో వస్తోందని అధికార వర్గాలు వెల్లడించాయి. నౌకలో 18 మంది భారతీయులు సహా మొత్తం 20 మంది సిబ్బంది ఉన్నారు. ఈనెల 13న ఈ నౌక విశాఖపట్నానికి చేరుకుంటుందని భావిస్తున్నారు. ఉద్రిక్తతల నేపథ్యంలో హోర్ముజ్ గుండా నౌకల రాకపోకలు బాగా తగ్గిపోయాయి. భద్రతా కారణాలతో అనేక నౌకలు ఈ మార్గంలో రావడం లేదు. గత బుధవారం 6 నౌకలు మాత్రమే ఈ జలసంధిని దాటాయి. సర్వ్ శక్తి నౌక తీసుకొస్తున్న ఎల్పీజీని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ) కొనుగోలు చేసినట్టు షిప్పింగ్ డాక్యుమెంట్ల ఆధారంగా బ్లూమ్‌బర్గ్ సంస్థ వెల్లడించింది. బ్లూమ్‌బర్గ్ కథనం మేరకు దుబాయిలో మరో నౌక నుంచి ఈ ఎల్పీజీని నింపుకున్న సర్వ్ శక్తి నౌక ఫిబ్రవరి మొదట్లో పర్షియన్ గల్ఫ్‌లోకి ప్రవేశించింది.

ఆస్పత్రుల్లో అగ్నిప్రమాదాల నివారణకు స్పెషల్ డ్రైవ్

» నేటి నుంచి ఈ నెల 10 దాకా కార్యక్రమం

న్యూఢిల్లీ, మే 3: దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని ఆస్పత్రులు, ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో అగ్నిప్రమాదాల నివారణకు కేంద్ర ప్రభుత్వం సోమవారం నుంచి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనుంది. ఈ నెల 10 వరకు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా.. అగ్నిప్రమాదాలను నివారించడం, వాటిని అరికట్టడంపై అవగాహన కల్పించడం, మాక్‌డ్రిల్స్ చేపట్టడం, సిబ్బందికి ఫైర్ సేఫ్టీ నిబంధనల్ని, రోగుల అత్యవసర తరలింపు విధానాలను వివరించడం వంటివి నిర్వహిస్తారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలతో కలిసి కేంద్రంలోని సంబంధిత మంత్రిత్వ శాఖలు ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి పుణ్య సలీల శ్రీవాస్తవ ఒక ప్రకటనలో తెలిపారు. ఢిల్లీలోని కర్తవ్య భవన్‌లో ఈ వారోత్సవాల ప్రారంభం సందర్భంగా ఫైర్ సేఫ్టీపై ప్రతిజ్ఞ చేయించనున్నారు.

జీవిత భాగస్వామి ఆదాయ వివరాలు ఆర్టీఐ కింద పొందలేరు: ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ, మే 3: సమాచార హక్కు చట్టం కింద ఓ వ్యక్తి తన జీవిత భాగస్వామికి సంబంధించిన ఆదాయ వివరాలు పొందలేరని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. సమాజానికి ఎటువంటి సంబంధం లేని వ్యక్తుల వ్యక్తిగత సమాచారాన్ని బహిర్గతం చేయడం ఆర్టీఐ చట్టం ఉద్దేశం కాదని,. బలమైన ప్రజాప్రయోజనం ఉంటే తప్ప ఒక వ్యక్తికి సంబంధించిన ఆదాయ పన్ను వివరాలు ఇతరులకు అందించకూడదని ధర్మాసనం అభిప్రాయపడింది. ఆ వివరాలను థర్డ్ పార్టీకి (జీవిత భాగస్వామితో సహా) వెల్లడించడం వారి వ్యక్తిగత గోప్యతా హక్కును ఉల్లంఘించడమే అవుతుందని స్పష్టం చేసింది. విడాకుల కేసులో భర్త నుంచి భరణం పొందేందుకు.. అతడి ఆదాయ పన్ను వివరాలు అవసరమంటూ ఓ మహిళ ఆర్టీఐ కింద దరఖాస్తు చేసుకోగా, ఆ వివరాలను బహిర్గతం చేయాలని ఐటీ అధికారులను సీఈసీ (సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషన్) ఆదేశించింది. అయితే, సీఈసీ ఉత్తర్వులను సవాల్ చేస్తూ భర్త ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ప్రభుత్వ పనితీరులో పారదర్శకత కోసం ఆర్టీఐని వినియోగించాలి తప్ప.. భార్యాభర్తల మధ్య ఉండే వ్యక్తిగత వివాదాల్లో ఇది వర్తించదని పేర్కొంది.

ఝార్ఖండ్ కాంగ్రెస్ పీఏసీలో కొప్పుల రాజు



న్యూఢిల్లీ, మే 3 (ఆంధ్రజ్యోతి): ఝార్ఖండ్ కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ)లో తెలుగు రాష్ట్రాల నుంచి ఏఐసీసీ నేత కొప్పుల రాజుకు స్థానం లభించింది. మొత్తం 36 మంది సభ్యులతో కూడిన ఈ రాజకీయ వ్యవహారాల కమిటీ ఏర్పాటుకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదం తెలపగా.. ఆమేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. జాబితాలో మొదటి పేరుగా కొప్పుల రాజు ఉండటం విశేషం.

కొత్త చరిత్రా..?

పాత ఫలితమా?



కోల్‌కత్తాలోని స్ట్రాంగ్‌రూం వద్ద పోలీసుల పహారా

(మొదటిపేజీ తరువాయి)

ఆ మేరకు దిశా నిర్దేశం చేశారు. బెంగాల్, అస్సాం, తమిళనాడు, కేరళతోపాటు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి అసెంబ్లీలకు గత నెలలో జరిగిన ఎన్నికల ఫలితాలు నేడు వెలువడనున్నాయి. ఆయా రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు కోసం కేంద్ర ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బాలెట్లతో ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఎగ్జిట్‌పోల్ సర్వేలు భిన్న ఫలితాలను అంచనా వేయటంతో పోటీచేసిన రాజకీయ పార్టీల్లో ఫలితాలపై నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఈసీ చర్యలు తీసుకుంది. కౌంటింగ్ కేంద్రాల్లోకి అనధికార వ్యక్తులు ప్రవేశించకుండా అడ్డుకోవడానికి తొలిసారి క్యూఆర్ కోడ్ ఆధారిత ఫొటో గుర్తింపు కార్డులను ప్రవేశపెట్టింది.

బెంగాల్‌పైనే అందరి దృష్టి

తాజా ఎన్నికల్లో అందరి దృష్టి పశ్చిమ బెంగాల్ పైనే నిలిచింది. ఇక్కడ 294 అసెంబ్లీ స్థానాలుండగా, నేడు 293 స్థానాల ఫలితాలను ప్రకటించనున్నారు. ఫాల్టా నియోజకవర్గంలో పోలింగ్‌ను ఈసీ రద్దుచేసింది. ఇక్కడ ఈ నెల 21న పోలింగ్ జరగనుంది. రాష్ట్రంలో గత మూడు ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించిన టీఎంసీ నాలుగోసారి విజయంపై ధీమాగా ఉంది. మరోవైపు బెంగాల్‌లో పాగా వేయాలని శక్తియుక్తులన్నీ ధారపోసిన బీజేపీ కూడా తనదే విజయం అని చెప్పుకుంటోంది. ఎగ్జిట్‌పోల్స్‌లో ఎక్కువశాతం మాత్రం బీజేపీకే అనుకూలంగా వచ్చాయి. అయితే, తాము 200 పైచిలుకు స్థానాల్లో గెలవబోతున్నామని సీఎం మమత ప్రకటించారు. ఆమె పోటీ చేసిన భవానీపూర్ నియోజకవర్గం ఫలితంపై ఇప్పుడు అందరి దృష్టి ఉంది. ఇక్కడ ఆమెకు ప్రత్యర్థిగా బీజేపీ సీనియర్ నేత సువేందు అధికారి నిలబడ్డారు. 2021 ఎన్నికల్లో నందిగ్రామ్‌లో ఆయన మమతను ఓడించారు. ఈసారి కూడా అదే ఫలితం వస్తుందా? మమత పైచేయి సాధిస్తుందా? అనేది మరికొన్ని గంటల్లో తేలనుంది. బెంగాల్‌లో గత నెల 23, 29 తేదీల్లో రెండు విడతలుగా పోలింగ్ జరిగింది. దేశ చరిత్రలోనే అత్యధికంగా 92.47% ఓటింగ్ నమోదైంది. రాష్ట్రంలో ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండటంతో ఓట్ల లెక్కింపు కోసం దాదాపు 2.5 లక్షల మంది కేంద్ర బలగాలను నియమించారు.

ద్రావిడ గడ్డపై 'దళపతి'పై ఏం చేసేనో..!

ఎప్పుడూ ద్విముఖ పోరు జరిగే తమిళనాడులో ఈసారి త్రిముఖ పోరు సాగింది. దశాబ్దాలుగా రాష్ట్ర రాజకీయాలను డీఎంకే లేదా అన్నాడీఎంకే పార్టీలే శాసిస్తుండగా.. వీటి మధ్యలోకి ఈసారి 'తమిళ వెట్రి కళగం' (టీవీకే) పార్టీతో సినీనటుడు విజయ్ ప్రవేశించారు. రాష్ట్రంలో 234 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23న ఒకే విడతలో పోలింగ్ నిర్వహించగా.. 85.10% పోలింగ్ నమోదైంది. సీఎం స్టాలిన్ నేతృత్వంలోని అధికార డీఎంకేదే ఈసారి కూడా అధికారమని మెజారిటీ ఎగ్జిట్‌పోల్ సర్వేలు ప్రకటించాయి. 'యాక్సిస్ మై ఇండియా' మాత్రం విజయ్ పార్టీ ఏకంగా 120 వరకు సీట్లు గెలుస్తుందని అంచనా వేసింది. దీంతో ఫలితాలపై ఉత్కంఠ ఏర్పడింది. మరోవైపు అన్నాడీఎంకే-బీజేపీ కూటమి ప్రభుత్వ వ్యతిరేకత తమను గెలిపిస్తుందన్న ఆశతో ఉంది. ఒకవేళ విజయ్ పార్టీ గెలిస్తే తమిళనాడులో సరికొత్త రాజకీయ శకం మొదలైనట్లే. కాగా, రాష్ట్రంలో హంగ్ ఏర్పడే అవకాశముందన్న అంచనాలతో దళపతి విజయ్ తన పార్టీ అభ్యర్థులను అప్రమత్తం చేశారు. గెలిచేవారంతా వెంటనే పార్టీ ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. వారిని ఓ రిసార్టుకు తరలించే ఆలోచనలో ఆయన ఉన్నట్లు సమాచారం.

సీఎం పేరు తీసేసిన విజయన్

కేరళలో పోలింగ్‌కు ముందే కీలక పరిణామం చోటుచేసుకుంది. వామపక్ష కూటమి ఎల్డీఎఫ్‌ను వరుసగా రెండుసార్లు గెలిపించి చరిత్ర సృష్టించిన సీఎం పినరయి విజయన్.. తనకు తానుగా సీఎం పేరును వదిలేసుకొని సంచలనం సృష్టించారు. తన సోషల్‌మీడియా ఖాతాలో ఆదివారం ఆయన కేరళ ముఖ్యమంత్రి అనే పదాన్ని తొలగించి సీపీఐఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు అనే పదాలను చేర్చారు. 140 అసెంబ్లీ స్థానాలున్న కేరళలో ఏప్రిల్ 9న ఒకే విడతలో పోలింగ్ జరిగింది. ఈసారి ఇక్కడ కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి గెలుపు ఖాయమని ఎక్కువ శాతం ఎగ్జిట్‌పోల్ సర్వేలు ప్రకటించాయి.

అస్సాంలో అధికారంపై కమల దళం ధీమా

అస్సాంలో అధికారాన్ని నిలబెట్టుకోవటంపై బీజేపీ ధీమాగా ఉంది. ఎగ్జిట్‌పోల్ సర్వేలు కూడా మళ్లీ బీజేపీదే అధికారమని ప్రకటించాయి. ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా గెలుపుపై ధీమా వ్యక్తంచేస్తోంది. 126 అసెంబ్లీ స్థానాలున్న ఈ రాష్ట్రంలో ఏప్రిల్ 9న పోలింగ్ జరిగింది. 2.50 కోట్ల ఓటర్లున్న ఇక్కడ.. 85.96 శాతం పోలింగ్ నమోదైంది. ఓట్ల లెక్కింపు కోసం 40 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 722 మంది అభ్యర్థుల భవితవ్యం నేడు తేలనుంది. కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో మొత్తం 30 అసెంబ్లీ స్థానాల ఓట్ల లెక్కింపు నేడు జరగనుంది. ముఖ్యమంత్రి ఎన్. రంగస్వామి నేతృత్వంలోని 'ఏఐఎన్ఆర్సీ - బీజేపీ' కూటమిదే మళ్లీ అధికారమని సర్వేలు తెలిపాయి. కాంగ్రెస్ - డీఎంకే కూటమి కూడా గెలుపుపై ధీమాగానే ఉంది.

నోబెల్ రేసులో 'ప్యాడ్‌మ్యాన్'

» అతితక్కువ ధరకు శానిటరీ నేప్‌కిన్ రూపకల్పన ఫలితం

» కోయంబత్తూరుకు చెందిన అరుణాచలం మురుగానందం ఘనత


» ఆ కథతోనే అక్షయ్‌కుమార్ హీరోగా ప్యాడ్‌మ్యాన్ సినిమా



అరుణాచలం మురుగానందం

చెన్నై, మే 3(ఆంధ్రజ్యోతి): యువతులు, మహిళలు వినియోగించే శానిటరీ నేప్‌కిన్‌లను అతి తక్కువ ధరకు అందించడంతోపాటు, వాటి తయారీ యంత్రాలను సైతం తక్కువ ధరకు అందిస్తున్న తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన అరుణాచలం మురుగానందం పేరు నోబెల్ బహుమతి రేసులోకి చేరింది. ఈయన ఇతివృత్తం ఆధారంగానే హిందీలో అక్షయ్‌కుమార్ హీరోగా రూపొందిన 'ప్యాడ్‌మ్యాన్' సినిమా దేశవ్యాప్తంగా హిట్టయ్యింది. ఈ నేపథ్యంలోనే నోబెల్ బహుమతికి ఆయన పేరును సిఫారసు చేయగా, జాబితాలో చోటు దక్కింది. ఈ ఏడాది 208 మంది ప్రైవేటు వ్యక్తులతోపాటు 79 సంస్థల పేర్లు కూడా నోబెల్‌కు సిఫారసు చేసిన జాబితాలో ఉన్నాయి. ఈ సందర్భంగా అరుణాచలం మురుగానందం ఆదివారం మీడియాతో మాట్లాడుతూ నోబెల్ పురస్కారానికి సిఫారసు చేసిన 208 మందిలో తన పేరు ఉండటం గర్వంగా ఉందన్నారు. శానిటరీ నేప్‌కిన్‌లను సరసమైన ధరలకు తయారుచేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఐరోపా సహా 40 దేశాలకు వ్యాపింపచేశామని చెప్పారు. వీటిపై దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో శిక్షణ, అవగాహన కార్యక్రమాలు కూడా చేపట్టామని తెలిపారు.

లోకం తీరు



ప్రపంచ ఆరోగ్యానికి అమీబా ముప్పు..!

» ప్రాణాంతక ఇన్ఫెక్షన్లకు కారణం కావొచ్చు.. హెచ్చరిస్తున్న శాస్త్రవేత్తలు

న్యూఢిల్లీ, మే 3: అమీబా అనేది ఏకకణ జీవి. ఇవి నీటిలో ఉండే బ్యాక్టీరియాను ఆహారంగా తీసుకుని.. నీటి వనరులు శుభ్రంగా ఉండేందుకు దోహదపడతాయి. పర్యావరణ సమతుల్యతకు తోడ్పడతాయి. అయితే వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా స్వేచ్ఛగా జీవించే అమీబాలు ప్రపంచ ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్నాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. అమీబాల్లో చాలావరకు హానికరమైనవి కానప్పటికీ.. కొన్ని ప్రాణాంతకమైన ఇన్ఫెక్షన్లకు కారణం కావచ్చని చెబుతున్నారు. వేడిని, క్రిమిసంహారకాలను తట్టుకుని జీవించగల వాటి సామర్థ్యం వల్ల వాటిని నియంత్రించడం కష్టంగా మారుతుందని అంటున్నారు. కాబట్టి మెరుగైన నిఘా, నీటి శుద్ధి అత్యవసరమని సూచిస్తున్నారు. ఇటీవల 'బయోకాంటెమినెంట్' జర్నల్‌లో ప్రచురించిన వ్యాసంలో.. ఈ చిన్న జీవులు ప్రపంచ ఆరోగ్యానికి కొత్త ప్రమాదంగా మారుతున్నాయని పరిశోధకులు వివరించారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, కాలం చెల్లిన నీటి సరఫరా, శుద్ధి వ్యవస్థల కారణంగా అమీబాలు వేగంగా వ్యాపిస్తున్నాయని అందులో పేర్కొన్నారు. నీటిలో జీవించే అమీబాల గురించి ఎవరికీ పెద్దగా తెలియకపోయినప్పటికీ.. వీటి నియంత్రణ, మంచి నీటి వ్యవస్థల నిర్వహణపై ఎక్కువ శ్రద్ధ వహించాలని తెలిపారు.

నాగ్లేరియా ఫౌలెరితో మెదడుకు ముప్పు

అమీబాలు.. తడి నేల, మంచినీరు, మానవనిర్మిత నీటి వ్యవస్థల్లో నివసించే ఏకకణ జీవులు. ఇవి హానికరమైనవికావు. కానీ.. కొన్ని జాతులు అరుదుగా మానవులకు తీవ్రమైన అనారోగ్యాన్ని కలిగిస్తాయి. వీటిలో నాగ్లేరియా ఫౌలెరి రకం అమీబా ఒకటి. వీటినే మెదడును తినేసే అమీబాలు అనీ పిలుస్తారు.

ఈవీల చార్జింగ్‌కు ఒకే వాలెట్!?

» అందులో డబ్బు జమ చేసుకుంటే ఏ కేంద్రంలోనైనా చార్జ్ చేసుకోవచ్చు!

» ఫాస్టాగ్ తరహాలో అందుబాటులోకి తెచ్చే యోచనలో రవాణా శాఖ

(సెంట్రల్ డెస్క్)

దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహన(ఈవీ)ల వినియోగం వేగంగా పెరుగుతోంది. ప్రజలు ఈవీల పట్ల మక్కువ చూపుతున్నారు. ఇటీవలి కాలంలో ఈవీలు కొనేవారి సంఖ్య పెరుగుతోంది. ఇంతవరకూ బాగానే ఉన్నా.. ఈవీలకు చార్జింగ్ విషయంలో మాత్రం వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. చార్జింగ్ కేంద్రాల్లో వేర్వేరు చెల్లింపు వ్యవస్థలు ఉండడంతో వాహనదారులకు తలనొప్పిగా మారుతోంది. ఏకరూప 'పేమెంట్ వాలెట్' లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. వివిధ కంపెనీల చార్జింగ్ స్టేషన్లు వేర్వేరు యాప్‌లు, వాలెట్లను ఉపయోగించడం వల్ల వినియోగదారులకు ఇబ్బందికరంగా ఉంటోంది. ఒక్కోసారి ఒకటి కంటే ఎక్కువ యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకొని, వాటిలో డబ్బులు జమ చేయాల్సి వస్తోంది. మరోవైపు ఒక నగరంలోనే వేర్వేరు స్టేషన్లు వేర్వేరు విధానాల్లో పనిచేయడం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బ్యాటరీ తక్కువగా ఉన్నప్పుడు, అత్యవసర సమయాల్లో సరైన యాప్ లేక చార్జింగ్ చేయలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దూర ప్రయాణాలు చేసేవారికైతే ఇది మరీ ఇబ్బందికరంగా మారుతోంది. ఈవీల విస్తరణకు ఇది ప్రధాన అవరోధంగా ఉందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని చార్జింగ్ స్టేషన్లకు అనుసంధానమయ్యే యూనిఫైడ్ పేమెంట్ సిస్టమ్‌ను అమల్లోకి తీసుకురావాలని నిపుణులు చెబుతున్నారు. ఈ సమస్యపై రాష్ట్ర రవాణా శాఖ దృష్టి సారించింది. ఫాస్టాగ్ తరహాలో ఈవీల చార్జింగ్‌కు ఒకే వాలెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తోంది. ఆ వాలెట్‌లో డబ్బు జమ చేసుకుంటే ఏ కంపెనీకి చెందిన చార్జింగ్ కేంద్రంలో అయినా వాహనాన్ని చార్జ్ చేసుకోవచ్చు. ఈ అంశంపై వాహన తయారీ సంస్థల ప్రతినిధులతో రవాణా శాఖ అధికారులు సమావేశమయ్యారు. ఒకే వాలెట్ విధానంపై ప్రతిపాదనలు అందించారు. ఆయా సంస్థలు ఆమోదం తెలిపిన వెంటనే ఒకే వాలెట్ విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు రవాణాశాఖ వర్గాలు తెలిపాయి.

చార్జింగ్ సమస్యలకు పరిష్కారాలివే..

- ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానం లో పెద్ద ఎత్తున చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలి.
- హైవేల వెంట ప్రతి 40-50 కిలోమీటర్లకు ఒక చార్జింగ్ కేంద్రం ఉండేలా ప్రణాళికలు రూపొందించాలి.
- అన్ని చార్జింగ్ స్టేషన్లకు అనుసంధానమయ్యే 'యూనిఫైడ్ పేమెంట్ సిస్టమ్'ను ప్రవేశపెట్టడం అత్యవసరం.
- స్థానిక సంస్థలు, డిస్కంలు కలిసి అపార్ట్‌మెంట్లు, కార్యాలయాలు, పార్కింగ్ స్థలాల్లో చార్జింగ్ పాయింట్ల ఏర్పాటును ప్రోత్సహించాలి.

9 మంది సజీవ దహనం!

ఢిల్లీలో ఏసీ అవుట్‌డోర్ యూనిట్ పేలి నివాస భవనంలో మంటలు



న్యూఢిల్లీ, మే 3 : దేశ రాజధాని న్యూఢిల్లీలో ఆదివారం తెల్లవారుజామున ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. ఓ నివాస భవనంలో రేగిన మంటల్లో చిక్కుకొని.. ఏడాదిన్నర చిన్నారి సహా తొమ్మిది మంది సజీవ దహనం అయ్యారు. మరో 20 మందిని అగ్నిమాపక సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రక్షించాయి. వీరిలో పలువురు స్వల్ప గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. న్యూఢిల్లీలోని వివేక్ విహార్ ప్రాంతంలో ఉన్న ఓ నాలుగంతస్తుల నివాస భవనంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. భవనం రెండో అంతస్తులోని ఏసీ అవుట్ డోర్ యూనిట్‌లో జరిగిన పేలుడే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా తేల్చారు. ఈ పేలుడు వల్ల షార్ట్ సర్క్యూట్ జరగ్గా.. భవనంలోని కొన్ని ఇళ్ల ప్రధాన ద్వారాలకు అమర్చి ఉన్న స్మార్ట్ లాక్‌లు జామ్ అయ్యాయి. దీంతో తలుపులు తెరుచుకోక ఇళ్లల్లో చిక్కుకొని పలువురు అగ్నికి ఆహుతి అయ్యారు. ఈ భయానక ఘటనకు సంబంధించి స్థానికులు, అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వివేక్ విహార్ ప్రాంతంలోని ఓ నాలుగంతస్తుల భవనంలో ఒక్కో అంతస్తులో రెండేసి ఇళ్లు ఉండగా.. ఎనిమిది కుటుంబాలు నివాసముంటున్నాయి. భవనం అంతటికి ఒక లిఫ్ట్, ఒకేఒక్క మెట్ల మార్గంఉంది. అయితే, ఆదివారం తెల్లవారుజామున 3:40 గంటల సమయంలో రెండో అంతస్తులోని ఓ ఏసీ అవుట్ డోర్ యూనిట్ నుంచి మంటలు రావడాన్ని ఓ డెలివరీ బాయ్ గుర్తించాడు. ఆ యూనిట్‌లో తొలుత పేలుడు సంభవించి షార్ట్ సర్క్యూట్ జరిగి భవనమంతా మంటలు వ్యాపించాయి. భవనంలోని ఇళ్లలో చెక్కతో చేసిన అలంకరణ సామగ్రి వల్ల మంటలు మరింత చెలరేగాయి. భవనమంతా పొగ కమ్మేయగా.. అగ్నికీలలు ఎగసిపడ్డాయి. లోపల ఇరుక్కున్న వారు సాయం కోసం ఆర్తనాదాలు పెట్టినా ఫలితం లేకపోయింది. అగ్నిప్రమాదంపై ఉదయం నాలుగు గంటల సమయంలో సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. 10 అగ్నిమాపక యంత్రాల సాయంతో ఐదు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. భవనంలోని ఇంటి బాల్కనీలకు ఏర్పాటు చేసుకున్న ఇనుప గ్రిల్స్, పక్షులు ఇళ్లలోకి రాకుండా ఏర్పాటు చేసుకున్న వలలు సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలిగించాయి. మంటలు అదుపులోకి వచ్చిన తర్వాత మొదటి అంతస్తులో ఒకటి, రెండో అంతస్తులో ఐదు, మెట్ల మార్గంలో మూడు మృతదేహాలను సహాయక బృందాలు గుర్తించాయి. షార్ట్ సర్క్యూట్ వల్ల రెండో అంతస్తులోని ఓ ఇంటికి ఉన్న స్మార్ట్ లాక్ జామ్ అయ్యింది. దీంతో ఆ ఇంట్లోని అరవింద్ జైన్(60), ఆయన భార్య అనిత జైన్ (58), వారి కుమారుడు నిషాంత్ జైన్(35) నిషాంత్ భార్య ఆంచల్ జైన్(33), అరవింద్ జైన్ మనమడు ఆకాశ్ జైన్ (ఏడాదిన్నర) అనే చిన్నారి లోపలి ఇరుక్కుపోయి మంటల్లో కాలిపోయారు. అలాగే, మొదటి అంతస్తులో శిఖా జైన్(45) అనే మహిళ మరణించగా ఆమె భర్త నవీన్ జైన్ (48) గాయాలతో బయటపడ్డారు. స్మార్ట్ లాక్ జామ్ అవ్వడం వల్లే వీరు కూడా ఇంట్లో నుంచి బయటకు రాలేకపోయినట్టు చెబుతున్నారు. ఇక, మూడో అంతస్తులోని మెట్ల మార్గంలో నితిన్ జైన్(50), షైలీ జైన్(48), కుమారుడు సామ్యక్ జైన్(25) సజీవ దహనమయ్యారు. మేడ మీదకు వెళ్లే గేటుకు తాళం వేసి ఉండగా.. పైకి వెళ్లలేకపోయిన వీరు పొగ వల్ల స్పృహ కోల్పోయారు. ఆపై, మంటల్లో దహనమయ్యారు. కాగా, ఈ ప్రమాదంపై లెఫ్టినెంట్ గవర్నర్ తరన్‌జీత్ సింగ్ సంధూ, సీఎం రేఖా గుప్తా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

అంతరిక్షంలో మన 'దృష్టి'

» ప్రపంచంలోనే తొలి ఆప్టోసార్ ఉపగ్రహం కక్ష్యలోకి

» భూపరిశీలన ఉపగ్రహ ప్రయోగం విజయవంతం

» స్పేస్‌ఎక్స్ రాకెట్ ద్వారా కాలిఫోర్నియా నుంచి ప్రయోగం

న్యూఢిల్లీ, మే 3: భారతీయ ప్రైవేటు అంతరిక్ష రంగంలో చరిత్రాత్మక ముందడుగు పడింది. బెంగళూరుకు చెందిన అంతరిక్ష స్టార్టప్ 'గెలాక్సీఐ' అభివృద్ధి చేసిన భూపరిశీలన ఉపగ్రహం 'దృష్టి' విజయవంతంగా కక్ష్యలోకి దూసుకెళ్లింది. స్పేస్ ఎక్స్‌కు చెందిన ఫాల్కన్9 రాకెట్ సాయంతో ఆదివారం కాలిఫోర్నియాలోని ప్రయోగ కేంద్రం నుంచి దీన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్టు గెలాక్సీఐ ప్రకటించింది. 'దృష్టి' అనేది ప్రపంచంలోనే ఆప్టో సార్ సాంకేతికత కలిగిన తొలి ఇమేజింగ్ ఉపగ్రహమని ఆ సంస్థ వెల్లడించింది. ఎలక్ట్రో ఆప్టికల్ (ఈవో), సింథటిక్ అపెర్చర్ రాడార్ (ఎస్ఏఆర్) సెన్సర్లను ఒకే ఆపరేషనల్ ప్లాట్‌ఫామ్‌లో అనుసంధానించినట్టు తెలిపింది. దీని సాయంతో రెండు వేర్వేరు రకాల డేటాను ఒక చోట చేర్చి, పగలు రాత్రి తేడా లేకుండా ఎలాంటి వాతావరణంలోనైనా అత్యంత స్పష్టమైన, సమగ్రమైన భూ పరిశీలన సమాచారాన్ని పొందవచ్చని పేర్కొంది. ఈ భూపరిశీలన ఉపగ్రహం రక్షణ, వ్యవసాయం, విపత్తు నిర్వహణ, సముద్ర పర్యవేక్షణ, మౌలిక సదుపాయాల ప్రణాళిక వంటి వివిధ రంగాలకు సమాచారం అందించడంలో ఉపయోగపడుతుందని వెల్లడించింది. ఇస్రో ఇటీవల తన వార్షిక నివేదికలో పేర్కొన్న 29 క్రియాశీల భూపరిశీలనా ఉపగ్రహాలతో సహా.. భారత్ చేపట్టిన అనేక కార్యక్రమాలకు కూడా 'దృష్టి' తోడ్పాటునందిస్తుందని భావిస్తున్నారు. 190 కిలోల బరువున్న దృష్టి భారత్‌లోని ప్రైవేటు సంస్థలు నిర్మించిన అతిపెద్ద శాటిలైట్లలో ఒకటని గెలాక్సీఐ తెలిపింది. ఆప్టో-సార్ టెక్నాలజీతో పనిచేసే ఈ ఉపగ్రహం 1.5 మీటర్ల రిజల్యూషన్‌తో స్పష్టమైన చిత్రాలు అందిస్తుందని పేర్కొంది. కాగా, 2030 నాటికి మిషన్ దృష్టిని పది ఉపగ్రహాల సమూహంగా విస్తరించాలని గెలాక్సీఐ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రయోగం విజయవంతం కావడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. 'ఎక్స్' వేదికగా గలాక్సీఐ బృందాన్ని అభినందించారు. దృష్టి ప్రయోగం విజయవంతంపై కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ కూడా హర్షం వ్యక్తం చేశారు. భారత అంతరిక్ష ప్రయాణంలో ఇదొక కీలక మైలురాయి అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

పిల్లలకు ఉచితంగా మధుమేహ పరీక్షలు, చికిత్స

» కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు విడుదల

న్యూఢిల్లీ, మే 3: పిల్లల్లో మధుమేహానికి సంబంధించి పరీక్షలు, రోగ నిర్ధారణ, చికిత్స, దీర్ఘకాల నిర్వహణ విధానాలపై కేంద్ర ఆరోగ్య శాఖ ఆదివారం మార్గదర్శక పత్రాన్ని విడుదల చేసింది. ఇటీవల కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య సంరక్షణకు సంబంధించి జరిగిన ఓ జాతీయ సదస్సులో 'పిల్లల్లో చక్కెర వ్యాధిపై మార్గదర్శక పత్రం'ను విడుదల చేశారు. పుట్టిన పిల్లల నుంచి నుంచి 18 ఏళ్ల వయసు లోపు వారిలో మధుమేహాన్ని ముందుగానే గుర్తించేందుకు కమ్యూనిటీ, స్కూల్ ఆధారిత వేదికల ద్వారా దేశవ్యాప్తంగా సార్వత్రిక స్క్రీనింగ్‌ను నిర్వహించడమే ఈ ఫ్రేమ్‌వర్క్ లక్ష్యమని ఆరోగ్య శాఖ తన ప్రకటనలో పేర్కొంది. అనుమానిత కేసులకు వెంటనే రక్తంలో గ్లూకోజ్ పరీక్షలు నిర్వహించి, ఆ తర్వాత నిర్ధారణ, చికిత్సల కోసం జిల్లా స్థాయి ఆరోగ్య కేంద్రాలకు పంపనున్నట్లు తెలిపింది. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో స్క్రీనింగ్ నుంచి రోగ నిర్ధారణ సేవలు, జీవితకాల ఇన్సులిన్ చికిత్స, గ్లూకోమీటర్లు, టెస్టు స్ట్రిప్‌లు, ఆ తర్వాత క్రమం తప్పని ఆరోగ్య సంరక్షణను ఉచితంగా అందించడం ఈ కార్యక్రమంలో ఓ కీలకమైన విషయమని వెల్లడించింది.

వెన్నెముక లోపాలకు కొత్త శస్త్రచికిత్స విధానం

» అభివృద్ధి చేసిన ఢిల్లీ ఎయిమ్స్ వైద్యులు

న్యూఢిల్లీ, మే 3: తీవ్రమైన, సంక్లిష్టమైన వెన్నెముక వైకల్యాలతో బాధపడుతున్న రోగులకు చికిత్సకు సంబంధించి ఢిల్లీ ఎయిమ్స్ వైద్యులు ఒక సరికొత్త శస్త్ర చికిత్స విధానాన్ని అభివృద్ధి చేశారు. ఇది వెన్నెముక వైకల్య చికిత్సలో కీలక మలుపుగా నిలవనుంది. ఢిల్లీ ఎయిమ్స్ ఆర్థోపెడిక్ విభాగానికి చెందిన డాక్టర్ భవుక్ గార్గ్ నేతృత్వంలోని వైద్య బృందం దాదాపు ఏడేళ్ల పాటు కృషి చేసి, ఈ నూతన సర్జికల్ టెక్నిక్‌ను అభివృద్ధి చేసింది. ఇది వెన్నెముక లోపాలతో బాధపడుతున్న, గతంలో పరిమిత చికిత్సా ఎంపికలు ఉన్న, శస్త్రచికిత్స సమయంలో సమస్యలు వచ్చే అవకాశం ఉన్న వారిలో కొత్త ఆశలు రేపుతోంది. ఈ పద్ధతి ప్రపంచవ్యాప్తంగా అత్యంత సంక్లిష్టమైన వెన్నెముక వైకల్య సవరణ ప్రక్రియల్లో ఒకటిగా పరిగణించే పోస్టీరియర్ వెర్టెబ్రల్ కాలమ్ రీసెక్షన్ (పీవీసీఆర్)కు మెరుగుపరిచిన విధానమని ఎయిమ్స్ పేర్కొంది.

మహానాడుకు 4 స్థలాల ఎంపిక

» తుది నిర్ణయం రాష్ట్ర కమిటీదే: ఆనం



నెల్లూరులో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

నెల్లూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ మహానాడు నిర్వహణకు జిల్లాలో నాలుగు చోట్ల స్థలాలు ఎంపిక చేసి నాయకత్వానికి పంపామని దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. రాష్ట్ర కమిటీ తుది నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఆదివారం నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో టీడీపీ ఆత్మకూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేశ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత నిర్వహిస్తున్న తొలి మహానాడు కావడంతో గుర్తుండిపోయేలా నిర్వహిస్తామన్నారు. దీనికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తామని, కార్యక్రమం విజయవంతానికి గ్రామ గ్రామానా పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపిచ్చారు. ఆత్మకూరు నియోజకవర్గాన్ని పసుపుమయం చేస్తామన్నారు. జిల్లాలో విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని.. రూ.3653 కోట్లతో బద్వేలు నుంచి నెల్లూరు వరకు 108.73 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ జరుగుతోందని.. ఆత్మకూరు నియోజకవర్గంలోని మర్రిపాడు, అనంతసాగరం, కలువాయి, చేజెర్ల మండలాలతో పాటు మనుబోలు, పొదలకూరు, వెంకటాచలం మండలాల మీదుగా రోడ్డు విస్తరణ జరుగుతున్నట్లు తెలిపారు. సమావేశంలో టీడీపీ నేత గిరినాయుడు, మంత్రి కుమార్తె కైవల్య తదితరులు పాల్గొన్నారు.

వేసవి రద్దీకి విస్తృత ఏర్పాట్లు

» భక్తులకు ఉపశమనం కలిగించేలా టీటీడీ చర్యలు

తిరుమల, మే 3 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల రద్దీని దృష్టిలో పెట్టుకుని భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఎండ నుంచి ఉపశమనం కల్పించేలా బాటగంగమ్మ ఆలయ సర్కిల్ నుంచి గోగర్భం డ్యాం సర్కిల్ మీదుగా ఔటర్ రింగురోడ్డు వరకు చలువ పందిళ్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌-2, మ్యూజియం ప్రాంగణం, నారాయణగిరి ఉద్యానవనాల్లో షెల్టర్లు ఏర్పాటు చేశారు. క్యూలైన్లు, శ్రీవారి ఆలయ పరిసర ప్రాంతాలు, మాడవీధులలో కూల్ పెయింట్ వేశారు. చాలా ప్రదేశాల్లో తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మించారు. మరోవైపు మొబైల్ వాటర్ క్యాన్లతో శ్రీవారి సేవకులు ఎప్పటికప్పుడు భక్తుల వద్దకే వెళ్లి నీరు అందజేస్తున్నారు. అలాగే పారిశుధ్యంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టారు. సాధారణ రోజుల్లో 3.50 లక్షల లడ్డూలను భక్తులకు అందుబాటులో ఉంచగా, రద్దీని దృష్టిలో పెట్టుకుని అదనంగా మరో 3.50 లక్షలను బఫర్ స్టాక్‌గా అందుబాటులో ఉంచారు.



ఆలయం ముందు ఏర్పాటు చేసిన షెడ్లు

ఖైదీల సొమ్ముకూ కక్కుర్తి!

(మొదటి పేజీ తరువాయి)

ఖైదీలు ఉన్నారు. నేర నిరూపణతో జైలుకొచ్చిన ఖైదీల్ని సంస్కరించి శిక్షా కాలం పూర్తయ్యాక వారిని మరోమారు తప్పు చేయకుండా ఉండేలా బయటికి పంపిస్తారు. ఈ ప్రక్రియకు అవసరమైన నిధులను పెంట్రోలు బంకుల ద్వారా జైళ్ల శాఖ సమకూర్చుకుంటోంది. రాష్ట్రవ్యాప్తంగా జైళ్ల ప్రాంగణాల్లో 25 పెట్రోలు బంకులు ఉండగా ప్రతి నెలా కనీసం రూ.కోటి తగ్గకుండా ఆదాయం వస్తోంది. ఈ సొమ్మును ఖైదీల సంక్షేమానికి వినియోగించాల్సి ఉంది. అయితే కొందరు అవినీతి అధికారులు తమ విలాసాల కోసం ఆ నిధులను పక్కదారి పట్టించారు. అనధికారిక సమాచారం మేరకు.. ఖైదీల సంక్షేమ నిధి నుంచి వచ్చే వడ్డీని వీరు సొంతానికి వాడేసుకున్నట్లు పక్కా ఆధారాలు బయట పడటంతో జైళ్ల శాఖ ఇన్‌చార్జి డీజీ తాజాగా ఏకధాటిన 12 గంటల పాటు సమీక్షించారు. రూ.కోట్ల విలువైన పెట్రోలు, డీజీలు అప్పుగా పోశామని కొందరు అధికారులు చెప్పడంతో వెంటనే ఆ మొత్తం వసూలు చేయాలని, ఇకపై ప్రతి నెలా 10వ తేదీ లోపు పెట్రోలు బంకుల నుంచి వచ్చే ఆదాయాన్ని ఖైదీల సంక్షేమ నిధిలోకి జమ చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఇప్పటివరకూ ఖైదీల సంక్షేమ నిధి రూ.100 కోట్లు ఉన్నట్లు తేలినా మరో రూ.20 కోట్లకు పైగా పక్కదారి పట్టినట్లు తేలింది. అందులో రూ.12కోట్లు వెంటనే చెల్లించాలని, మిగతా మొత్తం నెల రోజుల్లో జమ చేసేందుకు గడువు ఇచ్చినట్లు తెలిసింది. డబ్బులు చెల్లించకపోతే క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోనని డీజీ హెచ్చరించడంతో బాధ్యులైన అధికారుల గుండెల్లో రాయి పడిందని సమాచారం. కార్పస్ ఫండ్, సిబ్బంది సంక్షేమ నిధి ఖర్చుల వివరాల్లో అవకతవకలు కనిపించడంతో 15ఏళ్ల నుంచి పూర్తిస్థాయి ఆడిట్ నిర్వహించాలని బాలసుబ్రహ్మణ్యం ఆదేశించడం ప్రకంపనలు సృష్టిస్తోంది.

సిబ్బందిలో సంతోషం

గతేడాది జైళ్ల శాఖ సిబ్బంది బదిలీల సందర్భంగా అధికారుల బేరసారాలపై బహిరంగ విమర్శలు వచ్చాయి. వీటన్నింటికి చెక్ పెడుతూ మూడేళ్లు దాటిన అందరినీ బదిలీల పరిధిలోకి తీసుకొచ్చారు. ప్రతి ఒక్కరికీ మూడు ఆప్షన్లు ఇచ్చి, వారి ప్రాంతానికి 200 కి.మీ. దూరంలోపు పనిచేసేలా డీజీ నిర్ణయం తీసుకున్నారు. అలాగే శాఖలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పదోన్నతి లభించింది. సోమవారం వందల మందికి పదోన్నతులకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడే ఆవకాశం ఉంది. డీజీ చొరవతో పూర్తి పారదర్శకంగా బదిలీలు నిర్వహించడంతో పాటు పదోన్నతుల ఫైల్‌కు ఎట్టకేలకు మోక్షం లభించడంతో సిబ్బందిలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

భద్రతకు అత్యంత ప్రాధాన్యం

రాష్ట్రంలోని జైళ్ల నుంచి తప్పించుకుని పారిపోతున్న ఖైదీల సంఖ్య ఇటీవల పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సీసీ కెమెరాల ఏర్పాటు, వాకీటాకీలు, మెటల్ డిటెక్టర్లు, సెల్‌ఫోన్ డిటెక్టర్లు కొనుగోలు చేయాలన్న కసరత్తు మూడేళ్లుగా సాగుతున్నా కొలిక్కి రాలేదు. అవసరం మేరకు వాటిని వెంటనే కొనుగోలు చేయడంతో పాటు అన్ని జైళ్లలోనూ ప్రహరీలపై లైవ్ విద్యుత్ వైర్ ఏర్పాటు చేయాలని తాజా సమీక్షలో డీజీ నిర్ణయించారు. రాష్ట్రంలోని అన్ని జైళ్ల పరిధిలో ఉన్న భూముల్ని గుర్తించి కంచె ఏర్పాటు చేసి కాపాడాలని ఆదేశాలిచ్చారు.

అమరావతిలో సెంట్రల్ జైలు.. ట్రైనింగ్ సెంటర్

రాష్ట్రంలో ప్రస్తుతం కడప, నెల్లూరు, రాజమహేంద్రవరం, విశాఖపట్నంలలో నాలుగు కేంద్ర కారాగారాలు ఉన్నాయి. రాజధాని నిర్మాణంలో భాగంగా అమరావతిలో అధునాతన కేంద్ర కారాగారంతో పాటు సిబ్బంది శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జైళ్ల శాఖ నిర్ణయం తీసుకుంది. కేంద్రం మంజూరు చేసిన రూ.200 కోట్ల నిధులతో సెంట్రల్ జైలు నిర్మించేందుకు అవసరమైన స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో బోస్టల్ స్కూల్ (మైనర్ల కారాగారం) లేకపోవడంతో తక్షణమే నెల్లూరు కేంద్ర కారాగారంలోని ట్రైనింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేయడంపైనా సమీక్షలో చర్చించారు.

వృద్ధులకు మందుల గండం!

» 60ఏళ్లు పైబడిన వారిలో అధికంగా పాలీఫార్మసీ

» ఒకేసారి ఎక్కువ మందులు, సమన్వయం లేకుండా వాడకం

» ఔషధాల అతి వినియోగంతో డ్రగ్ రియాక్షన్ ముప్పు

» ఓ మెడికల్ కాలేజీ అధ్యయనంలో వెల్లడి

» మందులు రాసే ముందు రోగి పాత ప్రిస్క్రిప్షన్లను వైద్యులు తనిఖీ చేయాలని సూచన



హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): వయస్సు మళ్లిన తర్వాత మనుషులు రోగాల బారిన పడడం సహజం. ఆ రోగాల నుంచి ఉపశమనం పొందేందుకు మందులు వాడడం కూడా సహజమే. అయితే, 'కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయినట్లు'గా ఆరుపదుల వయసు దాటిన వారి పరిస్థితి మారుతోంది. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న చాలా మంది వృద్ధులు.. రోజుకు ఐదారు రకాల మందులు తీసుకుంటాంటారు. ఇలాంటి వారిలో ఆ మందుల వల్ల కొత్త సమస్యలు తలెత్తి ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయని ఖమ్మం మమత మెడికల్ కాలేజీ పరిశోధక బృందం నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. ఓ వ్యక్తి ఐదు లేదా అంతకంటే మందులు వేసుకోవడాన్ని పాలీఫార్మసీ అంటారు. వృద్ధుల్లో పాలిఫార్మసీ విపరీతంగా పెరుగుతోందని, దీనివల్ల డ్రగ్ రియాక్షన్ ముప్పు పొంచి ఉందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ప్రతీ 100 మందిలో 64 శాతం మందికి డ్రగ్ రియాక్షన్ ముప్పు అధికంగా ఉందని ఆ అధ్యయనం పేర్కొంది. ఖమ్మం మమత మెడికల్ కాలేజీలో 2025 ఫిబ్రవరి నుంచి 2026 జనవరి వరకు ఏడాది పాటు నిర్వహించిన ఈ అధ్యయన వివరాలు ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ మెడికల్ అండ్ ఫార్మాస్యూటికల్ రీసెర్చ్‌లో ఇటీవల ప్రచురితమయ్యాయి.

ప్రమాదకరమైన మందుల కలయికలు ఇవే..

సాధారణంగా వైద్యులు రాసే కొన్ని మందుల కాంబినేషన్లు వృద్ధుల్లో తీవ్ర ప్రభావం చూపుతాయని అధ్యయనం హెచ్చరించింది:

- ఆస్పిరిన్ + క్లోపిడోగ్రెల్: గుండె సమస్యల కోసం ఈ రెండింటినీ కలిపి వాడటం వల్ల రోగుల్లో రక్తస్రావం అయ్యే ప్రమాదం ఉంది.
- ఇన్సులిన్ + బీటా-బ్లాకర్స్: షుగర్, బీపీ మందులు కలిపి వాడే వృద్ధుల్లో షుగర్ లెవల్స్ పడిపోయినప్పుడు వచ్చే ముందస్తు హెచ్చరిక లక్షణాలను బీపీ మందులు అణచివేస్తాయి. దీనివల్ల రోగి కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది.
- ఇన్హిబిటర్లు +పొటాషియం: బీపీ మందులు, కిడ్నీ సమస్యలకు వాడే మందుల వల్ల రక్తంలో పొటాషియం స్థాయి పెరిగి గుండెపై ప్రభావం పడుతుంది.

పొంచి ఉన్న డ్రగ్ రియాక్షన్ల ముప్పు

అధ్యయనంలో భాగంగా 60 ఏళ్లు పైబడిన 100 మంది వృద్ధుల ఆరోగ్య పరిస్థితి, వారు వినియోగిస్తున్న మందులను నిపుణులు పరిశీలించారు. అధ్యయనంలో పాల్గొన్న రోగులకు వైద్యులు సగటున 7.4 రకాల మందులను సిఫారసు చేశారు. ఈ రోగుల్లో ఏకంగా 78 శాతం మంది పాలీఫార్మసీ కేటగిరిలో ఉన్నారు. 24 శాతం మంది 10 అంతకంటే ఎక్కువ రకాల మందులను ప్రతిరోజూ తీసుకుంటున్నారు. ఈ వృద్ధుల్లో అధిక రక్తపోటు, మధుమేహం, కీళ్ల నొప్పులు, హృద్రోగ, కిడ్నీ తదితర సమస్యలతో బాధపడుతున్న వారున్నారు. వీరిలో కొందరు ఎక్కువ జబ్బులతో బాధపడుతుండడం వల్ల వేర్వేరు వైద్యులు సిఫారసు చేసిన మందులను వినియోగిస్తున్నారు. ఒకేసారి అనేక రకాల మందులు తీసుకోవడం వల్ల ఆ మందుల మధ్య రసాయన చర్యలు జరిగి సైడ్ ఎఫెక్ట్స్‌కు అవకాశం ఉందని అధ్యయనం వెల్లడించింది. 64 శాతం మంది రోగులలో కనీసం ఒక డ్రగ్ రియాక్షన్ జరిగే అవకాశం ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 148 డ్రగ్ ఇంటరాక్షన్లను పరిశోధకులు గుర్తించగా.. ఇందులో 54.7% మధ్యస్థంగా, 27.7% స్వల్పంగా, 17.6% అత్యంత ప్రమాదకరంగా ఉన్నట్లు తేలింది. రోగి వాడే మందుల సంఖ్య పెరిగే కొద్దీ, జబ్బుల సంఖ్య 3 దాటితే రియాక్షన్ల ముప్పు పెరుగుతోందని గుర్తించారు. మందులు రాసే ముందు రోగి పాత ప్రిస్క్రిప్షన్లను వైద్యులు తనిఖీ చేసి, అవసరం లేని మందులను తగ్గించాలని డాక్టర్ సురేష్ బాబు సాయన, డాక్టర్ ఆలస్యం నవీన్, శ్రీహర్ష రాయల బృందం నివేదికలో స్పష్టం చేసింది.

పాలీ ఫార్మసీతో నష్టాలు

రెండు వేర్వేరు మందులు కలిసినప్పుడు అవి శరీరంలో రసాయన చర్య జరుపుతాయి. దీనివల్ల ఒక మందు పనితీరు తగ్గవచ్చు. లేదా ఆ రెండు కలిసి విషతుల్యమైన ప్రభావాన్ని చూపవచ్చు. ఎక్కువ మందులు వాడటం వల్ల కళ్లు తిరగడం, అలసట, జీర్ణక్రియ సమస్యలు, కిడ్నీలపై ఒత్తిడి పెరుగుతుంది. వృద్ధుల్లో దీనివల్ల సమతుల్యత దెబ్బతిని కింద పడిపోయే ప్రమాదం ఉంటుంది. కొన్నిసార్లు ఒక మందు వల్ల వచ్చే సైడ్ ఎఫెక్ట్స్‌ను మరో వ్యాధిగా పొరబడి, దానిని తగ్గించడానికి వైద్యుడు మరో కొత్త మందు రాస్తారు. ఇలా మందుల సంఖ్య పెరిగిపోతూనే ఉంటుంది. ఇది రోగిపై ఆర్థిక భారాన్ని కూడా పెంచుతుంది.

ప్రతి నియోజకవర్గానికి హైవేలు కలిసేలా ప్రణాళిక

» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

ద్వారకాతిరుమల, మే 3 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు ప్రతి నియోజకవర్గానికి హైవేలు కలిసేలా త్వరలో ప్రణాళిక సిద్ధం చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలంలో ఆదివారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సీహెచ్ పోతేపల్లిలో మాట్లాడుతూ 'రాష్ట్రంలో డబుల్‌ఇంజన్ సర్కార్ నడుస్తోంది.. మన ప్రాంతానికి రెండు నేషనల్ హైవేలు తెచ్చాం. ఏడాదిన్నర కాలంలో ఏపీకి 15 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయి. మోదీ, బాబు నేతృత్వంలో జరుగుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై పెట్టుబడులు పెడుతున్నారు' అని పేర్కొన్నారు.



శంకుస్థాపన పూజలు చేస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు దంపతులు

ప్రశాంతంగా రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన

» ఆకివీడు పెదపేటలో భారీ పోలీసు బందోబస్తు

ఆకివీడు, మే 3 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు పెదపేట రామాలయ పునర్నిర్మాణ శంకుస్థాపన ప్రశాంతంగా జరిగింది. ఆదివారం ఉదయం ఏడు గంటల 14 నిమిషాలకు డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు, రమాదేవి దంపతులు భూమిపూజ చేశారు. ఆలయ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ కొన్ని దళిత సంఘాలు పిలుపు నివ్వడంతో...ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా 580 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. భూమిపూజ ప్రాంగణం లోపలికి వచ్చేవారిని మెటల్ డిటెక్టర్‌తో తనిఖీ చేసి పంపించారు. పూజల అనంతరం రఘురామ మాట్లాడుతూ 800 ఏళ్లు చెక్కు చెదరకుండా ఉండేందుకు కృష్ణ శిల్ప రాళ్లతో రామాలయం నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరు బాపిరాజు తదితరులు పాల్గొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి బందోబస్తు పర్యవేక్షించారు.

150 మంది బైండోవర్

పెదపేట రామాలయ పునర్నిర్మాణ శంకుస్థాపన నేపథ్యంలో బహుజన సమాజ్ వాదీ పార్టీ(బీఎస్పీ) నేతలు రాష్ట్రం నలుమూలలు నుంచి ఆకివీడుకు బయలుదేరారు. అనంతపురం, చిత్తూరు, అల్లూరి సీతారామరాజు, అంబేడ్కర్ కోనసీమ, కృష్ణా తదితర జిల్లాల నుంచి రైళ్ల ద్వారా సుమారు మూడు వందల మంది ఆకివీడు చేరుకున్నారు. పెదపేటలోకి ఎవరూ వెళ్లకుండా పోలీసు బందోబస్తు ఉండడంతో జాతీయ రహదారిపై జైభీమ్ అంటూ నిరసనలు చేపట్టారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. వీరిలో 150 మందిని బైండోవర్ చేసినట్టు ఆకివీడు ఎస్ఐ హనుమంతు నాగరాజు తెలిపారు. అలాగే వివిధ వాహనాల్లో వస్తున్న వారిని జిల్లాలోని పలుచోట్ల పోలీసులు అడ్డుకున్నారు.

రారెత్తించిన ఎండ.. దంచికొట్టిన వాన!

» రాష్ట్రంలో భిన్న వాతావరణం

» పలు జిల్లాల్లో ఈదురుగాలుల బీభత్సం

» ముమ్మిడివరంలో 7.2 సెం.మీ. నమోదు

» దక్షిణ కోస్తా, సీమలో వడగాడ్పులు

» గూడూరులో 46.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

» రేపు, ఎల్లుండి ఉత్తరకోస్తాకు భారీ వర్షసూచన



బాపట్ల జిల్లా పర్చూరు మండలం దేవరపల్లిలో వర్షానికి కల్లాల్లో తడిచిన మిర్చి

విశాఖపట్నం, అమరావతి, పర్చూరు, నెల్లూరు(హరనాథపురం): మే 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆదివారం అనేకచోట్ల ఎండలు రారెత్తించగా.. పలు చోట్ల పిడుగులు, ఈదురుగాలుల వర్షాలతో భిన్న వాతావరణం నెలకొంది. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో 7.2 సెంటీమీటర్లు, కాట్రేనికోనలో 5.7, కాకినాడ జిల్లా పెద్దాపురంలో 5, పిఠాపురంలో 4.5 సెంటీమీరట్ల వర్షపాతం నమోదైంది. మరోవైపు దక్షిణ కోస్తా, రాయలసీమలో పలుచోట్ల వడగాడ్పులు, మిగిలినచోట్ల వేడి వాతావరణం కొనసాగింది. ఈ వేసవిలోనే అత్యధికంగా నెల్లూరు జిల్లా గూడూరులో ఆదివారం 46.2, ప్రకాశం జిల్లా కొప్పెరపాడు, బల్లికురవలో 46.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయ్యాయి. రానున్న 24 గంటల్లో ఉత్తరకోస్తాలో పలుచోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమలో ఈదురుగాలులు, పిడుగులతో వర్షం కురుస్తుదని, దక్షిణ కోస్తా, రాయలసీమలో ఎండ తీవ్రత కొనసాగుతుందని వాతావరణశాఖ తెలిపింది. ఐదు, ఆరో తేదీల్లో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని, ఏడో తేదీ వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని పేర్కొంది.



గాలివానకు ఒంగోలులో కూలిన చెట్టు

గాలివాన బీభత్సం

బాపట్ల జిల్లా పర్చూరులో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. పెనుగాలులకు 40 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కరెంటు సరఫరా నిలిచిపోయింది. కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి దెబ్బతింది. పర్చూరు మండలం దేవరపల్లి సమీప కల్లాల్లో ఎండబెట్టిన ఆరు ఎకరాల మిర్చికాయలు వర్షానికి తడిచిపోయాయి. అక్కడక్కడా కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న విత్తనాలు సైతం అకాల వర్షానికి తడిచిపోయాయి. నెల్లూరు నగరంలో పెనుగాలులు బీభత్సం సృష్టించాయి. విద్యుత్ అంతరాయంతో పలు వీధులు అంధకారంతో మునిగాయి. రోజంతా భానుడి భగభగలతో అల్లాడిపోయిన ప్రజలకు ఈ వర్షం కొంత ఉపశమనాన్ని కలిగించింది. మర్రిపాడు మండలంలోని చిన్న మాచునూరు, కలికిరి మండలం కుమ్మర కొండూరులో ఈదురు గాలులకు ఇళ్లపై ఉన్న రేకులు ఎగిరిపోయాయి. చిన్నమాచునూరులో వేపచెట్టు నేలకొరిగింది. కరెంట్ స్తంభం ఒరిగి ట్రాక్టర్‌పై పడింది. ఆత్మకూరులో తోటల్లో మామిడి కాయలు రాలడంతో యజమానులు ఆందోళన చెందారు. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

ఒంగోలు అతలాకుతలం భీకరగాలులతో విరిగిన చెట్లు

ఒంగోలు/మార్కాపురం మే 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఆదివారం రాత్రి పెనుగాలులతో కూడిన వర్షం జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. మధ్యాహ్నం వరకూ ఎండ మండింది. దాదాపు సగం మండలాల్లో 42 నుంచి 45.7 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. సాయంత్రానికి వాతావరణం ఒక్కసారిగా మారింది. గాలీ వర్షానికి పలు ప్రాంతాల్లో పెద్దపెద్ద చెట్లు విరిగి పడ్డాయి. ఒంగోలులోని గుంటూరు రోడ్డులో నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్‌లో బెలూన్‌పై పిల్లలు ఆడుకుంటున్న సమయంలో అది కూలిపోయింది. ఎవ్వరికీ ఎలాంటి ప్రమాదం జరక్కపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు గాలుల తీవ్రతతో విద్యుత్ సరఫరాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఒంగోలు సహా, జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా లేక, మరోవైపు ఈదురుగాలులతో కూడిన వర్షంతో ప్రజానీకం అవస్థలు పడ్డారు. పలు చోట్ల హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు గాలుల తీవ్రతకు పడిపోయాయి. కంభంలో కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొన్ని రేకులషెడ్లపై ఉన్న పైకప్పులు ఎగిరిపోయాయి.

తిరుమలేశుడి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



శ్రీవారి ఆలయం ముందు జస్టిస్ పీఎస్ నరసింహ

తిరుమల, మే 3 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. న్యాయమూర్తికి రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

టీచర్లకు పదోన్నతులు కల్పించాలి: రూసో

అమరావతి, మే 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు అన్ని కేడర్లలో పదోన్నతులు కల్పించాలని ఉపాధ్యాయ సంఘాల సంయుక్త సంస్థ(రూసో) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రూసో చైర్మన్ సీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్రస్థాయి వర్చువల్ సమావేశం నిర్వహించారు. టీచర్ల సమస్యలపై విడతలవారీగా వేసవిలో నిరసనలు చేపట్టాలని తీర్మానించారు. హైస్కూల్ ప్లస్‌లలో ఉన్న ఖాళీలను స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేయాలని కోరారు. 33 డిమాండ్ల సాధన కోసం ఈనెల 11న కడప కలెక్టరేట్ వద్ద, 25న విశాఖపట్నం కలెక్టరేట్ వద్ద, జూన్ 8న గుంటూరు కలెక్టరేట్ వద్ద ధర్నాలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు.

ఎయిడెడ్ టీచర్ల సీనియారిటీ జాబితా రూపొందించాలి

అమరావతి, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎయిడెడ్ టీచర్లకు సీనియారిటీ జాబితా రూపొందించి, కౌన్సెలింగ్ ద్వారా ఒక్కరే టీచర్ ఉన్న పాఠశాలలకు బదిలీ చేయాలని ఏపీ టీచర్స్ గిల్డ్ డిమాండ్ చేసింది. గిల్డ్ ప్రతినిధులు బి.చిట్టిబాబు, ఎల్.కె.చిన్నప్ప, ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. 205 ఎయిడెడ్ పాఠశాలల్లో ఒక్కొక్కరు చొప్పున మాత్రమే టీచర్లు ఉన్నారని తెలిపారు. మరణించిన టీచర్ల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని, భాషా టీచర్లకు పదోన్నతులు కల్పించాలని కోరారు.

హియరింగ్ హ్యాండీక్యాప్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

విజయవాడ (గాంధీనగర్), మే 3 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ హియరింగ్ హ్యాండీక్యాప్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా వి.కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఏ.వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఏ.కన్నా, కోశాధికారిగా ఎస్‌కే ఇమామ్ ఖాసీం ఎన్నికయ్యారు. విజయవాడ గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవో హోమ్‌లో ఆదివారం నిర్వహించిన ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని ఎన్నికల అధికారి ఏ.రంజిత్‌కుమార్ నాయుడు ప్రకటించారు. 17 మంది సభ్యులతో కార్యవర్గం ఏర్పాటైనట్టు తెలిపారు.

మావోయిస్టు పార్టీ సభ్యుని లొంగుబాటు

ఎటపాక,మే 3(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ సభ్యుడు కొవ్వాసి దేవా పోలీసుల ఎదుట లొంగిపోయినట్టు రంపచోడవరం ఓఎస్డీ పంకజ్ కుమార్ మీనా తెలిపారు. పోలవరం జిల్లా ఎటపాక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. దేవా ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఊసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని భూసాపూర్ గ్రామస్థుడని తెలిపారు. మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలకు విసిగిపోయి జనజీవన స్రవంతిలో కలిసినట్టు తెలిపారు. దేవాకు సరెండర్, పునరావాస పథకం ప్రకారం ప్రభుత్వం అందించే సదుపాయాలను కల్పిస్తామని ఓఎస్డీ వివరించారు.

కుప్పకూలిన శ్లాబు

» కార్మికుడి దుర్మరణం..మరో ముగ్గురికి గాయాలు

» పాత శ్లాబును ఎత్తు పెంచేందుకు ప్రయత్నిస్తుండగా ప్రమాదం



కూలిన షాపు శ్లాబు

పెదగంట్యాడ, (విశాఖపట్నం), మే 2 (ఆంధ్రజ్యోతి): పాత శ్లాబు ఎత్తు పెంచేందుకు చేసిన ప్రయత్నం బెడిసికొట్టి కుప్పకూలిపోయింది. ఈ ఘటనలో ఓ కార్మికుడు మృతిచెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలు...విశాఖ జిల్లా పెదగంట్యాడ మండలం వికాస్‌నగర్ మెయిన్ రోడ్డు పక్కన నవీన్‌కుమార్‌కు ఓ పాత షాపు ఉంది. సుమారు 13 అడుగుల పొడవు 12 అడుగుల వెడల్పున్న ఈ షాపు శ్లాబు ఎత్తు పెంచేందుకు ఆరుగురు కూలీలను నియమించారు. వారు ఆదివారం సాయంత్రం ఆరు గంటల సమయంలో 12 జాకీలతో శ్లాబును పైకి ఎత్తే ప్రయత్నంచేశారు. ఈ నేపథ్యంలో శ్లాబు రెండు ముక్కలుగా విరిగిపోయి ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో తిమ్మల నాగేశ్వరరావు (38) మృతిచెందగా, సొంగల ప్రసాదరావు, నారాయణరావు, సత్యనారాయణ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మరో ఇద్దరు కార్మికులు రాజు, నారాయణ ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. శకలాల్లో చిక్కుకున్న కార్మికుడి మృతదేహాన్ని బయటకు తీసేందుకు పోలీసులు, విపత్తుల నిర్వహణ శాఖ సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. న్యూపోర్టు పోలీసులు గంగవరం పోర్టు నుంచి క్రేన్‌ను రప్పించి, శ్లాబును పైకి లేపి మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. న్యూపోర్టు సీఐ టి.కామేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

వివిధ

vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక
బొమ్మలు: అక్బర్

రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సభ

శ్రీనెల్లూరు వర్ధమాన సమాజం ఆధ్వర్యంలో పి.వి.రమణారెడ్డి స్మృత్యర్థం రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సభ మే 8 సా.6గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ప్రధాన వక్త వాడ్రేవు చిన వీరభద్రుడు ఠాగూర్ కథలపై ప్రసంగిస్తారు. ముఖ్య అతిథి ఏనుగు నరసింహారెడ్డి, సభాధ్యక్షురాలు అత్తలూరి విజయలక్ష్మి.

వినయ

'రోణంకి అప్పలస్వామి– జీవితం–సాహిత్యం' అంశంపై సాహిత్య సభ

సహజ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మే 10 సా.6గంటలకు విజయ నగరం, స్థానిక గ్రంథాలయంలో 'రోణంకి అప్పలస్వామి–జీవితం–సాహిత్యం' అంశంపై సాహిత్య సభ జరుగుతుంది. ప్రధాన వక్త రామసూరి, ముఖ్య అతిథి కె. రామారావు.

ఎన్ కె బాబు

కవిత్వ శిక్షణా శిబిరం

తెలుగు శాఖ, డా.ఎస్.ఆర్.కె. ప్రభుత్వ కళాశాల, యానాం & కవిసంధ్య, సాహిత్య సాంస్కృతిక సంస్థ సంయుక్త నిర్వహణలో జూన్ 13, 14 తేదీలలో యానాంలో వర్ధమాన కవుల కోసం కవిత్వ శిక్షణా శిబిరం జరుగుతుంది. ప్రముఖ కవులు, విమర్శకులు వివిధ కవిత్వ అంశాలపై ప్రసంగిస్తారు. ఆసక్తి గల యువ కవులు సంక్షిప్త బయోడేటా, ఇటీవలి తమ ఒక కవితను మే 20 లోపు దాట్ల దేవదానం రాజు వాట్సాప్ నంబర్ :9440105987 కు పంపాలి. ఎంపికైన అభ్యర్థులు తమ ఖర్చులతో శిక్షణాశిబిరంలో పాల్గొనాలి. స్థానిక వసతి, భోజన సౌకర్యం సంస్థ కల్పిస్తుంది. చివరి రోజు ఒక కవిత్వాంశంపై కవిత రాయించి ఎంపికైన కవితలను కవి సంధ్య పత్రికలో ప్రచురిస్తాం.

వరుగు భాస్కర్ రెడ్డి

విద్యార్థులకు కథల పోటీ

తెలుగు సొసైటీ ఆఫ్ అమెరికా (తెల్సా) రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించడానికి తెలుగు కథా రచన పోటీ నిర్వహిస్తుంది. 8వ తరగతి నుంచి 12వ తరగతి (ఇంటర్మీడియేట్) వరకు చదివేవారు పాల్గొని జూలై 31 లోపు కథలు పంపాలి. ప్రతి గ్రూపులోనూ మొదటి, రెండవ, మూడవ బహుమతులు: రూ.10,000, రూ.7,500, రూ.5,000. మరిన్ని వివరాలకు: www.telsaworld.org లేదా ఈమెయిల్: telsaworld@gmail.com.

మల్లిక్ కేశవరాజు

అనేక తలాల మమేక సృజన



తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి గారి సజావు వాక్యాల్లోని మెలికలు మెల్లిగా గానీ అందవు. Diegetic, mimetic (కథ చెప్పటం, చూపటం) అనే ఈ రెండు కథన ప్రక్రియలనూ ఏకకాలంలో నిర్వహించడమే గాక వారి వాక్యం, ఒక విశ్లేషణా స్వరాన్ని కూడా కాంతిలా తనకు చుట్టుకుని వస్తుంది కాయితం పైకి. సమీక్షాస్వరగర్భితమైన లిఖితశబ్దం వీరి వచనం. కథా వస్తువుకు తగిన భాషా సామగ్రిని నిర్మించుకున్న ఇంజనీయర్ పనితనముంటుంది వీరి సాహిత్యంలో.

'పతంజలి శాస్త్రి కథలు' పుస్తకానికి రాసిన ముందుమాటలో "కొన్ని కథల వెనక రచయిత ధుమధుమలాడే ముఖం కనిపిస్తుంది" అంటారు కె.ఎన్.వై. పతంజలి (చిన్న పతంజలి). పర్యావరణ అపహరణం, నీచ రాజకీయాలు, ఆధునిక మానవుడి నిస్సార మనస్తత్వం, జ్వాల నిద్రపోయి పొగచూరు పట్టిపోయిన మానవ సంబంధాలు... స్థూలంగా వీరి ధర్మాగ్రహ కారణాలు అనుకోవచ్చు. "వ్యంగ్యం నా శరీరంలో గుచ్చుకున్న బాణం, అది తీస్తే నా ప్రాణం పోతుంది" అన్న కీర్క్‌గార్డ్ మాట కూడా గుర్తురాక మానదు పతంజలి గారిని చదువుతుంటే. పదునైన వ్యంగ్యం వీరి వాక్యంలో దాక్కున్న బాణం.

వ్యంగ్యం, ఆగ్రహం కాలక్రమేణా నిర్వేదంతో వినపడటం, నిర్వేదం మెల్లిగా తాత్వికతతో కూడిన సంయమన వాక్కులోకి చేరటం రచనల సహజ పరిణామక్రమం. ఇది అంచెలంచెలుగా జరుగుతుంది. సాహిత్యసృష్టికై రగిలించిన అగ్నిని నియంత్రించే కళే రచయిత క్రాఫ్ట్ – Tuning the fire.

చేతిలో స్త్రీ పాత్రలు ఎక్కడా ఆక్షేపణలకు గురికాలేదు, ఒక్క 'గేదె మీద వాలిన పిట్ట' నవలలో 'పూర్ణ' లౌకికం, నేర్పరితనం గలది అనే ధ్వని వినిపించటం తప్ప.

మూడో నాలుగో పదాలతో వీరి వాక్యం ఏర్పరచిన బొమ్మ తన భౌతికరూపవిశేషాలతో, మానసిక స్థితితో మాత్రమే కాదు, దాని భూత భవిష్య కార్యకారణాలన్నిటితోటి, జన్మాంతర జాతకంతో సహా రూపం దాల్చి వచ్చేస్తుంది– ("బోనులో పొడుగ్గా నుంచుని, దురదృష్టం, నిస్పృహ కలిసి పెట్టిన సంతకం లాంటి మనిషి"). మనుషులూ, స్పర్శేంద్రియ గ్రాహ్యమైన వస్తువులే కాదు, రూపం లేని స్థల, సమయాలు, భావాలు కూడా ఒక నిర్దిష్టమైన వ్యక్తిత్వంతో పరిచయమై అలా నిలబడి పోతాయి పాఠకుల స్మృతిలో. మనసూ నోరూ పెట్టుకుని మనతో మాట్లాడుతుంటాయవి. ఎండ, వెన్నెల, అపరాహ్ణం, కరువు, మేజాబల్ల, కుర్చీ, చెఱువు, పార్కు, చెక్కబల్ల, దాని మీద ముసలాయన, ఇలా అన్నిటికీ ఒక ముఖం, ఒక persona (మూర్తిమత్వం) ఇచ్చి మర్యాద చేస్తుంది వీరి వచనం.

మరి వీరికి దేనితో పేచీ? మనిషి మూర్ఖత్వంతో, నిష్క్రియాపరత్వంతో పెద్ద పేచీ. వర్గ చైతన్యం, సామూహిక చైతన్యం, పాలకులకు, ప్రజలకు చైతన్యం అనేవి పాత నినాదాలు. చైతన్యం ఎప్పుడూ ఉంది, లేక కాదు. ప్రజల్లో అది సుప్తావస్థలో, పాలకుల్లో తామసరూపంలో ఉండటమే సమస్య. అదే వీరి కథలు మాట్లాడింది. ఖద్దరు చొక్కాల వెనక, ఖాకీ యూనిఫారంల వెనక, స్పిరిచువల్ శాలువాల వెనక ఉండిపోయిన మనిషి కొండకచో అయినా కాస్త కరగటం, స్వస్వరూప సహజమైన ఇంగితంలోకి అప్పుడప్పుడూ అయినా మేలుకోవటం అరుదయ్యేకొద్దీ వీరి కథలు పదును దేలుతుంటాయి.

'రామేశ్వరం కాకులు' కథాసంపుటిలో 'వెన్నెల వంటి వెలుతురు గూడు', 'ఉర్వి' సౌష్టవమైన కథలుగా నిలబడుతూనే, దీర్ఘకవితలనిపించుకోగల రచనలు. 'వెన్నెలవంటి...'లో వస్తువు పురుషుని మనస్సు. రైలు ప్రయాణంలో ఎదురుసీట్లో నిద్రపోతున్న అందమైన స్త్రీతో రొమాంటిక్ ఊహలలో యథేచ్ఛగా విహరించటానికి సంకోచించని అతని మనసు, నూటఎనభై డిగ్రీల పరివర్తనం చెంది అదే స్త్రీలో మాతృదర్శనం చేసుకుందుకు ఒక్క నిమిషమే తీసుకున్న కథ అది. కానీ కథ చివర్లో "పాలసిరల వంటి మెత్తటి వేళ్ళు క్రాపులో చొచ్చుకునిపోయిన హాయి" అని అతన్ని అనుకోనివ్వడంలో కదూ వ్యంగ్యం! స్త్రీని యువతిని చేసేదీ, తల్లిని చేసేదీ ఆమె తాలూకు ఒకే రూపవిశేషం. కానీ, తలకిందులైన ఆ దృష్టే అతని పరివర్తనానికి గుర్తు. ఈ రచయిత

'రామేశ్వరం కాకులు' కథలో 'పద్మావతి'లోని జీవుని వేదనకు ముగింపును రచించిన ఇన్‌స్పెక్టర్, ఏ రోగికి ఏ వైద్యం పని చేస్తుందో తెలిసిన వైద్యుడు, ఆమె తోటి వారందరికీ రామేశ్వరానికి టికెట్లు కొనలేదతను. ఆమె అస్తిత్వ వేదనను వాడు చూడగలిగేలా చేసింది నిజానికి ఆమే. అతన్ని వాడి పోలీసుతనం నుంచి వొలిచి ("ఆమె చూపులు అతని ఖాకీ బట్టలను ఉల్లి పొరలా విడదీసాయి, అతని కంఠంలోని తీవ్రత వేపగాలిలో కలిసిపోయింది") మనిషిలోని కరుణను నిలబెట్టింది. ఆ కరుణే నిర్దయగా ఆమెను ఈ పనికిరాని లోకం వదిలి నడిసముద్రంలో మునగమంటుంది. అవును, ఆమెకు అప్పుడు కావలసింది అనుక్షణ ప్రాణభయాన్ని జయించగల నిర్దయే. ధైర్యమే.

కాలం లాగే మనిషి చేతనకూ అవధులను ఒప్పుకోదు వీరి రచన; తుది మొదలున్న జన్మ అనే పరిమిత పరిధికి లోబడి ఉండదు మనుషుల చైతన్యం వీరి దృష్టిలో. జన్మాంతర జ్ఞానంతో యేటిలో చేప ఈదినంత సులువుగా కాలాలనీదగల జీవులు తారసపడతారు ఈ కథల్లో. 'దీపాలపల్లె బోవాలె' కథలో వృద్ధుడికి అంత్యకాలంలో వస్తూపోతూవున్న స్మృతి బాల్యకాలపుది కాదు, అసలు ఈ జన్మదే కాదు.

కాలాన్ని, చైతన్యాన్ని తన అధీనంలో ఉంచుకోవడం తెలుసు 'కచ్ఛప సీత'కు, ఇంద్రియాలనే కాదు. లక్ష్మణుడి అరణ్యవాస కారణంగా విరహదుఃఖంలో పడిన ఊర్మిళను వెతుక్కుంటూ వచ్చి ఆమెకు అంతర్ముఖ విద్యను ఆచరణలో చూపి, ఆ సాధనలో ఆమెను నిలిపి నిష్క్రమించింది ఆధ్యాత్మ గురువు 'సీత'.

'అతను' కథలో మనిషికి ఇతర మనుష్యులు కంప్యూటర్ తెర మీద pixels వంటివారు. తన జీవితం, తన తత్త్వము కూడా తనకు తెరమీది బొమ్మలు మాత్రమే. ఇతను అంతర్ముఖుడు కాదు. మానవ సహజమైన స్పందించే శక్తి లోపించిన అసంబద్ధ ప్రాణి. కామ్యూ నవలా పాత్ర 'మెర్సాల్ట్' యాంత్రిక వైఖరీయే ఇతనిది. అస్తిత్వ నిరాకరణమే ఇతని అస్తిత్వ లక్షణం. ఇతను మళ్ళీ మనకు 'గేదె మీద వాలిన పిట్ట' నవలలో 'ఆదిప్రకాశ్'గా ఎదురుపడతాడు. మేధ తప్ప బుద్ధి పనిచేయని జీవి.

> **పతంజలి శాస్త్రి గారి కథలది నిరీశ్వరవాదం కాదు. అలా అని ఆస్తిక్యవాదానికో, అస్తిత్వవాదానికో, అసంబద్ధవాదనకో కూడా పరిమితం అయిపోకుండా, వాదాలకతీతంగా మనిషి అస్తిత్వానికి ఒక అర్థాన్ని అన్వేషిస్తూ, దర్శిస్తూ సాగిన సాహిత్యం ఇది.**

పతంజలి శాస్త్రి గారి కథలది నిరీశ్వరవాదం కాదు. అలా అని ఆస్తిక్యవాదానికో, అస్తిత్వవాదానికో, అసంబద్ధవాదనకో కూడా పరిమితం అయిపోకుండా, వాదాలకతీతంగా మనిషి అస్తిత్వానికి ఒక అర్థాన్ని అన్వేషిస్తూ, దర్శిస్తూ సాగిన సాహిత్యం ఇది.

క్రియాశీలత వీరి మంత్రం. వీరి సిద్ధాంతం క్రియా యోగం. వీరి కథల ధర్మం (మతం) బౌద్ధం. "ధర్మం చర!" ధర్మాన్ని ఆచరించు! ధర్మబద్ధమైన కర్మ చేయడమే మనిషి ధర్మము అనేదే వీరి కథల మతము.

శాస్త్రి గారి 'భగవంతం కోసం' కథలోని మనిషి చేసిన వెతుకులాట అతనున్న గదిలోని టేబిల్ సొరుగులోని కొవ్వొత్తి, అగ్గిపెట్టె చూసాక ముగుస్తుంది. అస్తిత్వ చింతన చేయటానికైనా నిల్చున్నచోట దీపం వెలిగించుకోవాలి కదా ముందు మనిషి!

ప్రాక్టికల్ అయితేనే వేదాంతమైనా ఆచరణీయం అనే జ్ఞానానికి తెరుచుకున్న కథ 'కిటికీలు'. ముదిమి ("శీతువు" అంటారాయన), మృత్యువు, దాని తర్వాతి అపరకర్మలు వీటికి తాకని దూరంలో నిల్చుని చాలా దగ్గరగా రచయిత చూడగలిగిన విధంలో గొప్ప శాంత విచారణ కనపడుతుంది.

తీవ్ర ధిక్కార స్వరం 'యువరానర్'ది. ఈ కథలో ఉద్వేగాల వ్యక్తీకరణలు ప్రచ్ఛన్నంగా ఉండవు. మొదటి వాక్యం నుండీ చివరి బిందువు వరకూ రూపం దాల్చిన తీవ్ర ఆగ్రహమే.

ప్రాజెక్టు కుంభకోణం బద్దలై కుతకుతలాడుతున్న ఆఫీస్‌లో, బైరాగి కవిత్వం చదువుతూ "నక్సలిజం ప్రాక్టీస్ చేసే ట్రైబల్ పీపుల్ గూఢచారి" ఒకడుంటాడు, అతనే 'బాలి'. ఆఫీస్ ఫైళ్లు తడిపి ఆఫీసర్తో మూడు చెఱువుల నీళ్ళు తాగించాడు. ఎప్పుడు పేలుతుందో తెలియని డైనమైట్ మీద కూచున్న కథ ఇది!

'ఆమెదనంతపురం', 'కతలవ్వ', కథల్లో విషయాలు రాయలసీమ నీళ్ళకరువు, కాటకము. వాటి కథనానికి వాడిన అలెగరీ పతంజలి గారి మరొక గొప్ప పనిముట్టు.


కథలో పిల్లల అవసరం ఎంత! మోడర్న్ ఫేబుల్ వంటి పనిముట్టు ఎంత అవసరమో పిల్లల ఉనికికీ అక్కడ అంతే అవసరం. పెద్ద వాళ్ళకు బుద్ధి చెప్పటానికి పిల్లలసాకు కావాలి. 'తురక పాలెంలో దేవకన్యలు' శుద్ధ ముగ్ధ మార్మిక సౌందర్యంతో వచ్చిన కథ. పల్లెలు మురికి అనుకునే పిల్లలకు వాటి మహత్వం చూపించేందుకు మిథ్‌లా సాగిన కథనం. 'కదిరమ్మ పేరంటాలు' నిరాశలు కనే కల.

ఈ కథల్లోని క్రాఫ్టే సంపన్నమైంది. వ్యావహారిక బుద్ధికి కనపడే కథ ఒకటి, పిల్లలకు మాత్రమే సాధ్యమయ్యే అలౌకిక దృష్టికి అందే కథ ఒకటి, రెండుతలాలలో రెండు విడివిడి కథలను నడుపుతుంది కథనం. కలలు, అధివాస్తవికత, మార్మికత, వివిధ తలాలలో పనిచేసే మనిషి చేతన... వీటిని వీరి కథలు విస్తారంగా వాడుకున్నాయి.

తర్కమూ తాత్వికత, ఆధునిక స్పృహ ప్రాచ్యవిజ్ఞానము, వాస్తవము కల్పనా ఇలా పలు విరుద్ధాల జతలు సమన్వయంతో కలిసిన చోట జరిగిన సృష్టి పతంజలి శాస్త్రి గారి సాహిత్యం.

■ పద్మజ సూరపరాజు
padmajasuraparaju@gmail.com


అనాది ఆత్మగానం 'అమృత సంతానం'



అగాధ లోయల చెంత సర్వోన్నత శిఖరాలు. అవనీ ఆకాశాల మధ్య నిరుపమాన ప్రాకృతిక సౌందర్యం. వీటి నడుమ కోదుల నిష్కలంక జీవనం. ఆ కోదుల అనాది ఆత్మగానం 'గోపీనాథ్ మహంతి' రచించిన 'అమృత సంతానం'.

గోపీనాథ్ మహంతి ఒడియా భాషలో రాసిన ఈ ఉద్గ్రంథాన్ని పురిపండా అప్పలస్వామి తెలుగులోకి అనువదించారు. ఒడిస్సాలోని కొండ ప్రజల జీవనాన్ని ఈ నవల మూలాల నుండి ముచ్చటిస్తుంది. చావు పుటుకల నడుమ పరుచుకున్న విస్తార జీవితాన్ని మనతో ఎడతెగక సంభాషిస్తుంది.

నవలలోనికి ప్రవేశిస్తే– లెక్కా జమాలేని పర్వత పంక్తులపై అంబాలపు కాయ వంటి ఆ ఊరిపేరు 'మణి అపాయ'. గతించిన కోదు సాంస్కృతిక స్మారక చిహ్నంగా ఆకాశానికి తలెత్తి నుంచుని ఉన్న కొండ శిఖరాలు, వారికి 'ధర్మ' (సూర్యుడు) ఉన్నాడు. 'దర్తని' (నేల) ఉంది. వీటి నడుమ నాలుగు వేల అడుగుల ఎత్తున సమిష్టిగా జీవించే పర్వత ప్రాంతం ఉంది. గంజాం మన్యం నుండి మాల్యవంతగిరి కోదుల పూర్వ పురుషుల విశాల ప్రాంతం. ఎందరో ఈ ప్రాంతానికి వచ్చి వెళ్ళిపోయారు కానీ, ఆదికాలం నుండి కొండల తోడుగా దర్తని కొడుకు కోదు ఉన్నాడు.




నాలుగు ఇరవైల వయసున్న ఊరి కురువృద్ధు సర్దార్ సరబుసావొతా చనిపోవటంతో నవల మొదటి అంకం మొదలవుతుంది. వారాలు, మాసాలు, కార్తెలు, చెట్ల పళ్ళు, నక్షత్రాలు... వీటితోనే కోదుల పేర్లు. సరుబుసావోతా కుటుంబంలోని సావోతా కోడలు పుయు (పూవు), కూతురు పుబిలి (సీతాకోకచిలుక), కొడుకు దివుడు (కార్తీకం) భూమికగా కోదుల జీవితం నమోదు చేసారు రచయిత. ప్రకృతీ జీవితమూ లతమల్లే గాఢంగా అల్లుకుపోయిన అనుభవం దృశ్యమానం అవుతుంది ఈ రచనలో. మనసు ఎండిన మోడుగా మారినా జీవితేచ్ఛల బిగి సడలని కోదు స్త్రీ స్వతంత్ర వ్యక్తిత్వాలు వ్యక్తమవుతాయి. సరళ సుందరమైన వారి సరికొత్త ప్రపంచాలు దర్శనమిస్తాయి మనకు.

కోదు వాడ అందరిదీ, అడవి అందరిదీ. అందరి పిల్లలు యావన్మంది ప్రేమకూ పాత్రులు. ఎడం లేదు వారి నడుమ. శరీరాలే వేరు అంతరాళాలన్నీ ఒకటే వారివి. ఒకరి బిడ్డను మరొకరు లాలిస్తారు. ఇంకొకరి పిల్లలకు మరొకరు తల సాపుతారు. కొండ దేశాన కోదులలో మానవ హృదయ మూల స్వరూపం చెక్కుచెదరలేదని మనకు అవగతమవుతుంది. కోదులు ఎముకలు గుండయ్యేలా పనిచేస్తూ చోల్లు, సావలు, వొలిసెలు, కందులు, నువ్వులు, ఆవదాల పంటలు సాగుచేయడమూ, పక్షులతో కలిసి పంటలను పంచుకు తినడమూ కనిపిస్తుంది. జీలుగు చెట్ల బెరడు, మామిడి టెంకల గుజ్జు, కందగడ్డ, చింతం బలి, గట్టి వేర్లు, తేనె పట్టు వారి ఆహారమనీ, మయిరికా (పులిచీమలు) పొడి చేసి కలుపుకున్న చోడంబలి, కొండముచ్చు మాంసపు మధురమైన రుచిని మరిగి ఉన్నారనీ తెలుస్తుంది. సూదంటు రాయితో నవజాత శిశువు బొడ్డు కోసి మందాకు పసరు పూస్తుంది కోదు మాతృమూర్తి. మందువేరు నమిలి మింగే బాలెంతలు, నల్ల మిరియాలతో జ్వరాల నుండి బాగవటం, పులి చీమలు కుట్టించుకుని నొప్పులు వదిలించుకునే వారి వైద్య విధానం మనకు తెలుస్తుంది. గాయం అక్కడి గాలికే మానుతుంది. వెలుగు పడితే వేదన నిమ్మళిస్తుంది. విశాల ప్రకృతి పంచమణిలా వారి రోగం బాగుపరుస్తుంది.

అనంత శబ్దం వెనక అనాది మంత్ర ధ్వనుల ప్రతిధ్వని వింటున్నారు వారు. 'ఓ' అని పిలిస్తే 'ఓ' అని ప్రతి పలికే హొరుపేను (వనదేవత) ఒడిలో తల పెట్టుకు నిదురిస్తున్నారు. పెద్దపులిని బయటకు రప్పించే బృంగరాజు పిట్టలు, ఎర్రటింట పిట్ట, గువ్వపిట్ట, వానకోయిలలు, పోలుగులు, గోరపిట్టలు, చిలుకలు, మైనగోరలు, జీబుచెట్లపై నాట్యమాడే నెమళ్ళతో కలిసి బతకటం కనిపిస్తుంది. వారి హృదయంలో కోమల రాగం మోగుతుంది. ఏకతార సితార, పిల్లంగోవి డొంబుడోల డొంబుబాకా, రంగోలు టముకు బాజా వారి వాయిద్యాలు. మాఘ మాసం సంజ చీకట్లో చుక్కలు తొంగిచూసే వేళ పాటను వాయిద్యాలతో పెనవేస్తారు వారు. జనన మరణాల నడుమ పనిలో, ప్రయాణంలో, ప్రణయంలో, పరిణయంలో పాట వారితో పెనవేసుకు ఉంది.

నవల చదువుతుంటే అడవిలో బంగరు రంగు ఎండ, హోరున వీస్తున్న చైత్ర గాలి, పేరులేని రంగు రంగుల పూల సువాసన మనల్ని తాకుతాయి. సృష్టి తొలి రాత్రిన పుట్టి ఇవాళ దాకా భూమిని వదలని చీకటీ, మొదటి ఉదయపు వెలుగూ కోదుల నెత్తిన మారుగుళ్ళాడుతూ కనిపిస్తాయి ఈ నవలలో. జీవితం జోరీగలాగా దౌర్జన్యంగా ఉండనీ.. విరక్తి లేదు వారికి. జీవితంలో ఆనందం శ్రేష్ఠమైనదనే నమ్మకం వారిది. జీవితం సత్యం, సుందరం అనే స్పృహ వారిది. "జీవనంలో రుచి ఉంది, చావు లేదు దుఃఖం లేదు" అని సభ్య సమాజానికి చాటుతుంది ఈ వన జీవితం.

■ బడుగు భాస్కర్ జోగేష్
© 98666 02325



ఈ పూలకి ముందే తెలుసు

అతి జుగుప్సాకరమగు ఇదే నేల మీద
అతి సుందరమగు ఇదే నేలమీద
ఎన్ని చితిమంటల్ని కలగంటే గానీ, ఎన్ని విధ్వంసాలను ఊహిస్తే గానీ
ఈ పూలు ఇంత త్వరగా నేల రాలగలవు

ఈ పూలకు ముందే తెలుసు
నిన్నలా ఈ నది కనపడదని
ఎగువన యుద్ధాలు జరిగే దేశాల రక్తాన్ని
కలుపుకొని ఎర్రగా ప్రవహిస్తుందని
కమ్మిన కారు పొగలతో అసహ్యంగా మబ్బులు
ఆకాశానికి గూళ్ళు కడతాయని
నిప్పు శకలాలు తగిలి తెగిన కాళ్లతో పక్షులు ఎగురుతాయని
మిస్సైళ్లు ముద్దాడిన పసికందుల ఆర్తనాదాలతో
గాలి ఘోష పెడుతుందని
భస్మీపటలమగు సౌధాల శిథిలాల కింద కుప్పల కుప్పల
శవాలతో భవనాలన్నీ మహాసమాధులై కనిపిస్తాయని
గాయాలై మిగిలిన క్షతగాత్రుల అనాథ శోకాలు
ఈ పూలకి ముందే తెలుసు

యుద్ధమొక దీర్ఘ దుఃఖం – రక్తం దాని దాహం
విస్ఫోటనమొకటే గానీ దాని విధ్వంసం విస్తరిస్తుంది
కాలాలను కాల్చి రుధిర ఋతువొకటే పరిమళిస్తుంది
రాత్రి, పగళ్ళను ఆ కార్చిచ్చు ఆక్రమిస్తుంది


ఈ రక్తపు కల్లాపి ఏ శాంతి కాంతుల్ని అలకగలదు వినాశనాన్ని తప్ప
యుద్ధాధినేతలంతా
భవిష్యత్తు శ్మశానాలుగా మిగిలిపోయే మహానగరాలకి
కాపలా కుక్కలుగా మిగిలిపోతారు

దహనం కాబోయే ఆధునిక మానవ చరితకంతా
అణుబాంబుదే సాక్షీ సంతకం

ఈ పూలకి అన్నీ ముందే తెలుసు
దానికే కాబోలు త్వరగా రాలిపోవడం – మౌన నిరసన
అని అనుకోవచ్చు
కానీ నేను మీలా రాలిపోలేను

■ వెంకటేష్ పువ్వాడ
© 7204709732

ఊహించని వర్గాల చెంతకు చేర్చింది!





నా మొదటి పుస్తకం

యార్లగడ్డ రాఘవేంద్రరావు

అది 1991 మే 31 లేదా జూన్ ఒకట్రెండు తారీఖుల్లో ఓరోజు.. ఓ పోస్టు కార్డు వచ్చి నా చేతిలో వాలింది. అందులో ఉన్న గుప్పెడు అక్షరాల వెంట పరుగుతీసిన నాచూపులో ఒకింత ఆనందం, మరొకింత ఆశ్చర్యం. ఎత్తైన జైలుగోడలు దాటుకుని ఆ చిన్ని తోకలేని పిట్ట ఎగురుకుంటూ రావడం, దాన్ని సర్కారువారు తీవ్రవాదవర్గంగా ముద్రవేసిన గ్రూపుకు చెందిన ఓ వ్యక్తి పంపించడం, జైలు అధికారులేమో బుద్ధిమంతుల్లా దాన్ని అనుమతించడం అసలు ఊహించే విషయమా! ఆ పోస్టుకార్డు రాసిన వ్యక్తి భూపాల్‌రెడ్డి. 'సీపీఐ(ఎంఎల్) రెడ్‌ఫ్లాగ్' పార్టీకి చెందిన రాజకీయఖైదీల మంటూ కొందరి తరపున తనను తాను పరిచయం చేసుకుని నా పుస్తకం పంపమని కోరాడు. అతడిచ్చిన ముషీరాబాద్ జైలు అడ్రస్‌కు నా పుస్తకం పంపించాను. మొదటి ఉత్తరం వచ్చిన మూణ్ణెల్లకు భూపాల్‌రెడ్డి మరో కార్డు రాస్తూ, 'కవితాసంకలనం పంపించమని మీకు గతంలో లేఖ రాసినా పంపించలేదు. అసలు మేం రాసిన ఉత్తరం అందిందా లేదా?' అని వాకబు చేస్తూ, మరోసారి తమ ఆర్థికపరిస్థితి తెలియజేస్తూ, పుస్తకాన్ని తప్పక పంపమని కోరాడు. అంటే, రెడ్‌ఫ్లాగ్‌వాళ్ల ఉత్తరాన్ని జైలుగోడలు దాటించి పంపిన అధికారులు, నా పుస్తకాన్ని మాత్రం ఆ గోడల లోపలికి చేరనివ్వలేదన్నమాట. నా మొదటి కవితాసంపుటి 'బహుముఖం' ఎన్నడూ చెరిగిపోనంతగా వేసిన మనోముద్ర– ఈ ఘటన


1975 నుంచే కవిత్వం రాయడం మొదలుపెట్టినా, 1980 వరకూ అడపాదడపా చిటికెడు కవితలు అచ్చయినా, ఆ తర్వాత ఎందుకో విరామం వచ్చేసింది. ఆపై మనసెందుకో కథలవైపు మళ్లింది. 1986లో 'ఉదయం' దినపత్రికలో చేరాక మళ్లీ కవిత్వం మోజు విరిసింది. కథలతో సమాంతరంగా వాటి జోరు కూడా హెచ్చింది. ఆరోజుల్లో పల్లకి వార పత్రికలో 'భాస్వరం' పేరిట రాజకీయ మినీకవితా శీర్షికను నిర్వహించిన అలిశెట్టి ప్రభాకర్ ఎందుకో హఠాత్తుగా తప్పుకున్నాడు. ఆ పత్రిక ఎడిటర్ విక్రమ్ అడగడంతో నేనా శీర్షికను కొన్ని వారాలపాటు కొనసాగించాను. మరోవైపు ఉదయం సహా ఇతర పత్రికల్లో పెద్దకవితలు కొన్ని అచ్చయ్యాయి. వాటి సంఖ్య రెండుమూడు గుప్పిళ్ల దాటాక– ఎప్పుడు మొదలైందో గానీ– పుస్తకం వేయాలనే కోరిక తలెత్తి, మొలక నుంచి మానై దిగబడింది. కంపోజింగ్, ప్రూఫ్‌రీడింగ్ కానిచ్చేసి, ప్రతిని తీసుకెళ్లి కె. శివారెడ్డి చేతిలో పెట్టి 'మీరు పీఠికేశ్వరులు కావాల్సిందే'నని వినతులు పోయాను. ఆయనో చిర్నవ్వు విసిరేసి అభయమిచ్చినా, ఘంటాన్ని మాత్రం ఓ పట్టాన పదును తీర్చలేదు. అయినా ఓపిగ్గా వెంటపడి ఓ ఏడెనిమిది నెల్ల తర్వాత ఆయన్నుంచి ముందుమాటను ఒడుసుకున్నాను. నా అక్షరాన్ని నిమురుతున్నట్లు కన్పిస్తూనే తన భావనల్లో నన్నాయన నిర్మోహమాటంగానే కుదేశారు.

ఆయనే నా మొదటి కవితాసంపుటికి నామకరణధారి కూడా. టైటిల్ ఏం పెట్టాలో తోచకపోతే ఆయన పెట్టిన పేరే ఈ 'బహుముఖం.' ఇక కవర్ పేజీ యాగంలో యాగకర్త ఎవరా అనే మథనంలో పడి– వాసిరెడ్డి నవీన్, శివారెడ్డి సూచనతో– శీలావీర్రాజు గారిని సంప్రదించాను. ఆయన వెంటనే చక్కటి ముఖచిత్రం వేసిచ్చారు. అంతేనా, ఎంతో పెద్దమనసుతో, తన పుస్తకాల్ని ప్రింట్ చేసే ప్రెస్సుకు నన్ను వెంటబెట్టుకుని తీసుకెళ్లడమే కాదు, నా పుస్తకం వచ్చేవరకూ ప్రతి దశలోనూ తోడుగా నిలిచారు.

నా 'బహుముఖం' కవితాసంపుటిని లోకం ముందు నిలిపింది 1991లో. దాని గురించి నాలుగు ముక్కలు పరిచయం చేయడానికి నేనెన్నుకున్నది చేకూరి రామారావు (చేరా), కేతు విశ్వనాథరెడ్డి, కె. శివారెడ్డి. చేరా ఆ మరుసటి వారమే ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో తన కాలమ్‌లో బహుముఖం గురించిన పరిచయాన్ని పరిచారు. అందులో ఆయన ప్రత్యేకంగా నా 'ఎన్‌కౌంటర్' కవితలోని శిల్పాన్ని ప్రశంసించారు. బహుశా ఈ వ్యాసం చదివే రెడ్‌ఫ్లాగ్ వాళ్లు నా పుస్తకం కోసం లేఖ రాసి ఉంటారు. 'వజ్రాయుధం' వీరుడు సోమసుందర్ బహుముఖంపై ఆంధ్రభూమిలో ఓ నిండు పేజీ వ్యాసమే రాశారు. సి. నారాయణరెడ్డి, గుంటూరు శేషేంద్రశర్మ, రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, ఇస్మాయిల్, కె. రామ్మోహన్‌రాయ్, పాపినేని శివశంకర్, అత్తలూరి నరసింహారావు, చందు సుబ్బారావు, దర్భశయనం శ్రీనివాసాచార్య, శిఖామణి సహా నాటి సీనియర్, జూనియర్ కవులు పలువురు ఈ సంపుటిపై స్పందించారు. ఈ కవితాసంపుటిలోని తొలికవిత 'స్వప్నాల్ని ఉరి తీయలేవు'ను తెలుగు విశ్వవిద్యాలయం ఓపెన్ డిగ్రీ కోర్సులో ఓ ఏడాది పాఠ్యాంశంగా చేర్చింది.

బహుముఖంతో ముడిపడిన మరో మన్మోహనం.. కరీంనగర్‌కు చెందిన 'గోదావరి సాహితీ సాంస్కృతిక సమాఖ్య' డా. సి. నారాయణరెడ్డి పేరిట ఇచ్చే 'సినారెపురస్కారా'న్ని నాకు కైదండ చేయడం. తొలి కవితా సంపుటికే ఈ పురస్కారం అందుకోవడమే కాదు, దాన్ని పొందిన నాలుగోవ్యక్తిని నేను. ఆనాటి కవితావరణంలో నా అడుగుల్ని ఒకింత ముద్రించడమేకాదు, మరొక్కింతగా కవిత్వాన్ని తలకెత్తుకునే ఓ చారెడు మందికి నన్ను చేరవేసింది బహుముఖమే; నేను మరింతగా ప్రవహించడం రూపుకట్టిందీ దాన్నుంచే.

© 99854 11099





కొల్లిపర : ఆధునిక యంత్రాలతో కోతకోసిన వ్యర్థాలను తగలబెడుతున్న రైతులు

నిప్పుతో.. ముప్పు

పంట వ్యర్థాలకు నిప్పుతో ప్రమాదాలు

మొక్కజొన్న, జొన్న చొప్పను కాల్చేస్తున్న రైతులు

కొల్లిపర, చేబ్రోలు, మే 3 (ఆంధ్రజ్యోతి): రైతుల్లో అవగాహన లేమి.. అటు పర్యావరణానికి హానికరంగా, ఇటు ప్రమాదాలు నెలవుగా మారుతోంది. పంట వ్యర్థాల కారణంగా ఏటా ఢిల్లీని వణికిస్తున్న పరిణామాలు ఇప్పుడు జిల్లాలోనూ నెలకొంటున్నాయి. ఆధునిక యంత్రాలతో కోత కోయగా వచ్చిన వ్యర్థాలను రైతులు తగలబెడుతున్నారు. వారి అనాలోచిత చర్యల వల్ల వాయు కాలుష్యం పెరిగిపోవడంతో పాటు పర్యావరణానికి హాని, ప్రమాదాలకు కారణమవుతోంది. అంతేకాకుండా భూమిలోని పోషకాలు నశించి భవిష్యత్తులో పంట దిగుబడిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు. డెల్టా ప్రాంతమైన కొల్లిపర, చేబ్రోలు మండాల పరిధిలో రెండో పంటగా రబీలో రైతులు విస్తృతంగా జొన్న, మొక్కజొన్న సాగు చేశారు. ఎక్కువ మంది రైతులు ఆధునిక యంత్రాలతో కోత కోశారు. మిగిలిన వ్యర్థాలను అత్యధిక మంది రైతులు పొలాల్లోనే తగలపెడుతున్నారు. పంట వ్యర్థాలను కాల్చివేయడంతో దట్టంగా పొగ అలుముకుని రోడ్డుపైకి వస్తోంది. ఆ మార్గాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయాలతో పాటు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. చొప్ప కాలిన నూసి గ్రామాలకు వ్యాపించి కాలుష్యాన్ని పెంచుతున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు శ్వాసకు సంబంధించిన ఇబ్బందులతో అల్లాడుతున్నారు.

ఎన్నో ఉపయోగాలు..

జొన్న, మొక్కజొన్న వ్యర్థాలను తగలబెట్టకుండా రోటోవేటర్‌తో పొలంలో కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుంది. పశుగ్రాసం కింద వినియోగించడం వల్ల పశువులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించవచ్చు. అయితే రైతులు ఈ దిశగా ఆలోచన చేయకుండా చొప్పకు నిప్పు పెట్టడంపై మొగ్గుచూపుతుండటంపై పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అడ్మిషన్లు.. అన్వేషణ

● ప్రభుత్వ ఉపాధ్యాయులు సర్వే

● ఫలితాలు, సౌకర్యాలపై ఇంటింటా ప్రచారం ● విద్యార్థుల గుర్తింపు అప్పటికప్పుడే ప్రవేశాలు ● పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే వరకు ప్రక్రియ

మా బడిలో చేరండి.. మా విద్యార్థులు సాధించిన ఫలితాలు ఇవి.. బడిలో పలు సౌకర్యాలు ఉన్నాయి.. అంటూ ఇంతకాలం ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ప్రచారం చేసుకునేవి. ఆయా ఉపాధ్యాయులు టార్గెట్లు పెట్టుకుని మరీ ఇల్లిల్లు తిరిగి విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులను ఒప్పించి అడ్మిషన్లు తెచ్చుకునేవారు. అయితే ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు కూడా అడ్మిషన్ల కోసం వేట మొదలుపెట్టారు. ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్లు పెంచుకోవడంపై దృష్టి సారించారు. ఇంటింటా సర్వే చేస్తూ పిల్లల్ని గుర్తించి ప్రభుత్వ బడిలో చేరితే అందే సౌకర్యాలు, ప్రోత్సాహకాల గురించి వివరిస్తూ అడ్మిషన్లు తెచ్చుకుంటున్నారు.



గుంటూరులో అడ్మిషన్ల కోసం ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న ఎంఈఓ ఖుద్దూస్, ఉపాధ్యాయులు, సీఆర్పీలు

గుంటూరు(విద్య), మే 3 (ఆంధ్రజ్యోతి): బడి ఈడు వయసున్న పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉండాలనే ధ్యేయంతో ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు రంగంలోకి దిగారు. ప్రభుత్వ పాఠశాలలు సాధిస్తున్న ఫలితాలు.. విద్యార్థులకు అందే సౌకర్యాల గురించి తల్లిదండ్రులకు వివరిస్తూ అడ్మిషన్ల కోసం అన్వేషిస్తున్నారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ల (సీఆర్పీలు)తో పాటు జిల్లాస్థాయి అధికారులు, మండల స్థాయిలో ఎంఈఓలు ప్రతిఒక్కరూ అడ్మిషన్ల పెంపు కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు మధ్య ఉన్న తేడాలను విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేసి అడ్మిషన్లు పెరిగేలా చూస్తున్నారు. ఇందుకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ అధికారులు ప్రణాళిక రూపొందించగా క్షేత్రస్థాయిలో గత కొన్ని రోజులుగా అమలు చేస్తున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం అన్ని క్యాడర్ల ఉపాధ్యాయులు, ఎంఈఓలు క్షేత్రస్థాయి సిబ్బంది

(మిగతా 6లో)

అక్కడికక్కడే అడ్మిషన్

జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో ఉపాధ్యాయులు, అధికారులు పర్యటించి బడి బయట ఉన్న విద్యార్థులను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులకు అప్పటికప్పుడే ఎన్‌రోల్‌మెంట్ చేసి వారి వివరాలను యూడైస్‌లో నమోదు చేస్తున్నారు. ఫలితంగా ప్రతిరోజు ఏ మండలంలో ఎంతమంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పొందారు అనే వివరాలు రియల్ టైం గవర్నెన్స్‌లో నమోదవుతోంది.

సమగ్ర శిక్షలో..

రింగ్‌మాస్టర్

● ప్రతి ప్రణాళిక వెనుక కాసుల వేట

● డిప్యూటేషన్ ముగిసినా మళ్లీ రప్పించారు





సమగ్రశిక్ష కార్యాలయం

గుంటూరు(విద్య), మే 3 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షలో పనిచేసే ఆ ద్వితీయ శ్రేణి అధికారిదే హవా. ఓ ప్రణాళిక ప్రకారం అందిన కాడికి దండుకోవడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఏ పథకం అమలు చేయాలన్న ఆయన ప్రణాళిక ప్రకారమే సాగుతుంది. ప్రాజెక్టులో అమలు చేసే ప్రతి పనికి ఓ రేటు నిర్ణయిండమే కాకుండా తాను దండుకోవడంతో పాటు అధికారులకు వాటాలు ఇవ్వడంలో ఆయనకు ఆయనే సాటి. ఇటీవల డిప్యూటేషన్ పూర్తయి పాఠశాలకు వెళ్లినా మరోసారి ఆయనే కావాలంటూ ఉన్నతాధికారులు తిరిగి శాఖలోకి రప్పించుకున్నారంటే ఆయన అక్రమాల ప్రణాళికక ఏపాటిదో అవగతం చేసుకోవచ్చు. సీజనల్ హాస్టళ్ల అయినా... సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జరిగే ఏ శిక్షణ కార్యక్రమాలైనా.... ఐఈడీ సెంటర్ల నిర్వహణ.. చివరకు బధిరులకు పంపిణీ చేసే కిట్లు పంపిణీలోనూ ఆయన చెప్పిన ప్రకారమే జరగాలి.

తూతూమంత్రంగా సీజనల్ హాస్టళ్లు..

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఏటా నవంబరు నుంచి ఏప్రిల్ వరకు తూతూ మంత్రంగా సీజనల్ హాస్టల్స్ నిర్వహించే నిర్వాహకుల నుంచి కమిషన్లు దండుకుని ఉన్నతాధికారులకు పంపిణీ చేయడం ఆయనకు ఆయనే సాటి. ప్రత్యేకించి ఆయన కొన్ని సీజనల్ హాస్టళ్లను బినామీలతో నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. కొన్ని స్వచ్ఛంద సంస్థలకు ఏకంగా మూడు నుంచి నాలుగు నాలుగు సీజన్ల హాస్టల్స్ మంజూరు చేసి భారీ స్థాయిలో లబ్ధి పొందినట్లు సమాచారం.

మామూలుగా స్వాహా..

ఐఈడీ(ప్రత్యేక అవసరాల విద్య) కేంద్రాల నుంచి భారీ మొత్తంలో మామూళ్ల వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. శిక్షణ తరగతుల పేరుతో భారీ మొత్తంలో నిధులు డ్రా చేసినట్లు సమాచారం. ఇలా ఓ మహిళా అధికారి రూ.7 లక్షలు వరకు ఖర్చు చేసినట్లు బిల్లులు చూపారు. మెమొంటోలు ఇవ్వకుండానే ఇచ్చినట్లు చూపి రూ.50 వేలు స్వాహా చేశారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఏటా ప్రత్యేక అవసరాల పిల్లల కోసం నిర్వహించే క్యాంపుల్లో కూడా అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. క్యాంపుల కోసం వచ్చే పిల్లలకు, వారితల్లిదండ్రులకు అందించే భోజనం, ఇతర నిర్వహణ పేరుతో అత్యధికంగా బిల్లులు పెట్టి నిధులు డ్రా చేసి నట్లు సమాచారం. ఇందులో ఉన్నతాధికారులకు వాటాలు అందిస్తున్నట్లు తెలిసింది. ఈ అధికారికి ఇటీవల డిప్యూటేషన్ పూర్తి అయింది. దీంతో అధికారుల్లో అలజడి మొదలైంది. ఎక్కడ తమవాటాలకు గండిపడుతుందోనని భావించిన అధికారులు ఆయన డిప్యూటేషన్ పొడిగిస్తూ ప్రత్యేకంగా ఉత్తర్వులు తెప్పించుకున్నారంటే లాబీయింగ్ ఏ స్థాయిలో ఉందో అవగతం చేసుకోవచ్చు. ఈ విషయం గురించి సమగ్రశిక్ష పీవో పద్మావతిని వివరణ కోరగా ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మరోసారి డిప్యూటేషన్‌పై నియామకం చేపట్టామని జీవో కాపీ చూపారు.



ఉష్ణోగ్రత

4-5-26	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	41	27
తెనాలి	40	28
నరసరావుపేట	44	30
రెంటచింతల	44	29
బాపట్ల	38	28
చీరాల	38	28

ప్రశాంతంగా నీట్

● కేంద్రాలను తనిఖీ చేసిన జేసీ అశుతోష్‌శ్రీవాస్తవ



చెవిరింగులు తొలగిస్తూ...

గుంటూరు(విద్య) మే 3 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్య కళాశాలలో ప్రవేశం కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్ట్(నీట్) ప్రశాంతంగా ముగిసింది. మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష ప్రారంభం కానుండగా ఉదయం 11 నుంచే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు విద్యార్థులను నిశితంగా పరిశీలించిన తర్వాతే పరీక్షకు అనుమతించారు. చెవి రింగులు, హైహీల్ చెప్పులు, జడ లూజుగా ఉన్నా, డ్రెస్ కోడ్ పాటించని విద్యార్థులను కేంద్రాల్లోకి అనుతించలేదు. ఆయా విద్యార్థులు నిర్దేశించిన నిబంధనలు పాటించిన తర్వాతే కేంద్రాల్లోకి అనుమతించారు. ఎటువంటి అవకతవకులకు ఆస్కారం లేకుండా పరీక్ష ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పిలుచుకున్నారు. అయితే ఆయా కేంద్రాల వద్ద తల్లిదండ్రులు ఎండలో అల్లాడిపోయారు.



గుంటూరులో జడను సరిచేస్తున్న విద్యార్థిని తల్లి



గుంటూరు : ఏసీ కళాశాల కేంద్రం వద్ద విద్యార్థుల కోలాహలం

- గుంటూరు జిల్లాలో 24 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 8400 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. గుంటూరులోని ఏసీ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, హిందూ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను జేసీ అశుతోష్ శ్రీవాస్తవ తనిఖీ చేశారు.

టోల్ బాదుడు

● 30కి.మీ.. 3 టోల్ ప్లాజాలు

● వెస్ట్ బైపాస్‌తో వాహనదారులపై భారం ● పాతహైవేపై తగ్గని ట్రాఫిక్.. కొత్తగా సమస్యలు

గుంటూరు(రాజధాని), మే 3 (ఆంధ్రజ్యోతి): చెన్నై కోల్‌కటా జాతీయ రహదారిపై విజయవాడ, గుంటూరు నగరాల ట్రాఫిక్‌ను తగ్గించడం కోసం నిర్మించిన వెస్ట్ బైపాస్ లక్ష్యం నెరవేరడం లేదు. బైపాస్ అందుబాటులోకి వచ్చి రెండు నెలలు కావస్తున్నా ఇప్పటికీ వాహనదారులు అటువైపు వెళ్లేందుకు ససేమిరా అంటున్నారు. భారీగా పెరిగిన టోల్ చార్జీల బాదుడే ఇందుకు కారణంగా ఉంది. కాజ గ్రామం నుంచి ఎన్టీఆర్ జిల్లా వెదురుపావులూరు మధ్య 30 కిలోమీటర్ల పరిధిలోని వెస్ట్ బైపాస్‌లో మూడు టోల్ ప్లాజాలు ఉండడంతో వాహనదారులు అటువైపు వెళ్లడానికి బెంబేలెత్తిపోతున్నారు. గతంలో ఉన్న టోల్‌చార్జీకి రెట్టింపు టోల్ చార్జీ చెల్లించాల్సి రావడంతో వెస్ట్ బైపాస్ వైపునకు వెళ్లేందుకు వెనకాడుతున్నారు. ఫలితంగా మెజారిటీ వాహనాలు ఇప్పటికీ పాత ఎన్‌హెచ్ మీదకే వస్తున్నాయి. అధికారులు బలవంతంగా వాహనదారులను వెస్ట్ బైపాస్‌లోకి మళ్లిస్తున్నా ససేమిరా అంటున్నారు. దీంతో ట్రాఫిక్ గతంలో మాదిరిగానే ఉంటోంది.

నిబంధనలకు విరుద్ధం..

కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి 60 కి.మీ.లకు ఒక టోల్ ప్లాజా ఉండాలి. కానీ రాష్ట్ర రాజధాని అమరావతికి అనుకుని ఉన్న ఎన్‌హెచ్- 16 వెస్ట్ బైపాస్‌లో మాత్రం ప్రతి పది కిలోమీటర్లకు ఒక టోల్ ప్లాజా ఉంది. కాజ గ్రామ సమీపంలో టోల్ ప్లాజా గతం నుంచి ఉంది. వెస్ట్ బైపాస్ ప్యాకేజీ- 4 కింద తాజాగా పది కి.మీ దూరంలో ఉన్న వెంకటపాలెం వద్ద ఒకటి, ఎన్టీఆర్ జిల్లాలోని వెదురుపావులూరు వద్ద ప్యాకేజీ- 3కి సంబంధించి మరో టోల్‌గేట్ ఏర్పాటు చేశారు. అయితే గతంలో చిన్న అవుటుపల్లి సమీపంలో పొట్టిపాడు వద్ద టోల్ గేటు ఉండేది. అయితే వెదురుపావులూరు వద్ద టోల్ గేట్ ఏర్పాటు చేసిన నేపథ్యంలో అక్కడ టోల్ ప్లాజాను తొలగించారు. కానీ కాజ వద్ద ఉన్న టోల్ ప్లాజాను మాత్రం యథాతథంగా కొనసాగిస్తున్నారు. దీంతో 30కి.మీ. పరిధిలో 3 టోల్ గేట్లు వచ్చాయి. గుంటూరు నుంచి విజయవాడ వరకూ వెళ్లాలంటే గతంలో కాజ టోల్ ప్లాజాలో చెల్లించిన మొత్తం కన్నా ఇప్పుడు అదనంగా రూ.30 నుంచి రూ.270 వరకూ చెల్లించాల్సి వస్తోంది. అదే రాకపోకలకైతే రూ.50 నుంచి 310 వరకూ ఉంది. నెలసరి పాస్ తీసుకుంటే ఈ భారం రూ.1,070 నుంచి రూ.6,905 వరకూ పెరుగుతోంది. ఇది కాక కృష్ణానది దాటి ఎన్టీఆర్ జిల్లాలో అడుగుపెడితే అక్కడ వెదురు పావులూరు టోల్ ప్లాజా వద్ద మరోసారి టోల్ టాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. టోల్ భారం తగ్గించుకునేందుకు వాహనదారులు పాత హైవేపైనే ప్రయాణిస్తుండటంతో ట్రాఫిక్ ఏ మాత్రం తగ్గడంలేదు. హైదరాబాద్ వైపు వెళ్లే వారు కూడా పాత హైవే గుండా విజయవాడ మీదగా వెళ్లేందుకు ఇష్టపడుతున్నారు. భారీ వాహనాలను పోలీసులు బలవంతంగా వెస్ట్ బైపాస్‌లోకి మళ్లిస్తున్నారు. కానీ వారు లేని సమయంలో అవి కూడా పాత హైవేలోకే వచ్చేస్తున్నాయి. ఫలితంగా పాత హైవేలో ట్రాఫిక్ తగ్గకపోగా, వెస్ట్ బైపాస్ నిరుపయోగంగా మారుతోంది.



దీపం-2.. జమ ఎప్పుడో?

ఐదో విడత నగదు కోసం ఆరా

ఏప్రిల్ ఒకటి నుంచే బుకింగ్స్ ప్రారంభం

బడ్జెట్ విడుదల కాలేదంటున్న పౌరసరఫరాలశాఖ

గుంటూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): దీపం-2 ఐదో దశ ప్రారంభమై నెల గడిచినా ఇంకా వినియోగదారులకు సబ్సిడీ నగదు జమ కాలేదు. దీంతో వినియోగదారులు తమకు గ్యాస్ రీఫిల్ సిలిండర్ నగదు బ్యాంకు అకౌంట్‌లోకి రాలేదని పౌరసరఫరాల శాఖ కార్యాలయానికి ఫోన్లు చేసి ఆరా తీస్తున్నారు. ఎప్పటి లోపు నగదు తమ ఖాతాల్లోకి ప్రభుత్వం వేస్తుందని ప్రశ్నిస్తున్నారు. ఇటీవల వంట గ్యాస్ ధర పెరగడం, ఇరాన్ యుద్ధం కారణంగా తలెత్తిన సంక్షోభం తదితర కారణాలతో ప్రభుత్వం ఇంకా నగదు విడుదల చేయలేదు. 2026-27 ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో బడ్జెట్‌ని రాష్ట్ర ఆర్థిక శాఖ విడుదల చేస్తే తప్ప పౌరసరఫరాల శాఖ ఈ ఐదో దశ నగదు చెల్లింపులు చేయలేని పరిస్థితి నెలకొన్నది. జిల్లాలో అన్ని కేటిగిరీలు కలుపుకుని 7 లక్షల 96 వేల 633 వంట గ్యాస్ కనెక్షన్లున్నాయి. వీటిలో రెగ్యులర్ కన్స్యూమర్లు 6 లక్షల 29 వేల 285 మంది ఉన్నారు. దీపం-2 పథకం కింద సగటున 4 లక్షల మందికి పైగా ప్రతీ దశలో లబ్ధి పొందుతున్నారు. ఈ పథకం 2024 అక్టోబరులో ప్రారంభం కాగా తొలి విడతలో 4,16,494 మందికి సబ్సిడీ నగదు రూ.33.16 కోట్ల నగదుని ప్రభుత్వం చెల్లించింది. రెండో విడతలో 3,99,512 మందికి రూ.33.52 కోట్లు చెల్లించింది. మూడో విడతలో 4,10,155 మందికి రూ.34.75 కోట్లు విడుదల చేసింది. గత ఏడాది డిసెంబరులో ప్రారంభమై ఈ సంవత్సరం మార్చి నెలాఖరుతో ముగిసిన నాల్గో విడత దీపం 2.0లో 4,07,299 మందికి రూ.33.10 కోట్లు నగదుని చెల్లించింది.

ప్రభుత్వంపై రూ.2.50 కోట్ల భారం

ఐదో విడత దీపం 2.0 ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభ నెల అయిన ఏప్రిల్ ఒకటి నుంచి మొదలైంది. జూలై వరకు జరిగే సిలిండర్ డెలివరీలకు సబ్సిడీ నగదుని జమ చేయాలి. ఇటీవల వంట గ్యాస్ రీఫిల్ సిలిండర్ ధర రూ.60 పెరిగిన కారణంగా ప్రభుత్వంపై ఈ విడతలో అదనంగా రూ.2.50 కోట్ల భారం పడొచ్చని అధికారవర్గాలు అంచనా వేశాయి. దీనిని పరిగణనలోకి తీసుకుంటే జిల్లాకు రూ.35.50 కోట్లకు పైగా బడ్జెట్‌ని ఆర్థిక శాఖ విడుదల చేస్తేనే ఐదో విడత రీఫిల్ సిలిండర్లకు నగదు జమ చేయడానికి అవకాశం ఉంటుంది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్నందున తక్షణం ఈ అంశంపై దృష్టి సారించాలని ప్రజాప్రతినిధులు, వినియోగదారులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి | అలరిస్తున్న నాటికలు | ఆదివారం ఆటవిడుపు



హైందవ ఆలయాలకు.. క్రైస్తవుల అడ్డంకి లేదు 6
ప్రొఫెసర్ జోసెఫ్ మోసిగంటి



ఆదివారం ఆటవిడుపు

బాపట్ల, మే 3 (ఆంధ్రజ్యోతి): పెరిగిన వేసవి ఉష్ణోగ్రతలు, పాఠశాలలు, కళాశాలలకు సెలవులు కావడంతో సూర్యలంక బీచ్‌కు పర్యాటకులు అధిక సంఖ్యలో విచ్చేస్తున్నారు. ఇటీవల తీరంలో జెట్‌స్కిలను ఏర్పాటు చేశారు. ఈటీవి బైక్స్, గుర్రాలు, ఒంటెలు, వివిధ రకాల ఆటల సౌకర్యాలు అందుబాటులోకి తేవటంతో వాటిని చూచేందుకు, బైక్ రన్ చేసేందుకు యువత ఉత్సాహం చూపిస్తున్నారు. ఉక్కపోత తట్టుకోలేక కొంత మంది ఉదయం నుంచి సాయంత్రం వాతావరణం చల్లబడే వరకు ఇక్కడే ఉండి సంతోషంగా గడుపుతున్నారు. విద్యార్థులు కుటుంబ సభ్యులతో సహ వచ్చి సందడి చేస్తున్నారు. ప్రమాదాలకు తావు లేకుండా ప్రత్యేకంగా గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచి.. అధికారులు సమీక్షిస్తున్నారు. రూరల్, మెరైన్ పోలీసులు గస్తీ కాస్తున్నారు.



దీపం కింద చీకటి నాటికలో సన్నివేశం

అలరిస్తున్న నాటికలు

తెనాలి అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి): కొలంకపురి నాటక కళా పరిషత్, సాయి ఆర్ట్స్ కొలకలూరు ఆధ్వర్యంలో ప్రదర్శిస్తున్న నాటికలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. ఖాజీపేట నాటకశాలలో ఆదివారం మూడు నాటికలు ప్రదర్శించారు. వీరన్నపాలెం కళానికేతన్ వారి దీపం కింద చీకటి నాటిక నేటి సమాజంలోని అసమానతలను ఎత్తి చూపింది. ఆగస్త్య రచించిన ఈ నాటికకు వైవి చౌదరి దర్శకత్వం వహించారు. ఏలూరు హేలపురి కల్చరల్ అసోసియేషన్ అనగనగా ఓ రాత్రి నాటికను పీవీ సత్యనారాయణ రచించిన, కాజావలి దర్శకత్వం వహించారు. అనకాపల్లి ఎన్ఎంఆర్ క్రియేషన్స్ మలిసంధ్య నాటికను నాగేశ్వరరావు రచించి, ముత్యాలరావు దర్శకత్వం వహించారు. కరణం సురేష్ స్మారక సవ్యసాచి అవార్డును హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రంగస్థల నటుడు గోవాడ వెంకట్‌కు, గోపరాజు హేమలత జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రముఖ రంగస్థల నటి జ్యోతిరాణికి ప్రదానం చేశారు. గోపరాజు విజయ్, రమణ తదితరులు పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మునెయ్య మృతదేహం

వినుకొండటౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన వినుకొండ పట్టణంలోని మార్కాపురం రోడ్డు చెక్ పోస్ట్ సెంటర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. సాతులూరు గ్రామానికి చెందిన శివరాత్రి మునెయ్య (30) వినుకొండ రూరల్ మండలం శివాపురం వద్ద పాతపాటి పోలేరమ్మ తిరుణాల సందర్భంగా హోటల్ నిర్వహణకు సరుకులు ఆటోలో తీసుకొస్తున్నాడు. చెక్ పోస్ట్ సెంటర్ వద్ద ఎక్స్‌కవేటర్ రోడ్డు పైకి రావడంతో ఆటో అదుపుతప్పి దానిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో మునెయ్య మృతి చెందాడు. ఆటోలో ఉన్న మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. చికిత్స పొందుతున్నారు. పోస్టుమార్టం అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి, మునెయ్య మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అడ్మిషన్లు.. అన్వేషణ

(5వ పేజీ తరువాయి)

ఇంటింటి సర్వే నిర్వహించి విద్యార్థుల్ని పాఠశాలల్లో చేర్పించే పనిలో నిమగ్నమయ్యారు.

ప్రభుత్వ పాఠశాలల్లో.. సౌకర్యాలు ఇవే

ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ బుక్స్, మూడు జతల దుస్తులు, టై, బెల్ట్ బూట్లు అందజేస్తామని ఉపాధ్యాయులు చెప్తున్నారు. తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి 15000 నగదు అందుతుందని, పౌష్టిక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం, గుడ్డు, చిక్కీ, ఉదయం రాగి జావ అందిస్తామని వివరిస్తున్నారు. అత్యుత్తమ తరగతి గదులతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన అందిస్తామన్నారు. డిజిటల్ బోధన కోసం స్మార్ట్ టీవీలు అందుబాటులో ఉన్నాయని చెప్తున్నారు. ప్రతిరోజు ఉదయం 7 నుంచి 10 గంటల వరకు ఈ కార్యక్రమం సాగుతుంది.

హైందవ ఆలయాలకు..
క్రైస్తవుల అడ్డంకి లేదు

● ప్రొఫెసర్ జోసెఫ్ మోసిగంటి



చేబ్రోలు, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర క్రైస్తవ నాయకుడు ప్రొఫెసర్ మోసిగంటి ఆకివీడు పెదపేటలో రామాలయం నిర్మాణాన్ని క్రైస్తవులు అడ్డుకుంటున్నారనే వార్తలను ఖండించారు. ఈ వ్యాఖ్యలు వ్యక్తిగతంగా ఒకరి అభిప్రాయం మాత్రమేనని, అది క్రైస్తవ సమాజానికి ప్రాతినిధ్యం వహించదని తెలిపారు. క్రైస్తవ సమాజం తరపున హైందవులకు, రఘురామకృష్ణ రాజుకు క్షమాపణలు తెలిపారు. కొందరి చర్యలను మొత్తం సమాజానికి ఆపాదించడం తగదని, చట్టపరమైన చర్యలు వ్యక్తులపై తీసుకోవాలని సూచించారు. నిజమైన క్రైస్తవులు ఇతర మతాల ఆలయాలను అడ్డుకోరని, పరస్పర గౌరవంతో ఉండాలని చెప్పారు. అదే విధంగా హైందవులు కూడా చర్చిలపై దాడులు, అవమానాలు చేయకుండా సహనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. భారతదేశం ఆధ్యాత్మికతలో ప్రత్యేకమని, అన్ని మతాల మధ్య సోదరభావం కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.35 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

5,900 మిర్చి టిక్కీల అమ్మకం

దాచేపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఆదివారం 6,600 మిర్చి టిక్కీలు చేరుకోగా 5,900 టిక్కీల అమ్మకం జరిగింది. 334 రకం రూ.12 వేలు నుంచి రూ.22,500, తేజా రకం రూ. 11 వేల నుంచి రూ.21వేలు, తాలుకాయలు రూ. 3 వేల నుంచి రూ.10 వేలకు అమ్మకం జరిగాయి.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	140, 149, 160
చికెన్ విత్ స్కిన్(కిలో)	270.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	280.00

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

● 75వ రోజు గ్రంధసిరిలో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

● గ్రామంలో లింకు, సీసీ రోడ్లు, డ్రెయిన్స్ నిర్మాణం కోసం కృషి



గ్రంధసిరిలో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



వర్షాన్ని సైతం లెక్క చేయకుండా మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రవీణ్

అచ్చంపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సూచించారు. ఆదివారం రాత్రి మండలంలోని గ్రంధసిరి గ్రామంలో ప్రజల వద్దకు ప్రవీణ్, వంద రోజులు - వంద గ్రామాలు కార్యక్రమం 75వ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో లింకు, సీసీ రోడ్లు, డ్రెయిన్స్ నిర్మాణం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల వద్దకు ప్రవీణ్ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి పలు సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఇప్పటి వరకు గ్రామంలో రూ.11.90 కోట్లు సంక్షేమం, అభివృద్ధి కోసం ఖర్చు చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. గ్రామంలో వీధి లైట్లు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా అధికారులు పని చేయాలన్నారు. కార్యకర్తలకు ఎలాంటి సమస్యలు తలెత్తినా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలోని వినూత్నంగా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతంగా 75వ రోజు గ్రంధసిరిలో జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పల్నాడు జిల్లా టీడీపీ పార్టీ అధ్యక్షుడు ఎస్‌కే జాన్ సైదా, సంగం డెయిరీ మాజీ చైర్మన్ కిలారి రాజన్‌బాబు, వెన్నా సాంబశివారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, నూర్జహాన్ బేగం, కోటపాటి చిన్ని, కోటపాటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ, పెదకూరపాడు, అమరావతి మండలాల పార్టీ అధ్యక్షులు, నియోజక వర్గస్థాయిలో అనేక మంది టీడీపీ నాయకులు పాల్గొన్నారు. గ్రామంలో ముందుగా ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే ప్రవీణ్ నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు.

వేగా జ్యుయలర్స్ అక్షయ తృతీయ లక్కీడ్రా విజేతలు



వేగా జ్యుయలర్స్ షోరూంలో లక్కీ డ్రా నిర్వహణ దృశ్యం

గుంటూరు, మే 2(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో సుపరిచితమైన ప్రముఖ ఆభరణాల షోరూం వేగా జ్యుయలర్స్. అక్షయ తృతీయ శుభ సందర్భంగా గుంటూరులోని వేగా జ్యుయలర్స్ షోరూంలో ఏప్రిల్ 16 నుంచి 26 వరకు అద్భుతమైన ఆఫర్లను ప్రవేశపెట్టారు. ఈ పరిమిత ఆఫర్ కాలంలో పాల్గొన్న ఖాతాదారులకు లక్కీ డ్రా నిర్వహించి, గెలుపొందిన అయిదుగురికి రూ.2 లక్షల చొప్పున విలువైన బంగారు లేదా వజ్రాల హారం గెలుపొందే సువర్ణ అవకాశం ప్రకటించారు. ఈ సందర్భంగా గుంటూరు షోరూంలో నిర్వహించిన లక్కీ డ్రాలో హరీష్ నూతలపాటి(గుంటూరు), ఐట సైదాబీ(కొత్తపేట), మౌనిక, (గుంటూరు), పద్మావతి గోరంట్ల(గుంటూరు), డి.శ్రేష్ట(గుంటూరు) విజేతలుగా నిలిచారు. ఈ లక్కీ డ్రాలో గెలుపొందిన విజేతలకు వేగా జ్యుయలర్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ కుమార్ వనమా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుధాకర్ వనమా అభినందనలు తెలియజేశారు. ఆభరణాల నాణ్యతలో రాజీ ప్రసక్తి లేకుండా అన్ని వేడుకలు, వివాహాది శుభవేళలకు అవసరమైన సంప్రదాయ, ఆధునిక ఫ్యాషన్ ఆభరణాలను అందిస్తామనే విశ్వాసాన్ని ప్రకటించారు. గుంటూరులో తమ షోరూంను ఆదరించిన అందరికి ధన్యవాదాలు తెలిపారు. ఆఫర్లకు విశేష స్పందన లభించిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని నగరాలకు వేగా జ్యువెలర్స్ షోరూమ్ లను విస్తరించే ప్రతిపాదనలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. లక్కీ డ్రాలో గెలుపొందిన విజేతలు ఆనందం వ్యక్తం చేశారు. ఖాతాదారులకు మంచి ఆఫర్లను అందిస్తున్న వేగ జ్యుయలర్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

గొట్టిపాడులో భారీ అగ్నిప్రమాదం

● నాలుగు వరి గడ్డి వాములు, లారీ అగ్నికి ఆహుతి



గొట్టిపాడులో అగ్నికి ఆహుతై పోతున్న గడ్డి వాములు

ప్రత్తిపాడు, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొట్టిపాడులో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఆదివారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన గరికపాటి లక్ష్మయ్యకు చెందిన వరి గడ్డి వాముల వద్ద ఒక్క సారిగా మంటలు ఎగిసి పడ్డాయి. గడ్డి వాముల పక్కనే ఉన్న ఒక లారీ కూడా పూర్తిగా అగ్నికి ఆహుతయ్యింది. సుమారు రూ.5 లక్షల విలువ చేసే ఒక్కో చొప్పు, గడ్డి వాములు నాలుగు ఉన్నాయి. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. లారీ పక్కనే ఉన్న మరో మినీ ఆటోను తొలగించారు. సుమారు రూ.45 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. గుంటూరు నుంచి అగ్నిమాపక దళం వచ్చి మంటలను అదుపుచేసే లోపే నష్టం జరిగిపోయింది.

పీఆర్ 4వ తరగతి ఉద్యోగుల సంఘం..
జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

● అధ్యక్ష, కార్యదర్శులుగా రత్నకుమార్, అంబేడ్కర్



ఏకగ్రీవమైన సంఘం నూతన కార్యవర్గం

గుంటూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ 4వ తరగతి ఉద్యోగుల జిల్లా సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవమైంది. ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా సమితిలలో ఎన్నికకాబడిన కార్యవర్గ సభ్యులు జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జి.రత్నకుమార్, ప్రధాన కార్యదర్శిగా బి.ఆర్ అంబేడ్కర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కోటమ్మ, ఉపాధ్యక్షులుగా జక్కా మహేష్, ఎస్వీఆర్ చైతన్య, పి.శ్రీనివాసరావు, శరత్ తదితరులు ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీలుగా ఎస్.శ్రీనివాసరావు, సీహెచ్ ఆనంద్, ఎం.సందీప్, ట్రెజరర్‌గా ఎస్కే మహబూబ్ సుభాని, కార్యనిర్వాహక కార్యదర్శులుగా బి.నాగార్జున, వి.నాగేశ్వరరావు, టి.సునీల్ జోషి, మహిళా ప్రతినిధిగా హైమావతి, కార్యనిర్వాహక సభ్యులుగా రాజేశ్వరి, మల్లేశ్వరరావు, కె.జగన్ మోహన్‌రావు తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారిగా రొంపిచర్ల ఎంపీపీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డి.శరత్ బాబు, పరిశీలకుడిగా ప్రత్తిపాడు డిప్యూటీ తహసీల్దారు ఎ.శివశంకర్ వ్యవహరించారు.

ప్రయాణికులకు ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు

● కూడళ్ల వద్ద టెంట్‌లు, చలివేంద్రాలు



ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టెంట్, చలివేంద్రం

గుంటూరు, మే 3(ఆంధ్రజ్యోతి): మండు వేసవితో తల్లడిల్లుతూ.. బస్సుల కోసం వేచి చూసే ప్రయాణికులకు షెల్టర్స్ లేని ప్రాంతాల్లో ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. జిల్లా ప్రజా రవాణాధికారి డి.సాంబ్రాజ్యం ఆధ్వర్యంలో గుంటూరు-1, 2 డిపోలతో పాటు మంగళగిరి, పొన్నూరు, తెనాలి డిపోల పరిధిలోని ప్రధాన సెంటర్లలో ప్రయాణికులు వేచి ఉండేందుకు టెంట్‌లు, తాగునీటి చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. నగరంలోని ఇన్నర్ రింగ్ రోడ్డులోని చిల్లీస్ సెంటర్, రమేష్ హాస్పటల్ పాయింట్, గుంటూరు-2 డిపో మేనేజర్ సీహెచ్ సునీత ఆధ్వర్యంలో పెదకాకాని సెంటర్‌లో టెంట్‌తో పాటు తాగునీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ వేసవి వరకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు. అలానే అంగలకుదురు, సుల్తానాబాద్ సెంటర్‌లలో టెంట్‌తో పాటు తాగునీటి సౌకర్యం, పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా కంట్రోలర్స్‌ను ఏర్పాటు చేశారు.

ఊళ్లు వెళ్తే.. ఇళ్లు దోచేస్తారు

● దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

● ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● చోరీల నివారణకు ప్రత్యేక నిఘా: ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో ఊళ్ళకు వెళ్ళే వారు, ఆరు బయట, డాబాల మీద నిద్రించేవారు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వేసవిలో దొంగల తాకిడి అధికంగా ఉండే అవకాశం ఉందని, ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీస్ శాఖ ఉచితంగా అందించే లాక్‌హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్) సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. స్కూల్స్, కాలేజీలకు వేసవి సెలవుల నేపథ్యంలో అనేక కుటుంబాలు పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు ప్రయాణాలు చేపడతారని, ఈ తరుణంలో ఖాళీగా ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఎస్పీ తెలిపారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ ద్వారా ప్రయాణాలకు వెళ్లిన వారి ఇళ్లపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. పోలీస్ కంట్రోల్ రూం, డయల్ 112 వ్యవస్థలను మరింత బలోపేతం చేసి అత్యవసర సేవలను వేగవంతం చేసినట్లు వివరించారు.

తప్పనిసరిగా పాటించాల్సిన భద్రతా సూచనలు

- నగదు, బంగారం వంటి విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్లలో భద్రపరచాలి.
- ప్రయాణానికి ముందు సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించి, ఎల్‌హెచ్‌ఎంఎస్‌ సేవలను వినియోగించుకోవాలి.
- ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, అవి సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో తరచుగా పరిశీలించాలి.
- ఇంటి తలుపులు, కిటికీలు బలమైన తాళాలతో లాక్ చేసి యాత్రలకు, ఊళ్లకు వెళ్లాలి.
- ప్రయాణ వివరాలను నమ్మకమైన పొరుగు వారికి లేదా బంధువులకు తెలియజేయాలి.
- ఇంటి పైభాగంలో (మిద్దెలపై) లేదా బయట నిద్రించే వారు తాళాలు భద్రంగా వేసుకుని అప్రమత్తంగా ఉండాలి.
- బయట నిద్రించే సమయంలో ఆభరణాలు ధరించకుండా ఉండటం మంచిది.
- ప్రమాణ సమయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి.
- అనుమానాస్పద వ్యక్తులు, కదలికలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.
- చైన్ స్నాచర్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. బయటకు వెళ్ళేప్పుడు ఒంటిపై ఆభరణాలు లేకుండా, ఒకరు తోడుండేలా చూసుకోవాలి.

జిల్లా పై ప్రత్యేక నిఘా....

దొంగతనాలు, చైన్‌స్నాచింగ్స్ వంటి నేరాలు జరగకుండా పోలీస్ శాఖ అన్ని ముందు జాగ్రత్త చర్యలు చేపట్టిందని ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేసారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేసామన్నారు. హాట్‌స్పాట్ ప్రాంతాల్లో డ్రోన్, మొబైల్ పెట్రోలింగ్ వినియోగించనున్నట్లు తెలిపారు. ప్రజల అప్రమత్తతే వారి ఆస్తి రక్షణకు ప్రధాన ఆధారమని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.

ఆరు గంటల ఆలస్యమా!

● ప్రయాణికులకు నరకం చూపించిన రైళ్లు..

గుంటూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): మండు వేసవిలో కొన్ని రైళ్లు ఆదివారం ప్రయాణికులకు ప్రత్యక్ష నరకాన్ని చూపించాయి. ఏకంగా ఆరు గంటల ఆలస్యంగా గుంటూరు జంక్షన్‌కు చేరుకోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా స్లీపర్, జనరల్ బోగీల ప్యాసింజర్లు నరకం అంటే ఏమిటో చూశామని వాపోయారు. గత శనివారం సాయంత్రం 5.05కి మైసూరులో బయలుదేరిన 17290 ఎక్స్‌ప్రెస్ గుంటూరుకు ఆదివారం ఉదయం 11.58కి రావాల్సి ఉంది. ఆరు గంటల ఆలస్యంగా రాత్రి 9.33కు వచ్చింది. ఈ నెల ఒకటిన హిసార్‌లో బయలుదేరిన ప్రత్యేక రైలు ఆదివారం మధ్యాహ్నం 3.40కి గుంటూరు రావాలి. 6.25 గంటల ఆలస్యంగా రాత్రి 10.05కి వచ్చింది. 17645 సికింద్రాబాద్ - రేపల్లె ఎక్స్‌ప్రెస్‌ని సికింద్రాబాద్‌లోనే 1.15 గంటలు రీషెడ్యూల్ చేయడంతో మార్గమధ్యలో క్రాసింగ్స్ కోసం ఈ రైలుని లూప్‌లైన్‌లో పెట్టేశారు. దీంతో సాయంత్రం 6.10కి గుంటూరు రావాల్సిన ఈ రైలు రాత్రి 9.55కి వచ్చింది. ఇదే రైలు రేపల్లె వెళ్లి డెల్టా ఎక్స్‌ప్రెస్‌గా వికారబాద్‌కు తిరుగు ప్రయాణం కావాల్సి ఉండటంతో ఆ రైలుని రీషెడ్యూల్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

గుంటూరు సిటీ వార్తలు

ప్రభుత్వ పాఠశాలలపై పెరిగిన నమ్మకం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్



టెన్త్ టాపర్లకు విందు ఇచ్చిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం తీవ్రంగా కృషి చేస్తున్నాం. పదో తరగతి ఫలితాలు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని పెంచుతాయని చెప్పడానికి గర్వపడుతున్నాం. రాబోయే రోజుల్లో మీరు ఎక్కడ చదవాల నుకుంటే అక్కడ తోడ్పాటు అందిస్తానని మాట ఇస్తున్నా. ఏ సమయంలోనైనా నా అవ సరం వస్తే మా కార్యాలయాన్ని సంప్రదించండి' అంటూ తూర్పు ఎమ్మెల్యే నసీర్ విద్యా ర్థులకు భరోసా కల్పించారు. నియోజకవర్గంలోని 17 పాఠశాలల్లో ఇద్దరు విద్యార్థులు 582 మార్కులు, పది మంది విద్యార్థులు 575 మార్కులు సాధించారు. వారిని ఆదివారం స్థాని క తూర్పు కార్యాలయానికి పిలిపించి ఎమ్మెల్యే నసీర్ ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. రాష్ట్రంలో గత ఏడాది కంటే ఈ సంవ త్సరం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక ఉత్తీర్ణత శాతం పెరగడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేపట్టిన విప్లవాత్మక మార్పు లే కారణమని ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. విద్యార్థులు ఇప్పటి నుంచే స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు.

హత్యలు చేసే పార్టీని ఏమనాలి?

పార్టీ పెట్టినప్పటి నుంచి హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్న వైసీపీని గొడ్డలి పార్టీ కాక ఏమనాలని ఎమ్మెల్యే నసీర్ ప్రశ్నించారు. ఆదివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడారు. తమది గొడ్డలి పార్టీయా అంటూ మాజీ మంత్రి విడుదల రజిని ప్రశ్నించడంపై ఎమ్మెల్యే నసీర్ ఘాటుగా స్పందిం చారు. సొంత బాబాయ్‌ని చంపినట్లు స్వయాన చెల్లెలు షర్మిల చెప్పింది నిజం కాదా? కడపలో ఆస్తుల కోసం పెద్ద దస్తగిరిని చంపింది నిజం కాదా? మంగపేటలో బైరటీస్ గనుల కోసం బీసీ వర్గానికి చెందిన పారిశ్రామిక వేత్తను చంపింది నిజం కాదా? పల్నాడు లో టీడీపీ సానుభూతిపరుడనే నెపంతో తోట చంద్రయ్యను నరికి హత్య చేసింది, ప్రొద్దుటూరులో నేత కుటుంబానికి చెందిన నందం సుబ్బయ్యను చంపింది, పరిటాల రవిని చంపింది, దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యంను చంపి డోర్ డెలివరీ చేసింది, మాస్క్ అడిగిన సుధాకర్ ప్రాణాలను తీసింది, అక్కను వేధిస్తున్నారని చెప్పినందుకు పదేళ్ళ బాలుడు అమర్నాథ్‌ను హత్య చేసింది, పుంగనూరులో ప్రతాప్‌ను శవంగా మార్చింది మీరుకాదా అని ఎమ్మెల్యే నసీర్ సూటిగా ప్రశ్నించారు. ఇన్ని హత్యలు చేసిన వైసీపీని గొడ్డలి పార్టీ అంటారని స్పష్టం చేశారు.

ఖత్నాకు సహకారం అభినందనీయం

ఇస్లాంలో పరమ పవిత్రంగా భావించే ఖత్నా కార్యక్రమానికి పూర్తి సహకారం అందిం చడం అభినందనీయం.. గుంటూరు ముస్లిం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అంజుమన్ ఇస్లామియా పాఠశాలలో నిర్వహించిన సామూహిక ఖత్నా కార్యక్రమానికి హాజరుకావటం అల్లా కృపగా భావిస్తున్నాను అని ఎమ్మెల్యే నసీర్ అన్నారు.



ఏఐవైఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, పాల్గొన్న సీపీఐ నాయకులు

నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు

గుంటూరు(తూర్పు), మే 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేట, మల్లయ్యలింగం భవన్లో ఆదివారం అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 67వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముప్పాళ్ల ప్రసంగించారు. ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ ఆ వాగ్దానాన్ని అమలు చేయలేదని విమర్శించారు. మరో వైపు రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ఎన్నికల సమయంలో సంవత్సరానికి నాలుగు లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి ఇస్తామని ఇచ్చిన హామీలు అమలు కాలేదని మండిపడ్డారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వలీ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2.3 లక్ష ల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళ నలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్య దర్శి కోటా మాల్యాద్రి, చల్లా మరియదాసు, యశ్వంత్, బన్నీ అమర్నాథ్, మస్తాన్‌రావు, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

మెగా ఉచిత ఖత్నా క్యాంపుకు విశేష స్పందన

గుంటూరు(తూర్పు), మే 3(ఆంధ్రజ్యోతి): పేద ముస్లిం బాలుర కోసం ఎస్ఎం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా ఉచిత ఖత్నా క్యాంప్‌కు విశేష స్పందన లభించింది. స్థానిక పొన్నూరు రోడ్డులోని ఏఆర్‌పీసీ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఈ క్యాంప్‌లో సుమారు 500మందికి పైగా బాలురుకు అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో ఉచితంగా ఖత్నా చేశారు. అనంతరం అవసరమైన మందులు, సంరక్షణ సామగ్రి, పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్, టీడీపీ నాయకుడు సయ్యద్ ముజీబ్ మాట్లాడుతూ సమాజ సేవే తమ లక్ష్యమని తెలిపారు. పేదలకు ఉపయోగపడే కార్యక్రమాలను నిరంతరం కొన సాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు నంబూరు సుభాని, షేక్ మస్తాన్‌వలి, ఎస్ఎన్ జియావుద్దీన్, షేక్ ఫక్రుద్దీన్, ఆరిఫ్ షేక్, జియావుర్ రహమాన్, ట్రస్ట్ సభ్యులు సయ్యద్ షబ్బీర్, సయ్యద్ ఫైరోజ్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తున్న టీడీపీ నాయకుడు సయ్యద్ ముజీబ్

నవ్వుతోనే.. సంపూర్ణ ఆరోగ్యం

గుంటూరు(తూర్పు), మే 3 (ఆంధ్రజ్యోతి): నవ్వుతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని లాఫింగ్ క్లబ్ అధ్యక్షుడు షేక్ లాల్ వజీర్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం లాఫింగ్ డే వేడుకల ను ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోజుకు కనీసం వంద సార్లు నవ్వాలని వైద్యులు సూచిస్తున్నారని తెలిపారు. మంచి నవ్వుతో ఆరోగ్యం మెరుగవుతుందని చెప్పారు. ప్రస్తుత కాలంలో మానవ సంబంధాలు దూరమవుతున్న నేప థ్యంలో నవ్వు ఎంతో ఉపయోగకరమని, ఎదుటివారి మనసును గెలుచుకునే శక్తి నవ్వులో ఉందన్నారు. అనంతరం స్టేడియంలో నవ్వుపై అవగాహన పెంచేందు కు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ధర్మ కిషోరి, లక్ష్మి, సంధ్య, కమల, శ్రీనివాస్, మానవత సాంబశివరావు, రమేష్, డాక్టర్ కల్పన, శివరాం ప్రసాద్ రత్నం, సీత పాల్గొన్నారు.

రైల్వేలో సీసీఐగా సేవలందించిన వరప్రసాదుకు సత్కారం

గుంటూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ కమర్షి యల్ విభాగంలో వివిధ హోదాల్లో 34ఏళ్ల పాటు ఏ.నాగేంద్ర వరప్ర సాదు సేవలు అందించారని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక రింగురోడ్డులో చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ హోదాలో విరమణ పొందిన ఏఎన్‌వీ ప్రసాదు అభినందన కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రైల్వే డీసీఎం వినయ్‌కాంత్ మాట్లాడుతూ సీసీఐ ప్రసాదు సౌమ్యుడిగా పేరు సంపాదించుకొన్నారన్నారు. మీడియా రిలేషన్స్ చక్కగా నిర్వర్తించారని, తద్వారా గుంటూ రు రైల్వే డివిజన్ ఖ్యాతిని ప్రజలకు తెలియజేయ గలిగామన్నారు. ఏఎన్‌వీ ప్రసాదు మా ట్లాడుతూ తనకు అధికారులు, తోటి ఉద్యోగులు ఎంతో సహకరించేవారన్నారు. వారందరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా నన్నారు. ఈ కార్యక్రమంలో వీజీటీఎం ఉడా మాజీ చైర్మన్ వణుకూరి శ్రీనివాసరెడ్డి, రైల్వే కమర్షియల్ విభాగం సిబ్బంది, మజ్దూర్ యూనియన్, ఎం ప్లాయీస్ సంఘ్ నాయకులు పాల్గొన్నారు.



రైల్వేలో సీసీఐగా సుదీర్ఘకాలం పని చేసిన ఏఎన్‌వీ ప్రసాదుని సత్కరిస్తున్న డీసీఎం వినయ్‌కాంత్, కమర్షియల్ విభాగం ఉద్యోగులు

వేడుకగా విశ్వబ్రాహ్మణ సంఘ ప్రమాణ స్వీకారం

గుంటూరు(తూర్పు), మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైలుపేట, పాత కమూరి రామకోటేశ్వర ప్రాంగణంలో ఆదివారం జిల్లా విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక, ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చింతాడ బ్రహ్మానందరావు అధ్యక్షత వహించగా, రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు రాష్ట్ర ఇన్‌చార్జ్ రాజశేఖర్ సారథ్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా జంపని నాగేశ్వరరావు, కోశాధికారిగా చోడ భద్ర య్య, రాష్ట్ర అధికార ప్రతినిధిగా చోడవరపు రవి నియమితులయ్యారు. అనంతరం వారికి టీడీపీ బీసీ జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీని వాస్, మాజీ కార్పొరేటర్ నూకవరపు బాలాజీ, పీవీఎల్ ఆచారి తదితరులు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు కడియాల సుబ్బారావు, గోనుగుంట్ల శివప్రసాద్, గోనుగుంట్ల సుధీర్, నందిపాటి శివదత్తు, ఎలవర్తి ధర్మారావు, కందేపు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



సభ్యులకు నియామక పత్రాలను అందజేస్తున్న వేములకొండ శ్రీనివాస్, నూకవరపు బాలాజీ తదితరులు



రౌడీషీటర్స్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్న నల్లపాడు సీఐ భాస్కర్

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

● నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

గుంటూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్స్ సత్ప్రవర్తనతో మెల గాలని నల్లపాడు సీఐ భాస్కర్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీషీటర్స్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఆదివారం నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సీఐ భాస్కర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు తన నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, సమాజంలో సత్ప్రవర్తనతో జీవిం చాలని రౌడీషీటర్లకు సూచించారు. అవాంఛనీయ పరిస్థితులకు సృష్టించినా, నేరాలకు, పాల్ప డినా కఠిన చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్లను హెచ్చరించారు. రౌడీషీటర్స్‌పై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. గంజాయి, బెట్టింగ్, పేకాట, ఇతర నేరాలు వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించేదిలేదన్నారు. తమ పరిధిలో జరిగే నేరాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు.



అంజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐకేఎస్ సభ్యులు

రైతుల హక్కుల కోసం అంజన్ పోరాటాలు అభినందనీయం

గుంటూరు(తూర్పు), మే 3(ఆంధ్రజ్యోతి): రైతాంగ హక్కుల కోసం అంకి తభావంతో పనిచేసిన యోధుడు అతుల్‌కుమార్ అంజన్ అని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీవీ జగన్నాథం కొనియాడారు. స్థానిక కొత్త పేట, మల్లయ్య లింగం భవన్లో ఆదివారం అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్ కుమార్ అంజన్ రెండో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా జగన్నాథం మాట్లాడుతూ అంజన్ మాట్లాడే తీరు ఎంతో ప్రభావవంతంగా ఉండేదని గుర్తు చేసుకున్నారు. స్వామినాథన్ కమి షన్ సభ్యుడిగా, సీపీఐ జాతీయ కార్యదర్శిగా ఆయన కీలక బాధ్యతలు నిర్వహించి, ఉద్యమాలకు దిశానిర్దేశం చేశారని అన్నారు. అంజన్ ఆశయాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని, వాటి సాధనకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కంజుల విఠల్ రెడ్డి, ముప్పాళ్ల శివశంకరరావు, అబ్రహం, అమర్నాథ్, శివ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చెస్ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు, కోచ్‌లు

గుంటూరు (తూర్పు), మే 3 (ఆంధ్రజ్యోతి): నైట్స్ క్యాజిల్ చెస్ అకాడమీ ఆధ్వ ర్యంలో స్థానిక ఇన్నర్ రింగ్ రోడ్, విజేత ఐఐటీ స్కూల్లో ఆది వారం జిల్లా స్థాయి అండర్-11 బాల, బాలికల చదరంగం జట్టు ఎంపికలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. టోర్నమెంట్ డైరెక్టర్ వైవీకే చక్రవర్తి మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 9, 10 తేదీల్లో విశాఖపట్నం లో జరిగే రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనం తరం విజే తలకు జిల్లా చదరంగం కార్యదర్శి రవీంద్ర రాజు, పాఠశాల డైరక్టర్లు నిమ్మల సురేష్, సంధ్య బహుమతులు ప్రదానం చేశారు. ఎంపికైన క్రీడాకారులలో పి.లలిత్యా, పి.భవిష్య, ఎం.చేతన్, ఎస్.దీప్ సింగ్ ఉన్నారు.

దళిత క్రైస్తవుల హక్కులను పరిరక్షించాలి

గుంటూరు(తూర్పు), మే 3 (ఆంధ్రజ్యోతి): 1950 రాష్ట్రపతి ఉత్తర్వు రద్దు చేసి, కేజీ బాలకృష్ణన్ కమిషన్ నివేదికను కేంద్రానికి పంపాలని ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ గోళ్లమూడి రాజా సుందరంబాబు డిమాండ్ చేశారు. దళిత హక్కులు పరిరక్షించాలని కోరుతూ మహి ళలు, క్రైస్తవ యువతతో కూడిన 14మంది బృందం ఆదివారం న్యూ గుంటూరు రైల్వే స్టేషన్ నుంచి న్యూఢిల్లీకి బయలుదేరింది. ఆయన మాట్లాడుతూ జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ సిఫార్సులను మోదీ బహిర్గతం చేయడం లేదని మండిపడ్డారు. ఈ సిఫార్సులను దాచిపెట్టి కేజీ బాలకృష్ణన్‌తో మరో కమిటీ ఏర్పాటు చేసారని అన్నారు. క్రైస్తవ, ముస్లిం మతాల్లోని ఎస్సీలకు ఎస్సీ హోదా కల్పించాలని, రంగనాథ్ మిశ్రా కమిషన్ సిఫార సులను అమలు చేయాలని కోరారు. ఈ నెల 5న కేజీ బాలకృష్ణన్‌ను, 6న రామ్‌దాస్ అథవాలేను కలిసి వినతిపత్రా లు సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేల్పూరి మరియరాణి, సరోజిని, ఏసుమ్మ, వి.శిరీష, జై కుమార్ ఉన్నారు.

మోసాల 'మారం'

● నకిలీ పత్రాలతో రుణాలు ● బ్యాంకర్లతో దోస్తీ
● ముగ్గురి అరెస్టు ● నేడు కోర్టులో కస్టడీ పిటిషన్

విజయవాడ, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఒకరితో జత కడతాడు. నెమ్మది వారు చేసే వ్యాపారంలో భాగస్వామి అవుతాడు. తర్వాత ఆ వ్యాపా రానికి సంబంధించిన మొత్తం వివరాలు సేకరిస్తాడు. వెంటనే నకిలీ పత్రాలను సృష్టిస్తాడు. ఈ వివరాలతో మరో ప్రాంతంలో వ్యాపారం ప్రారంభించి అసలు యజమానిని నిలువునా ముంచేస్తాడు. ఇదీ గుంటూరుకు చెందిన మారం మోహన్ ఎంవో. అతడితోపాటు నరసరా వుపేటకు చెందిన కొత్త శ్రీనివాసరావు, పవన్‌కుమార్ కలిసి విజ యవాడలో రాజ్ ఎంటర్‌ప్రైజస్‌కు సంబంధించి లేబర్ లైసెన్స్, జీఎస్టీ లైసెన్స్‌లకు నకిలీ ధ్రువీకరణపత్రాలను తయారు చేశాడు. వాటిని ప్రైవే టు బ్యాంకులకు సమర్పించి రుణాలు పొందారు. మొత్తం రూ.60లక్షల వరకు నకిలీ ఈ కేసులో ముగ్గురిని సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం ఈ ముగ్గురు విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. వారి నుంచి మరిన్ని వివరాలు సేకరించేందుకు వారం రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేయడానికి సిద్ధమయ్యారు. ఈ ముగ్గురికి రూ.60లక్షల రుణాలు మంజూరు చేయడంలో ప్రైవేటు బ్యాంకర్ల పాత్ర పుష్కలంగా ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఎన్ని బ్యాంకుల నుంచి ఈ రుణాలు పొందారో ఆయా బ్యాంకుల సిబ్బందిని విచారించడానికి పోలీసులు రంగం సిద్ధం చేశారు. నిందితుల్లో మారం మోహన్ ఆర్థిక నేరాల్లో చేయడంలో మంచి ప్రావీణ్యుడు. లోగడ ఐసీఐసీఐ బ్యాంకులో పనిచేసిన అనుభవం ఉండడంతో రుణాల మంజూరులో ఎలాంటి ప్రక్రియ ఉంటుందో బాగా వడపోశాడు. దానికి తన నేర బుర్రను జోడించాడు. అతడిపై 2024లో కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. తర్వాత ఆ కేసు సీఐడీకి బదిలీ అయింది.

రామిరెడ్డినగర్‌లో వృద్ధుడు అదృశ్యం



తుమ్మల లక్ష్మీనారాయణ (పాత చిత్రం)

గుంటూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామి రెడ్డినగర్‌లో తుమ్మల లక్ష్మీనారాయణ (65) అనే వృద్ధుడు అదృశ్యమయ్యాడు. గత నెల 24న ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన లక్ష్మీనారాయణ తిరిగి రాలేదు. రోజుమాదిరిగా ఆ రోజు మధ్యాహ్నం ఒంటిగంటకు భోజనానికి రాకపోవడంతో ఫోన్ చేయగా తాను విజయవాడలో ఉన్నానని చెప్పాడు. అంతట కంగారుపడిన భార్య గోవిం దమ్మ బంధువులకు ఫోన్ చేయగా వారు విజయవాడ రైల్వేస్టేషన్, బస్టాండ్ ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియరాలేదు. అప్పటి నుంచి బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికి నా ఆచూకీ లేదు. ఎటో కనిపించకుండగా వెళ్లిపోయాడని తెలుసుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కని పించకుండా వెళ్లిన వ్యక్తి ఆచూకీ తెలిసినవారు సీఐ 8688831336లో గాని, ఎస్ఐ 8688831339లో గానీ తెలియజేయాలని పోలీసులు కోరారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడుకోవటం అందరి బాధ్యత : చంద్రశేఖర్

గుంటూరు, మే 3(ఆంధ్రజ్యోతి): పత్రికా స్వేచ్ఛను కాపాడుకోవటం ప్రతి పౌరుడి బాధ్యత అని రాడికల్ హ్యూమనిస్టు నాయకుడు కె.చంద్రశే ఖర్ పేర్కొన్నారు. అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం సందర్భంగా ప్రజాస్వా మ్యం - పత్రికాస్వేచ్ఛ అనే అంశంపై జరిగిన సమావేశంలో ఆయన ప్రసం గించారు. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛను గౌరవించిన ప్పుడే భారత ప్రజాస్వామ్యం తన పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందని అన్నారు. ప్రజాస్వామ్యానికి మీడియా అద్దం వంటిదని, సమాజంలో జరు గుతున్న వాస్తవాలను, అన్యాయాల ను, ప్రజా సమస్యలను, ప్రజా వ్యతి రేక ప్రభుత్వ నిర్ణయాలను నిష్పక్ష పాతంగా చూపిస్తుందన్నారు. కార్యక్ర మంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, చంద్రయ్య, వీవీ రావు, బసవగుప్తా తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, మే 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా సోమవారం పాతగుంటూరు బ్రాడీ యి సెంటర్, శివాలయం, ఆంజనేయ స్వామి ఆలయాల సెంటర్, చెన్నం వారి వీధి, జంగావారి వీధి ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు.



మాట్లాడుతున్న చెరుకూరి తిరుపతిరావు, పాల్గొన్న బీజేపీ నాయకులు

16 నుంచి జరిగే శిక్షణ కార్యక్రమాలను జయప్రదం చేయండి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు

గుంటూరు(తూర్పు), మే 3 (ఆంధ్రజ్యోతి): నంబూరు, వీవీఐటీ కళాశాలలో ఈ నెల 16, 17 తేదీల్లో జరిగే జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు కోరారు. స్థానిక లాలుపురం, వాజ్‌పేయి భవనంలో ఆదివారం జిల్లా కార్య వర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమానికి రాష్ట్ర స్థాయి నాయకులు హాజరై శిక్షణ ఇస్తారని వివరించారు. జిల్లా శిక్షణ సమన్వయకర్త రాంపల్లి జగన్నాథ శాస్త్రి మాట్లాడుతూ పార్టీ సంస్థాగత బలోపేతానికి శిక్షణ శిబిరాలు కీలకమని చెప్పారు. ఇప్పటికే మండల స్థాయి లో శిక్షణ పూర్తయిందని, ఇప్పుడు జిల్లా స్థాయిలో రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టొబాకో బోర్డు చై ర్మన్ సీహెచ్ యశ్వంత్, జూపూడి రంగరాజు, కొత్తూరి వెంకట సుబ్బారా వు, భీమినేని చంద్రశేఖర్, దర్శనపు శ్రీనివాస్, యడ్లపాటి స్వరూపరాణి, తాడువాయి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజధానిలో పేదల సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు

గుంటూరు(తూర్పు), మే 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రాజధానిలో పేదల అభివృద్ధిని విస్మరించి, పెద్దలకు భూములు దోచిపెడుతుందని సీపీ ఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్.బాబురావు విమర్శించారు. స్థానిక బ్రాడీపేటలో ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ రాజధాలోని ఆర్-5 జోన్‌లో ఇళ్ల స్థలాలు రద్దయిన పేదలకు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించాలన్నారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని 50వేల మంది పేదలకు 900 ఎకరాల్లో ఇళ్ల స్థలాలు కేటాయించారని, వాటిని ప్రస్తుత ప్రభుత్వం జీవో 91 ద్వారా రద్దు చేసిందని వివరించారు. వేరే ప్రాంతంలో వారికి ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించలేదన్నారు. ఇప్పటి వరకూ సమీకరించిన భూమి, సమీకరించా ల్సిన భూమి కలిపి 2.30 లక్షల ఎకరాలు ఉంటుందని, ఇంత పెద్ద ఎత్తున రైతుల నుంచి భూమి తీసుకుని బడా కార్పొరేట్ కంపెనీలకు కేటాయిస్తు న్నారని, పేదలను విస్మరిస్తున్నారని విమర్శించారు. జిల్లా కార్యదర్శి వై నేతా జీ మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో పేదల ఇళ్ల స్థలాల సమస్యలపై మే, జూన్ నెలల్లో ఆందోళనలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాశం రామారావు, ఈమని అప్పారావు, బి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీహెచ్ బాబురావు, పాల్గొన్న సీపీఎం నాయకులు

వైభవంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠ



ధ్వజస్తంభం ప్రతిష్ఠ వేడుకలో పాల్గొన్న భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు

గుంటూరు(తూర్పు), మే 3 (ఆంధ్ర జ్యోతి): స్థానిక లాలాపేట లో ఉన్న అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ధ్వజ స్తంభం ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ మాజీ చైర్మన్ కొండా సీతా రామస్వామి, సక్కుబాయమ్మ దంపతులు జ్ఞాపకార్థంగా వారి కుమారులు కొండా దుర్గా, మల్లేశ్వ రరావు, అనురాధ దంపతులు ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేశారు. ముత్తే వి శశికాంత్ బృందం ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనం తరం అభయాంజనేయ స్వామి సువర్చలాదేవి శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరిం చారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే లింగం శెట్టి ఈశ్వరరావు, హిమనీ స్వీట్స్ వేణు, ట్రెజర్ చక్కా సత్యనారా యణ, దేవాలయ పూజారి వేణు గోపాలాచారి తదితరులు పాల్గొన్నారు.

ఓఎన్‌జీసీ స్కాలర్‌షిప్స్



అయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్(ఓఎన్‌జీసీ) లిమిటెడ్ 2025-26 అంటే నడుస్తున్న విద్యాసంవత్సరానికి సంబంధించి స్కాలర్‌షిప్స్‌కు నోటిఫికేషన్ విడుదల చేసింది.

స్కాలర్‌షిప్స్: ఏటా 2000. ఇందులో ఎస్సీ, ఎస్టీ 1000, ఓబీసీ 500. జనరల్ 500. అన్ని విభాగాల్లో 50 శాతం అంటే మొత్తమ్మీద వెయ్యి స్కాలర్‌షిప్స్ మహిళలకు లభిస్తాయి. ఎంపికైన వారికి నెలకు రూ.4000 చొప్పున ఏడాదికి రూ.48,000 లభిస్తాయి.

అర్హత: ఏదైనా విద్యాసంస్థలో ఫుల్‌టైమ్ కోర్సును రెగ్యులర్ విధానంలో చదువుతూ ఉండాలి. బీఈ/ బీటెక్, మెడిసిన్, పీజీ స్థాయిలో జియాలజీ జియోఫిజిక్స్/ ఎంబీఏ చదువుతూ ఉండాలి. ముఖ్యంగా ప్రస్తుత విద్యాసంవత్సరం లోనే చేరి ఉండాలి. చేస్తున్న కోర్సుకు ఉద్దేశించిన అర్హత పరీక్షలో కనీసం 60 శాతం మార్కులు ఇంటర్/ డిగ్రీలో పొంది ఉండాలి. వయస్సు 2025 ఆగస్టు 1 నాటికి 30 సంవత్సరాలకు మించ కూడదు. ఇంతవరకు ఏ స్కాలర్‌షిప్‌నకు ఎంపికై ఉండరాదు.

దరఖాస్తుకు ఆఖరు తేదీ: మే 15

వెబ్‌సైట్: scholarships.gov.in/ (NSP portal)

స్టెనోగ్రాఫర్ రిక్రూట్‌మెంట్

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) - స్టెనోగ్రాఫర్ గ్రేడ్-సి, గ్రేడ్-డి ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు విభాగాలు, సంస్థల్లో 731 స్టెనోగ్రాఫర్ పోస్టుల భర్తీకి దీనిని ఉద్దేశించారు.

అర్హత: ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణతకు తోడు స్టెనోగ్రఫీలో నైపుణ్యం ఉండాలి.

ఎంపిక: కంప్యూటర్ ఆధారిత పరీక్ష 200 మార్కులకు ఉంటుంది. రాతపరీక్షలో క్వాలిఫై అయిన వారికి అభ్యర్థులు ఎంచుకున్న ప్రకారం హిందీ లేదా ఇంగ్లీష్‌లో స్టెనోగ్రఫీ టెస్ట్ ఉంటుంది. చివరగా అభ్యర్థి డాక్యుమెంట్లను కూడా పరిశీలించి తుది ఎంపిక జరుపుతారు.

దరఖాస్తుకు ఆఖరు తేదీ: మే 15

కరెన్సీ నోట్ ప్రెస్

నాసిక్‌లోని కరెన్సీ నోట్ ప్రెస్ వివిధ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని పరిధిలోని నాలుగు యూనిట్లు - సీఎన్‌పీ నాసిక్, ఐఎస్‌పీఎన్ నాసిక్, బీఎన్‌పీ దేవాస్, ఎస్‌పీపీ హైదరాబాద్‌లో ఈ పోస్టులు ఉన్నాయి. 534 పోస్టులకు గాను 69 ఖాళీలు ఎస్‌పీపీ హైదరాబాద్‌లోనే ఉన్నాయి.

పోస్టులు: సేఫ్టీ ఆఫీసర్, వెల్ఫేర్ ఆఫీసర్, సూపర్వైజర్(టెక్నిల్ కంట్రోల్/ ఐటీ/ సివిల్ తదితరాలు) ఆర్టిస్ట్(గ్రాఫిక్ డిజైన్), సెక్రటేరియల్ అసిస్టెంట్, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్, జూనియర్ టెక్నీషియన్(ప్రింటింగ్/ కంట్రోల్/ ఎలక్ట్రికల్/ ఫిట్టర్ తదితరాలు) ఉన్నాయి. పోస్టుకు తగ్గట్టు అర్హతలు ఉండాలి.



ఎంపిక: కంప్యూటర్ ఆధారిత టెస్ట్ ద్వారా ఎంపిక చేస్తారు. కొన్ని పోస్టులకు ఆదనంగా స్కిల్ టెస్ట్ కూడా ఉంటుంది.

దరఖాస్తుకు ఆఖరు తేదీ: మే 19

వెబ్‌సైట్: cnpnashik.spmcil.com

కంబైన్డ్ హిందీ ట్రాన్స్‌లేటర్ ఎగ్జామినేషన్

కంబైన్డ్ హిందీ ట్రాన్స్‌లేటర్స్ ఎగ్జామినేషన్ ద్వారా 84 ఖాళీల భర్తీకి ఎస్ఎస్‌సీ మరో నోటిఫికేషన్ విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో ఈ పోస్టులు ఉన్నాయి.

పోస్టులు: జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్, జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్, జూనియర్ ట్రాన్స్‌లేటర్, సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్, సీనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్

అర్హతలు: పోస్టును అనుసరించి హిందీలో పీజీకి తోడు డిగ్రీ స్థాయిలో ఇంగ్లీష్ నిర్దేశించిన పద్ధతిలో చదివి ఉండాలి.

ఎంపిక: వంద మార్కులకు ఆబ్జెక్టివ్, మరో వంద మార్కులకు డిస్క్రిప్టివ్ పేపర్లు ఉంటాయి. పరీక్ష కాలవ్యవధి చెరి రెండు గంటలు.

దరఖాస్తుకు చివరి తేదీ: మే 14

వెబ్‌సైట్: https://ssc.gov.in

బ్యాంక్ ఆఫ్ బరోడా

బ్యాంక్ ఆఫ్ బరోడా స్పోర్ట్స్‌మన్ కోటా కింద 30 క్లరికల్ కేడర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఖాళీల వివరాలు: క్రికెట్ 9, కబడ్డీ 11, టేబుల్ టెన్నిస్ 2, ఫుట్‌బాల్ 8(కబడ్డీ 5, టేబుల్ టెన్నిస్‌లో ఒకటి మహిళలకు కేటాయించారు)

అర్హతలు: డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. అంతర్జాతీయ/ జాతీయ లేదా జూనియర్ నేషనల్ చాంపియన్‌షిప్, ఖేలో ఇండియా గేమ్స్‌లో మెడల్ విన్నర్లు అయి ఉండాలి.

ఎంపిక: షార్ట్‌లిస్టింగ్, ఫీల్డ్ ట్రయల్స్ ఆధారంగా

దరఖాస్తుకు చివరి తేదీ: మే 12

వెబ్‌సైట్: www.bankofbaroda.bank.in

దిక్సూచి

మూగజీవులపై ఆసక్తి ఉంటే సరైన ఎంపిక

వెటర్నరీ సైన్స్



మెడిసిన్ అలాగే తత్సంబంధ కోర్సుల తరవాత అత్యంత ప్రాధాన్యం కలిగినది బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హస్బెండ్రీ(బీవీఎస్సీ అండ్ ఏహెచ్).

● ఈ కోర్సు కాలవ్యవధి ఐదున్నర సంవత్సరాలు. నాలుగున్నర సంవత్సరాలు వెటర్నరీ కళాశాలలో చదువుతోపాటు ఏడాది కాలం ప్రాక్టికల్స్ ఉంటాయి. కోర్సులో భాగంగా అనాటమి, వెటర్నరీ ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ, యానిమల్ న్యూట్రిషన్, లైవ్‌స్టాక్ ప్రొడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్, వెటర్నరీ పబ్లిక్ హెల్త్, వెటర్నరీ పారాసైటాలజీ, వెటర్నరీ మైక్రో బయాలజీ, వెటర్నరీ ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ, లైవ్ స్టాక్ ప్రొడక్షన్ టెక్నాలజీ, వెటర్నరీ మెడిసిన్, వెటర్నరీ గైనకాలజీ, వెటర్నరీ సర్జరీ, వెటర్నరీ యానిమల్ హస్బెండ్రీ, ఎక్స్‌టెన్సన్, వెటర్నరీ క్లినికల్ ప్రాక్టీసు తదితర సబ్జెక్టులను చదవాలి. చివరి సంవత్సరం ఇంటర్న్‌షిప్ వెటర్నరీ హాస్పిటల్స్, ఫార్మా కంపెనీలు, డైరీ ఫారమ్‌లలో చేయాలి.

● బీవీఎస్సీ కోర్సు పూర్తి చేసినవారికి పశుసంవర్ధక శాఖలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్(వీఏఎస్)గా ఉద్యోగాలు వస్తాయి. అవేకాకుండా ప్రైవేట్ రంగంలో - ఫీడ్, ఫార్మా, పౌల్ట్రీ ఇండస్ట్రీలలో, ప్రైవేట్ ఫ్యాక్టరీలలో ఉద్యోగావకాశాలు ఉంటాయి. పోటీ పరీక్షలు అన్నీ రాయవచ్చు. భారత వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐసీఏఆర్)లో కూడా ఉద్యోగాలుంటాయి. ఆర్మీలో రిమౌంట్ వెటర్నరీ కోర్, ఇండో టిబెటిన్ బోర్డర్ ఫోర్స్‌లో ఉద్యోగాలు లభిస్తాయి.

● బీవీఎస్సీ పూర్తయిన తరవాత రెండు సంవత్సరాల ఎంవీఎస్సీ చదవవచ్చు. ఎంవీఎస్సీ పూర్తయిన తరవాత నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) పూర్తి చేసిన వారికి అసిస్టెంట్ ప్రొఫెసర్‌లుగా ఉద్యోగాలు వస్తాయి. తదుపరి పీహెచ్‌డీ కోర్సులు చేయవచ్చు. ప్రమోషన్స్ కూడా అందుకోవచ్చు.

తెలంగాణ

● రాజేంద్రనగర్(హైదరాబాద్), కోరుట్ల, మామునూరులలో వెటర్నరీ కళాశాలలున్నాయి. రాజేంద్రనగర్ వెటర్నరీ కళాశాలలో 86 సీట్లు ఉన్నాయి. వాటిలో 15 సీట్లను నీట్ ర్యాంకు ఆధారంగా వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (వీసీఐ) భర్తీ చేస్తుంది. దానికి నీట్ లో ర్యాంకు వచ్చిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మిగతా 71 సీట్లను తెలంగాణ ఈఏపీసెట్ ర్యాంకు ద్వారా భర్తీ చేసారు. కోరుట్లలో 85 సీట్లకుగాను 15 వీసీఐ భర్తీ చేస్తుంది. మామునూరు లో 44 సీట్లునూ ఈఏపీసెట్ ర్యాంకు తోనే నింపుతారు.

● ఎన్ఆర్ఐ/ ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా కింద చదువాలనుకునే విద్యార్థులకు మూడు కళాశాలలో 9 సీట్లు కేటాయిస్తారు. ఈ సీటు పొందిన విద్యార్థులు ఏటా రూ.10లక్షల చొప్పున ఫీజు చెల్లించాలి.

● సెల్ఫ్ ఫైనాన్స్ కింద ఆరు సీట్లు మాత్రమే ఉంటాయి. వీటిని పొందిన వారు కూడా కోర్సు పూర్తి చేయడానికి రూ.50లక్షలను ఫీజుగా చెల్లించాలి.



గతంలో వెటర్నరీ కోర్సును సెమిస్టర్ విధానం ప్రకారం చదివేవారు. ఇకపై దేనికదిగా అంటే మొదటి సంవత్సరం పాసైన విద్యార్థులు మాత్రమే రెండో ఏడాది కోర్సులోకి వెళ్ళేందుకు అర్హులు.

- డాక్టర్ పి జయలక్ష్మి,
కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్,
పీవీ నర్సింహ్మారావు తెలంగాణ రాష్ట్ర పశువైద్య విశ్వవిద్యాలయం

ఆంధ్రప్రదేశ్

● మా వర్సిటీకి అనుబంధంగా తిరుపతి, ప్రొద్దుటూరు, గన్నవరం, గరివిడిలో ఒకొక్కటి చొప్పున నాలుగు వెటర్నరీ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ఏపీ ఈఏపీసెట్ ర్యాంకు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన ఈ కోర్సులోకి ప్రవేశాలు నిర్వహిస్తారు. ఈఏపీసెట్ ద్వారా 85శాతం(25శాతం ఫార్మర్స్ కోటా), వీసీఐ కోటా కింద(నీట్ ర్యాంకు ఆధారంగా)15శాతం సీట్లను భర్తీ చేస్తున్నారు. కాగా ఈఏపీసెట్ ర్యాంకు ఆధారంగా ఒక్కో కళాశాలలో 70 సీట్ల చొప్పున నాలుగు కళాశాలలో 280సీట్లు, వీసీఐ కోటాలో ఒక్కో కళాశాలలో(తిరుపతి, ప్రొద్దుటూరు, గన్నవరం) 15సీట్ల చొప్పున 45సీట్లు కలిపి మొత్తం 325సీట్లు ఉన్నాయి. గరివిడి వెటర్నరీ కళాశాలకు వీసీఐ గుర్తింపు లేని కారణంగా ఈ కోటాలో ప్రవేశాలకు అనుమతి లేదు. ఈడబ్ల్యూఎస్ కింద 10శాతం సీట్లను భర్తీ చేస్తున్నారు.

● తిరుపతి, ప్రొద్దుటూరు, గన్నవరం కళాశాలలో పీజీ(ఎంవీఎస్సీ) కోర్సులు నిర్వహిస్తున్నారు. 16బ్రాంచ్‌లలో(ప్రీ క్లినికల్, పారా క్లినికల్, క్లినికల్) ఏడాదికి దాదాపుగా 40-60మంది వరకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. పీహెచ్‌డీని తిరుపతి, ప్రొద్దుటూరు కళాశాలలో మాత్రమే ఆఫర్ చేస్తున్నారు. మెడికల్, వెటర్నరీ, పర్యావరణ రంగాలు గతంలో వేర్వేరుగా పనిచేస్తుండేవి. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వన్ హెల్త్ కాన్సెప్ట్ విధానంలో భాగంగా ఈ మూడు రంగాలు ఉమ్మడిగా పనిచేసే విధంగా చర్యలు చేపట్టారు. మనుషులు, జంతువులకు పలు రకాలవ్యాధులు (మలేరియా, డెంగీ, కుక్కకాటు, లెప్టోస్పైరోసిస్, బ్రూసెల్లోసిస్ వంటివి)కామన్‌గా వస్తాయి. దీనిపై పర్యావరణ ప్రభావమూ ఉంటుంది. వెటర్నరీ, హ్యూమన్ వైద్యులు, పర్యావరణవేత్తలు అందరూ కలసి పనిచేసినప్పుడే సరైన పరిష్కారం లభిస్తుందన్నదే ఈ వన్ హెల్త్ కాన్సెప్ట్ విధానం.



- డాక్టర్ ఆర్వీ సురేష్‌కుమార్,
వెటర్నరీ సైన్స్ డీన్,
ఎస్వీవీయూ, తిరుపతి

- అప్పారెడ్డిగూడెం భీమయ్య, రాజేంద్రనగర్, హైదరాబాద్; చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతి

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'బాలన్'



'మంజుమ్మెల్ బాయ్స్' ఫేమ్ చిదంబరం దర్శకత్వంలో తెరకెక్కిన మలయాళ సినిమా 'బాలన్'ను కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించనున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, థెస్పియన్ ఫిల్మ్స్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి. ఈనెల 14న కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ బిజినెస్ వింగ్ అయిన మార్షే ఫిల్మ్‌లో 'బాలన్- ది బాయ్' స్క్రీనింగ్ జరగనుంది. ఈ సందర్భంగా మేకర్స్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. 'కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రపంచ సినిమాకు ఇళ్లు లాంటిది. ఇందులో ప్రదర్శనకు మా చిత్రం ఎంపికవడం చాలా ఆనందాన్ని ఇస్తోంది. మా చిత్రం నిజమైన మూవీ లవర్స్‌ను హత్తుకుంటుంది. 'బాలన్' సినిమా చూస్తూ ప్రేక్షకులు అనుభూతికి లోనవుతారు' అని చిత్ర దర్శకుడు చిదంబరం అన్నారు. నిర్మాతలు కె.వెంకట్ నారాయణ, శైలజా దేశాయ్ ఫెన్ మాట్లాడుతూ 'మలయాళ చిత్ర పరిశ్రమ తమ కంటెంట్‌తో ప్రపంచ సినీ ప్రియులను ఆకట్టుకుంటోంది. ప్రతి ఒక్కరూ చర్చించుకునేలా మా సినిమా ఉంటుంది. 'బాలన్' ఒక సినిమా కాదు, ఇదొక డిక్లరేషన్' అని పేర్కొన్నారు.



గోపీచంద్ యాక్షన్ చిత్రం

హీరో గోపీచంద్ 34వ చిత్రం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ ఫైట్ మాస్టర్ వి.వెంకట్ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మిస్తున్నారు. మలయాళ నటి అనార్కలి నజర్‌ను కథానాయికగా ఎంపిక చేశారు. గోపీచంద్‌ను ఇందులో పూర్తి యాక్షన్ అవతార్‌లో చూపించనున్నారు. ముహూర్తపు కార్యక్రమంలో దర్శకుడు శివ నిర్వాణ, నిర్మాత కె.ఎల్.దామోదర ప్రసాద్, 'మైత్రి మూవీ మేకర్స్' రవి శంకర్ స్క్రిప్ట్ అందజేశారు. ఫైట్ మాస్టర్స్ రామ్-లక్ష్మణ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, 'మల్లెమాల' శ్యామ్ ప్రసాద్ రెడ్డి తొలి క్లాప్ ఇచ్చారు. నిర్మాత దిల్‌రాజు ముహూర్తపు సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్‌ను త్వరలోనే ప్రారంభించనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి డీఓపీ:షామ్‌దత్, సంగీతం: సామ్ సీఎస్.





నిర్మాత బండ్ల గణేశ్ కూతురు జనని నిశ్చితార్థం ఆదివారం ఉదయం హైదరాబాద్‌లో వ్యాపారవేత్త చిలుకూరి శ్రీనివాస్ కుమారుడు సూర్య తేజతో జరిగింది. ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరి, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణతో పాటూ పలువురు రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు పాల్గొని కాబోయే దంపతులను ఆశీర్వదించారు.

అసలు ఉద్దేశం వినోదమే..



ఆయుష్మాన్ ఖురానా కథానాయకుడిగా ముదస్సర్ అజీజ్ తెరకెక్కించిన చిత్రం 'పతి పత్నీ ఔర్ వో దో'. సారా అలీఖాన్, వామికా గబ్బీ, రకుల్ ప్రీత్ సింగ్ హీరోయిన్లు. ఇందులో ఆయుష్మాన్ ఫారెస్ట్ ఆఫీసర్ ప్రజాపతి పాండే పాత్ర పోషించారు. సినిమా ఈనెల 15న విడుదలవుతోంది. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన ట్రైలర్‌లోని కొన్ని సంభాషణలు వివాదాస్పదమవడంతో ఆయుష్మాన్ ఖురానా స్పందించారు. 'ఈ చిత్రం వివాహేతర సంబంధాలను ఏ మాత్రమూ ప్రోత్సహించదు. ప్రేక్షకులకు వినోదాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ సినిమా తీశాం. ఈ చిత్రం ఒక పురుషుడి జీవితంలో ఎదురయ్యే గందరగోళాన్ని హాస్యాస్పదంగా చూపిస్తుందే తప్ప తప్పు చేయమని ప్రోత్సహించదు' అని వివరణ ఇచ్చారు.

సైకలాజికల్ థ్రిల్లర్



ఇంద్ర రామ్ ప్రధాన పాత్రలో, ప్రముఖ ఫొటోగ్రాఫర్ షామ్‌దత్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న సైకలాజికల్ థ్రిల్లర్ 'డోంట్ స్లీప్'. వి డ్రీమ్స్ ఫిల్మ్స్ బ్యానర్‌పై వి.చూడామణి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రవీంద్ర విజయ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆదివారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా మేకర్స్ రవీంద్ర విజయ్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. స్టైలిష్ లుక్‌లో రవీంద్ర విజయ్ ఆకట్టుకున్నారు. ఇంటెన్స్ వైబ్‌తో ఉన్న ఈ ఫస్ట్ లుక్ ఆయన పాత్రలో ఉన్న సస్పెన్స్, థ్రిల్ ఎలిమెంట్స్‌ను ప్రజెంట్ చేస్తోంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదల చేసిన టైటిల్, ఫస్ట్‌లుక్‌కు మంచి స్పందన వచ్చింది. ఈ చిత్రానికి గోకుల్ హర్షన్ సంగీతం అందిస్తున్నారు.

బుద్ధుడి గురించి భావితరాలకు తెలియాలి



తెలుగు దర్శకుడు సత్యారెడ్డి హాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి 'కింగ్ బుద్ధ' సినిమాలో నటిస్తూ స్వీయ నిర్మాణంలో తెరకెక్కిస్తున్నారు. ఇటీవలే నిర్వహించిన ఓ ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ 'గౌతమ బుద్ధుడు సాధారణ వ్యక్తి కాదు. శాక్య సింహమైన ఆయన జీవితం మహా వీరగాథ, ఓ శాంతి సందేశం. భావితరాలకు ఆయన చరిత్రను, తత్వాన్ని తెలియజేయడం మన బాధ్యత. అందుకే ఈ సినిమాను చేస్తున్నాను. బుద్ధ జయంతిని జాతీయ సెలవు దినంగా ప్రకటించాలి' అని చెప్పారు.

అందమైన ప్రేమకథ



భవిష్యత్తులో వర్క్ ఫ్రమ్ హోమ్ ఎలా ఉంటుందనే అంశంతో తెరకెక్కిన చిత్రం 'వర్క్ ఫ్రమ్ హోమ్'. త్రిగుణ్, పాయల్ రాధాకృష్ణ, అనీష్ కురువిల్లా ప్రధాన పాత్రధారులుగా మధుదీప్ చెలికాని దర్శకత్వంలో అరవింద్ మండ్యం నిర్మించారు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. ఈ నెల ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్లు తెలిపారు. ఇందులోని అందమైన ప్రేమకథ అందర్నీ ఆకట్టుకుంటుందని చెప్పారు. శ్రీ వెంకటసాయి ఫిల్మ్స్ బ్యానర్‌పై ముత్యాల రామదాస్ విడుదల చేస్తున్నారు.

విభిన్న కథాంశంతో...



విభిన్న తరహా కథాంశంతో కబీర్ సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక, స్నేహ సింగ్ ప్రధాన పాత్రధారులుగా రవికుమార్ సీరపు తెరకెక్కిస్తున్న చిత్రం 'ద రెడ్ బ్యాగ్'. హరికృష్ణ సోమిశెట్టి నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి కాన్సెప్ట్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఓ బ్యాగ్ చుట్టూ తిరిగే కథతో సాగే ఈ చిత్రం యాక్షన్ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటుందని తెలిపారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తైందని, త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.

సముద్రపు అలలను చూస్తే భయపడేవారు ఎందరో. కానీ, ఆ అలలనే ఆభరణాలుగా ధరించి సముద్ర గర్భంలోనే విజయాలను వెతుక్కునే సాహస నారీమణులు కొందరుంటారు. అలాంటి వారిలో ఒకరు తెలంగాణ స్విమ్మర్ గంధం క్వీనీ విక్టోరియా. క్రీడాకారిణిగా విజయాలు సాధించడమే కాదు.. తన అభిరుచిని సామాజిక బాధ్యతతో ముడిపెట్టి ఎందరికో స్ఫూర్తినిచ్చే దీపస్తంభంలా నిలుస్తున్నారు. ఇటీవల ఐదుగురు మహిళలతో కూడిన బృందానికి నాయకత్వం వహించి 'రామసేతు' (పాక్ జలసంధి) ను ఈదిన ఆమె 'నవ్య'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..





సాగర మథనం

సామాజిక సంకల్పం

'నేను, నా కొడుకు.. మేమిద్దరం ఈదుతున్నాం అని చెప్పుకోవడం కేవలం గొప్పకోసమేనా? మన చుట్టూ ఎంతోమంది ప్రతిభావంతులు సరైన అవకాశాలు లేక వెనుకబడిపోతున్నారు. వారిని మనం ఎందుకు ప్రోత్సహించకూడదు'.. ఈ ప్రశ్న నన్ను చాలా రోజులు తొలిచేసింది. ఓపెన్ వాటర్ స్విమ్మింగ్‌లో అద్భుత ప్రతిభ ఉన్న వారిని వెలుగులోకి తేవాలనే తపన నాలో మొదలైంది. అదే సమయంలో మా అమ్మాయి క్లాస్‌మేట్ అయిన 22 ఏళ్ల యువకుడు డ్రగ్స్ మత్తులో జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోవడం నన్ను కలచివేసింది. ఆ తల్లిదండ్రుల వేదనను దగ్గరగా చూశాక ఒక తల్లిగా నా గుండె తరుక్కుపోయింది. 'బిడ్డలున్న తల్లిగా ఈ సమాజానికి ఏదైనా చేయాలి' అని ఆ క్షణమే నిశ్చయించుకున్నాను. మత్తుపదార్థాల మహమ్మారిపై అవగాహన కల్పించడానికి, నా ప్రాణమైన స్విమ్మింగ్‌నే ఆయుధంగా ఎంచుకున్నాను. నాలాంటి తల్లులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి మా ద్వారా ఈ సందేశాన్ని బలంగా వినిపించాలనుకున్నాను. అలా శ్రీలంకలోని తలైమన్నార్ నుంచి మన ధనుష్కోడి వరకు సాగర యాత్రకు అంకురార్పణ చేశాను.

బృంద నిర్మాణం.. ఆటంకాలు

ఒక మంచి లక్ష్యం కోసం భయమంటే తెలియని మహిళా స్విమ్మర్లను వెతకడం ఎంత కష్టమో అప్పుడే నాకు తెలిసొచ్చింది. ఈత వచ్చినవారు లక్షల్లో ఉంటారు. కానీ, అల్లకల్లోలంగా ఉండే సముద్రంలో ఈదగల ధైర్యవంతులు కావాలి. ఆరు నెలలపాటు దేశమంతా తిరిగాను. ఢిల్లీ, విజయవాడ, పుణె, కర్ణాటక.. ఇలా ఎన్నో చోట్ల ఓపెన్ వాటర్ స్విమ్మర్లను కలిశాను. ఎన్నో తిరస్కరణలు, అడ్డంకులు ఎదుర్కొన్న తర్వాత చివరికి ఆరుగురితో ఒక బృందాన్ని సిద్ధం చేయగలిగాను. మా బృందంలో నాతోపాటు పుణె నుంచి స్మిత, తెలంగాణ నుంచి మౌనిక, ఢిల్లీ నుంచి ఆర్తి, విజయవాడ నుంచి రాధిక, రజని ఉన్నారు. అంతా సిద్ధమై భారత్, శ్రీలంక ఎంబసీల నుంచి అనుమతులు కూడా వచ్చాక యాత్రకు కేవలం మూడు రోజుల ముందు ఊహించని షాక్ తగిలింది. రజని తనవల్ల కాదని చెప్పింది. ఆరుగురి పేర్లపై అనుమతులు రావడంతో కొత్తవారిని చేర్చుకునే అవకాశం లేకుండా పోయింది. ఆరుగురి కోసం వేసుకున్న ప్రణాళికను ఐదుగురితో పూర్తిచేయాల్సి రావడంతో మా అందరిపైనా మానసికంగా, శారీరకంగా పెనుభారం పడింది. ప్రతి ఒక్కరి విశ్రాంతి సమయం తగ్గిపోయింది. అయినా ఒక నాయకురాలిగా నా బృందంలో ధైర్యం నింపి, ముందుకు నడిపించాల్సిన బాధ్యత నాపై ఉందని దృఢంగా నిశ్చయించుకున్నాను.

అలలపై సాహస యాత్ర

ఏప్రిల్ 25న అర్ధరాత్రి దాటాక 2 గంటలకు శ్రీలంకలోని తలైమన్నార్ తీరంలో చిమ్మచీకటిని చీల్చుకుంటూ మా యాత్ర మొదలైంది. ఎగసిపడే అలల మధ్య, ఒకరి తర్వాత ఒకరు గంట చొప్పున ఈదుతూ ముందుకు సాగాం. సముద్రంలో ఉండే జెల్లీ ఫిష్‌ల నుంచి రక్షణ కోసం అమెరికా నుంచి ప్రత్యేకమైన క్రీములు తెప్పించుకున్నాం. సాధారణంగా స్విమ్మర్లకు రాత్రిపూట చిన్న లైట్లు ఇస్తారు. కానీ జెల్లీఫిష్‌లను ఆ కాంతి ఆకర్షిస్తుందని లైట్లు లేకుండానే ఈదాల్సి వచ్చింది. మా వెంట వచ్చే మదర్‌బోట్ వెలుగులే మాకు దారి చూపాయి. ఈ యాత్రలో నా బృంద సభ్యులు అద్భుతమైన పట్టుదల చూపారు. ముఖ్యంగా మౌనిక, ఆర్తి తమ వేగంతో ఎక్కువ దూరం కవర్ చేసి మాకు అండగా నిలిచారు. బృందంలో పెద్దవారైన 52 ఏళ్ల స్మిత ఆరోగ్య సమస్యలు ఉన్నా వెనకడుగు వేయలేదు. 49 కిలోమీటర్ల ఈ సుదీర్ఘ యాత్రను 10 గంటల 10 నిమిషాల్లోనే పూర్తిచేసి ఏప్రిల్ 26న మధ్యాహ్నం ధనుష్కోడి తీరాన్ని చేరుకున్నాం. భారత జలాల్లోకి అడుగుపెట్టగానే ఇండియన్ నేవీ, కోస్ట్‌గార్డ్ అధికారులు మాకు స్వాగతం పలికిన క్షణం నా జీవితంలో మర్చిపోలేను. బెంగళూరుకు చెందిన సతీశ్ 'స్విమ్ లైఫ్' ఆర్గనైజేషన్ ద్వారా నాకు ఓపెన్ వాటర్ స్విమ్మింగ్‌లో అవకాశం వచ్చింది. ఇప్పుడు ఆయన పర్యవేక్షణలోనే ఈ సాహసయాత్రను పూర్తిచేశాం. అలాగే 'యూనిఫై' సంస్థ స్పాన్సర్‌షిప్ లేకపోతే ఈ యాత్ర సాధ్యమయ్యేది కాదు.

గుర్తింపు కోసం..

ఓపెన్ వాటర్ స్విమ్మింగ్ ప్రాణాలతో చేసే సాహసం. ఎవరెస్ట్ ఎక్కిన వారికి లభించే గుర్తింపు.. సముద్రాలను జయించే మాకు ఎందుకు లభించడం లేదనేది నా ఆవేదన. ప్రభుత్వం నుంచి చేయూత లభిస్తే మిగిలిపోయిన నాలుగు సముద్రాలను కూడా ఈది భారత కీర్తి పతాకాన్ని సగర్వంగా ఎగరేస్తాను. ప్రస్తుతం ఎల్బీ స్టేడియంలో సంతోష్ చారి వద్ద శిక్షణ పొందుతున్నాను. నా తదుపరి లక్ష్యం నా కుమార్తె, కొడుకుతో కలిసి సముద్రం ఈది తల్లి, కొడుకు, కూతురు కలిసి ఈదిన తొలి కుటుంబంగా ప్రపంచ రికార్డు సృష్టించడం. నా ప్రయాణంలో మావారు అనిల్ కుమార్ సహా ఎంతోమంది అండగా నిలిచారు. వారందరికీ కృతజ్ఞతలు. పట్టుదల ఉంటే వయసు, విమర్శలు, ఆర్థిక ఇబ్బందులు ఏవీ మనల్ని ఆపలేవని నిరూపించడమే నా లక్ష్యం. మరిన్ని విజయాలతో దేశానికి గర్వకారణంగా నిలవాలన్నదే నా ఆశ, ఆశయం.

• గురులింగాచారి

విమర్శలే విజయానికి సోపానం



నిజానికి నా ఈ ప్రస్థానం 2018లో నా పిల్లల వల్లే మొదలైంది. ఫ్యాషన్ డిజైనర్‌గా బర్కత్‌పురలో 'క్వీన్స్ ఫ్యాషన్ స్టూడియో' నడుపుతున్న నేను.. నా పిల్లలు ఎలిజబెత్ క్వీన్, స్టీఫెన్ కుమార్‌ను చూసి స్ఫూర్తి పొందాను. నేను కూడా పోటీల్లో పాల్గొనడం మొదలుపెట్టాను. వారిద్దరూ నేషనల్ స్విమ్మర్లు. ప్రపంచంలో అత్యంత కఠినమైన ఏడు సముద్రాల్లో మూడింటిని (ఇంగ్లిష్ చానల్, కాటలినా చానల్, కుక్ జలసంధి) ఈదాను. కుక్ స్ట్రెయిట్‌ను ఈదిన తొలి దక్షిణ భారత మహిళగా రికార్డు సృష్టించాను. నా కొడుకు స్టీఫెన్‌తో కలిసి ఈదాను. ప్రపంచంలో తల్లితో కలిసి సముద్రాలు ఈదిన మొట్టమొదటి కొడుకుగా స్టీఫెన్ రికార్డులకెక్కాడు. ఇన్ని విజయాలు సాధిస్తున్నా, ఎన్నో విమర్శలు నన్ను వెంటాడాయి. 'ఆమె ఇంగ్లిష్ చానల్ ఈదలేదు.. దేశం పరువు తీస్తుంది' అని కొందరు, 'ఆమె తెలంగాణ స్విమ్మర్ కాదు' అని మరికొందరు అన్నప్పుడు బాధ కలిగినా , ఆ విమర్శలనే నా విజయానికి సోపానాలుగా మార్చుకున్నాను.



అది లవ్ బాంబింగ్ కావచ్చు

పరిచయమైంది మొదలు అనుక్షణం పలకరిస్తూ, ప్రశంసలు కురిపిస్తూ, అదే పనిగా శ్రద్ధ కనబరుస్తూ, ఉక్కిరిబిక్కిరి చేయడం... స్వచ్ఛమైన ప్రేమ కాకపోవచ్చు. ఈ తరహా ప్రవర్తనకు 'లవ్ బాంబింగ్' అనే పేరు కూడా ఉంది. దీనికీ, స్వచ్ఛమైన ప్రేమకూ తేడా తెలుసుకోవడం అవసరం.

'కన్నా... ఏదైనా తిన్నావా, లేదా?'... 'అయ్యో, తల నొప్పిగా ఉందా, వచ్చి తల పట్టనా?'... ఈ తరహా మాటలు ఎంతటి వాళ్లనైనా బోల్తా కొట్టిస్తాయి. అకస్మాత్తుగా అందే ఆపేక్షల ఒరవడిలో కొట్టుకుపోయేలా చేస్తాయి. అయితే ఈ ఆప్యాయతలు, అనురాగాల వెనకున్న అసలు ఉద్దేశం ఏంటో తెలుసుకోవాలి. మరీ ముఖ్యంగా పరిచయమైన కొద్ది రోజుల వ్యవధిలోనే అంతు లేని ప్రేమను కురిపించే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలి. నమ్మశక్యం కాని పనులతో, పొగడ్తలతో దగ్గరయ్యే ప్రయత్నం చేయడం, బంధాన్ని బలపరుచుకునే ప్రయత్నం చేయడం, ఆప్యాయత ముసుగులో మోసపూరితమైన ప్రేమను కనబరచడం 'లవ్ బాంబింగ్' ప్రధాన లక్షణం. కాబట్టి లవ్ బాంబింగ్‌కూ, స్వచ్ఛమైన ప్రేమకూ వ్యత్యాసాన్ని అర్థం చేసుకుని, ఆరోగ్యకరమైన, సంతులనమైన అనుబంధానికి ప్రాధాన్యమివ్వాలి.

అసలైన ప్రేమ అది కాదు

స్వచ్ఛమైన ప్రేమను కోరుకోని వారుండరు. అలాంటి ప్రేమ కోసం కలలు కనే క్రమంలో లవ్ బాంబింగ్‌నే స్వచ్ఛమైన ప్రేమగా భ్రమపడే ప్రమాదం లేకపోలేదు. కొన్ని రోజుల క్రితమే పరిచయమైన ఒక అపరిచిత వ్యక్తి, మెసేజీలు, బహుమతులు, ప్రమాణాలతో ఊపిరాడనివ్వకుండా చేస్తున్నప్పుడు, విచక్షణ మరిచి, ఆ ఒరవడిలో కొట్టుకుపోవడం సహజమే! అయితే ఈ తరహా లవ్ బాంబింగ్ ప్రేమకు కాదు, నియంత్రణకు సంకేతం. ఇలాంటి విపరీతమైన ఆప్యాయత లక్ష్యం, ఎదుటి వ్యక్తి భావోద్వేగాల మీద ఆధిపత్యం సాధించడమే! మన మీద ఆ భావోద్వేగ నియంత్రణ సాధించిన తర్వాత, సదరు వ్యక్తి తన పూర్వ ప్రవర్తనను మార్చుకోవచ్చు. శ్రద్ధను తగ్గించేయవచ్చు. ఫలితంగా ఆ బంధం అయోమయానికి లోను చేయవచ్చు, కుంగుబాటుకు కూడా గురి చేయొచ్చు. కాబట్టి అసలైన ప్రేమకూ, లవ్ బాంబింగ్‌కూ తేడాను తెలుసుకోవాలి. అసలైన ప్రేమలో దూకుడుతనం ఉండదు. కాలంతో పాటు క్రమేపీ పెరుగుతుంది. పరస్పర గౌరవం, హద్దుల ఆధారంగా స్థిరంగా, బలపడుతుంది. మనల్ని నిజంగా ప్రేమించే వ్యక్తులు, మనల్ని భయాలకూ, అనుమానాలు, ఆందోళనలకు గురి కానివ్వరు. బదులుగా మనకు అవసరమైనంత, తగినంత దూరం పాటిస్తూ, తక్కువ మాట్లాడుతూ, ఎక్కువ వింటూ అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తారు. కాలం గడిచేకొద్దీ వాళ్ల మాటలు, చేతలు సరిపోలడం మొదలుపెడతాయి. నిజానికి అసలైన ప్రేమ, భేదాలను, ప్రత్యేకతలను స్వాగతిస్తుంది. ప్రేమంటే నిరంతర శ్రద్ధ కాదు. హద్దులు విధించినంత మాత్రాన మనల్ని అపరాధ భావానికి లోను చేయదు.



అసలు ఉద్దేశం కనిపెట్టి...

లవ్ బాంబింగ్, అసలైన ప్రేమకు మధ్య తేడాను కనిపెట్టడం కోసం, అసలు ఉద్దేశాన్ని గ్రహించే ప్రయత్నం చేయాలి. లవ్ బాంబింగ్‌కు పాల్పడే వ్యక్తులు తరచూ అనవసరపు పొగడ్తలతో ఉక్కిరిబిక్కిరి చేస్తూ ఉంటారు. మన ప్రమేయంతో, అభిప్రాయంతో సంబంధం లేకుండా దూకుడుతో కూడిన నిర్ణయాలు తీసుకుంటూ ఉంటారు. పరిచయమైన తొలినాళ్లలోనే ప్రేమిస్తున్నానంటూ ప్రపోజ్ చేసేస్తూ ఉంటారు. మనదైన ఏకాంత సమయం గడపడాన్ని ఇష్టపడరు. అలా ఎందుకని ఎదురు ప్రశ్నించడాన్ని కూడా ఇష్టపడరు. కానీ అసలైన ప్రేమ మన సమయాన్ని ఆక్రమించదు. స్వేచ్ఛను హరించదు. మనస్ఫూర్తిగా మనల్ని ప్రేమించే వ్యక్తులు, మన గురించి పూర్తిగా తెలుసుకోవాలనుకుంటారు కానీ, మనల్ని తన సొత్తు చేసుకోవాలనుకోరు. పరిస్థితులు ప్రతికూలించినా వాళ్ల ప్రేమ దృఢంగానే ఉంటుంది. మనల్ని శిక్షించడం కోసం కనబరిచే ఆప్యాయతలో కోత విధించరు. కాబట్టి కొత్తగా పొందే ఆదరణ, ఆప్యాయతలు లవ్ బాంబింగ్ కాదని నిర్ధారించుకోవడం కోసం కొన్ని సంకేతాల మీద దృష్టి పెట్టాలి. ఒకరి ఆప్యాయత ఊపిరాడనివ్వకుండా చేస్తున్నా, తెలియని భయాందోళనలకు లోను చేస్తున్నా, మన సమయాన్నంతా హరిస్తున్నా, అనవసరంగా అపరాధ భావానికీ, ఆత్మన్యూనతకూ లోను చేస్తున్నా, ఒక్క క్షణం ఆగి ఆ బంధాన్ని విశ్లేషించుకోవాలి. లవ్ బాంబింగ్ అని తేలితే, మరుక్షణమే ఆ బంధాన్ని తెగతెంపులు చేసుకోవాలి. ఇది మన ఎదుగుదలకూ, మానసిక ఆరోగ్యానికీ అవసరం.


మట్టికుండ నీరు మరింత చల్లగా..



వేసవిలో చాలామంది ఫ్రిజ్ నీళ్ల కంటే మట్టికుండ నీటికే ప్రాధాన్యం ఇస్తారు. ఎండలు మరీ ఎక్కువగా ఉన్నప్పుడు కుండలోని నీరు ఆశించినంత చల్లగా ఉండదు. అలాంటప్పుడు ఈ చిన్న సైంటిఫిక్ చిట్కాను పాటించి చూడండి.

- ఒక వెడల్పాటి పళ్లెంలో లేదా గంపలో ఇసుకను పోయండి. ఆ ఇసుకను నీటితో బాగా తడిపి దానిపై కుండను ఉంచండి. ఇసుకలోని తేమ కుండలోని వేడిని త్వరగా గ్రహించి నీటిని సహజంగా చల్లబరుస్తుంది.
- కుండచుట్టూ ఒక పాత గోనెసంచి కానీ, మందపాటి కాటన్ వస్త్రాన్ని కానీ చుట్టి, దానిని ఎప్పుడూ తడిగా ఉంచండి. బయటి గాలి ఆ తడి వస్త్రానికి తగిలినప్పుడు బాష్పీభవనం ప్రక్రియ జరిగి కుండ లోపలి ఉష్ణోగ్రత బాగా తగ్గుతుంది.
- నీరు మరింత రిఫ్రెషింగ్‌గా ఉండాలంటే కుండలో కొన్ని పుదీనా ఆకులను కానీ వేయండి. ఇది సహజ సిద్ధమైన ఫ్లేవర్‌ను ఇస్తుంది.

ఎండుద్రాక్షతో రక్తహీనత దూరం



నల్లని ఎండు ద్రాక్ష నీళ్లు కూడా ఔషధంలా పని చేస్తాయని మీకు తెలుసా! ఈ నీటిలో ఐరన్, విటమిన్ బి పుష్కలం. ఇవి రక్తహీనతను దూరం పెడతాయి. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు, పొటాషియం రక్తపోటును నియంత్రిస్తాయి. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. ఫలితంగా గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఫైబర్ అజీర్తి సమస్యలను తగ్గిస్తుంది. ఈ నీళ్లలోని విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌ను తటస్థీకరించి చర్మ సమస్యలను దరి చేరనీయవు. పది నుంచి పదిహేను నల్ల ఎండు ద్రాక్షలను గ్లాసుడు నీళ్లలో వేసి రాత్రంతా నానబెట్టాలి. పరగడుపున ఆ నీటిని తాగాలి.

పెరుగు పులవకుండా

ఎండలు మండిపోయే ఈ వేసవిలో పెరుగు చేసే మేలు అంతా ఇంతా కాదు. అయితే, ఈ సమ్మర్‌లో వేధించే ప్రధాన సమస్య పెరుగు త్వరగా పులిసిపోవడం. పెరుగు ఎప్పుడూ తీయగా ఉండాలంటే ఈ చిట్కాలు పాటించండి.



- పెరుగు తోడుకోవడానికి పాలవేడి చాలా ముఖ్యం. వేసవిలో వాతావరణం వేడిగా ఉంటుంది కాబట్టి పాలను మరీ ఎక్కువగా వేడి చేయకూడదు. గోరువెచ్చని పాలలో తోడు వేయాలి. పాలు మరీ వేడిగా ఉంటే పెరుగు నీళ్లలా మారిపోతుంది. చల్లగా ఉంటే తోడుకోదు.
- పెరుగు తోడుకున్న వెంటనే అందులో చిన్న పచ్చి కొబ్బరి ముక్క వేయండి. ఇలా చేస్తే రెండుమూడు రోజుల వరకు పెరుగు పులవకుండా తాజాగా ఉంటుంది.
- స్టీలు గిన్నెల కంటే మట్టిపాత్రలోని పెరుగు త్వరగా పులిసిపోదు. మట్టిపాత్రలో ఉండే సూక్ష్మ రంధ్రాలు పెరుగులోని అదనపు తేమను పీల్చుకుని తాజాగా ఉంచుతుంది.
- ఒక్కోసారి తోడు దొరకనప్పుడు గోరువెచ్చని పాలలో రెండు ఎండుమిరపకాయలు తొడిమలు సహా వేయండి. మిర్చిలోని ఎంజైములు పాలను పెరుగ్గా మారుస్తాయి.
- పెరుగు తోడుకున్న వెంటనే దానిని బయట ఉంచకుండా ఫ్రిజ్‌లో పెట్టాలి. బయట ఉంటే గాలిలోని వేడికి కిణ్వ ప్రక్రియ వేగవంతమై త్వరగా పులిసిపోతుంది.
- పెరుగుపైన తేరుకున్న నీటిని ఎప్పటికప్పుడు తీసేస్తూ ఉంటే కూడా పెరుగు త్వరగా పులిసిపోకుండా ఉంటుంది.

నేచురల్ డియోడరెంట్



చెమట వల్ల వచ్చే దుర్వాసన పదిమందిలో ఉన్నప్పుడు మనల్ని ఇబ్బంది పెడుతుంది. పెర్ఫ్యూమ్స్, డియోడరెంట్లతో కాకుండా వంటింట్లోని పదార్థాలతో ఆ వాసనను ఎలా పోగొట్టుకోవచ్చో చూద్దాం.

- నిమ్మకాయ పిండిన నీటితో స్నానం చేయండి. నిమ్మలోని సిట్రిక్ యాసిడ్ చెమట వల్ల వచ్చే బ్యాక్టీరియాను చంపేస్తుంది. దీనివల్ల రోజంతా తాజాగా ఉంటుంది.
- చెమట వాసనను పీల్చుకోవడంలో బేకింగ్ సోడాకు మించింది లేదు. కొంచెం బేకింగ్ సోడాలో నీళ్లు కలిపి పేస్ట్‌లా చేసి చంకల్లో రాసుకుని, ఆరిన తర్వాత కడిగేయండి. ఇది బ్యాక్టీరియాను చేరనివ్వదు.
- వేసవిలో వచ్చే చెమటకాయలు, దురదలు తగ్గాలంటే వేప ఆకులను నీటిలో మరిగించి ఆ నీటిని స్నానం చేసే నీటిలో కలుపుకోవాలి. ఇది సహజ సిద్ధమైన యాంటీసెప్టిక్‌లా పనిచేస్తుంది.
- రాత్రి పడుకునే ముందు చందనం పొడిలో కొంచెం రోజ్‌వాటర్ కలిపి రాసుకుంటే శరీరానికి చలువ చేయడమే కాకుండా, మరుసటి రోజు కూడా శరీరం నుంచి మంచి సువాసన వస్తుంది.

అనుభవాలకు దృశ్య రూపం

అథ్లెట్, రచయిత్రి, నటి, స్టాండప్ కమెడియన్, మోటివేషనల్ స్పీకర్... ఏ రంగంలోనైనా అనూ వైద్యనాథన్‌ది తనదైన ముద్ర. కిందటి వారం మెక్సికోలోని చలనచిత్రోత్సవంలో ప్రదర్శితమైన ఆమె తొలి డాక్యుమెంటరీ 'డిస్పాచ్' ప్రేక్షకుల్ని ముగ్ధుల్ని చేసింది. ఆసక్తి, అంకితభావం ఉంటే ఎన్ని బాధ్యతలు నిర్వర్తించినా అలసట ఉండదంటున్న అనూ తన ప్రయాణం గురించి ఏం చెబుతున్నారంటే...

"సరిగ్గా నెల రోజుల క్రితం... నేను రూపొందించిన 'డిస్పాచ్' డాక్యుమెంటరీ అప్పుడే సిద్ధమయింది. నేను, నా బృందం ఆ ప్రాజెక్ట్ కోసం ఎంతో శ్రమపడ్డాం. మా కృషి, అది అందించే ఫలితం విషయంలో నాకు ఏమాత్రం సందేహం లేదు. అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో.... 'బ్యూనస్ ఎయిర్స్ ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ ఇండిపెండెంట్ సినిమా' (బిఎఎఫ్ఐసిఐ)లో ఏప్రిల్ 18న జరిగిన తొలి ప్రదర్శన (వరల్డ్ ప్రీమియర్) ప్రశంసలు అందుకుంది. ఆ తరువాత 'మెక్సికో ఫిలిమ్ ఫెస్టివల్‌లో ఏప్రిల్ 27, 28 తేదీల్లో వరుసగా ప్రదర్శితమైన 'డిస్పాచ్'కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. అవి నాకు అపురూపమైన క్షణాలు. ఎందుకంటే... 'డిస్పాచ్' నా కుటుంబానికి చెందిన సంఘటనలకు దృశ్య రూపం. కొత్త రంగాల్లోకి అడుగుపెట్టడం నాకు కొత్తేం కాదు. నా జీవితంలో ముందుగా ఊహించనివి ఎన్నో జరిగాయి. వాటిలో ఇదొకటి.



ఆసియాలో తొలి మహిళగా...

నేను ఢిల్లీలో పుట్టాను. బెంగళూరులో పెరిగాను. మాది చాలా పెద్ద కుటుంబం. కులం, మతాలకు అతీతంగా జరిగిన వివాహాల వల్ల పలు భాషలు, సంప్రదాయాల వారు మా కుటుంబంలో భాగమయ్యారు. దేశవ్యాప్తంగా బంధువులు ఉండడంతో భిన్నమైన జీవన, ఆలోచనా విధానాలను ఆకళింపు చేసుకొనే అవకాశం నాకు బాల్యంలోనే దొరికింది. చదువులో ఎప్పుడూ చురుగ్గా ఉండేదాన్ని. బెంగళూరులో ఇంజనీరింగ్ చేసి, పిహెచ్‌డి కోసం అమెరికా వెళ్లాను. అప్పుడే క్రీడలపై నా దృష్టి పడింది. రన్నింగ్, స్విమ్మింగ్ సాధన చేశాను. 2008లో 'హాఫ్ ఐరన్ మ్యాన్-73... క్లియర్ వాటర్ వరల్డ్ ఛాంపియన్‌షిప్'కు అర్హత సాధించిన తొలి భారతీయురాలిని నేనే. అలాగే 2009లో 'అల్ట్రా మ్యాన్ కెనడా' (ట్రయథ్లాన్)లో పాల్గొని, విజయవంతంగా పూర్తి చేసిన తొలి ఆసియా మహిళగా నిలిచాను. అనంతరం అమెరికాలో ఆపేసిన పిహెచ్‌డిని న్యూజిలాండ్‌లో పూర్తి చేశాను. సొంతంగా ఒక కన్సల్టెన్సీ సంస్థను ప్రారంభించాను. అయితే అంతర్జాతీయ స్థాయిలో జరిగే ఆ క్రీడల్లో పాల్గొనడానికి తగిన స్థోమత, మద్దతు లేకపోవడంతో విరామం ఇచ్చాను. క్రీడాకారిణిగా నా అనుభవాల్ని 'ఎనీవేర్ బట్ హోమ్' అనే పేరుతో పుస్తకం రాశాను. దానికి మంచి ఆదరణే దక్కింది. ఆ తరువాత పెళ్ళయింది. లండన్‌లో నివాసం. వృత్తి పనులు, ఇంటి పనులు పిల్లల పెంపకంతో బిజీ అయిపోయాను. కానీ కొవిడ్ అందరి లాగే నా జీవితంలోనూ ఊహించని మార్పు తెచ్చింది.

నాలుగు వారాలు హౌస్‌ఫుల్


ప్రస్తుత యుగంలో ప్రతి ఒక్కరూ తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. కొవిడ్ కారణంగా అది ఇంకా పెరిగింది. వినోదం, హాస్యం, మిత్రులతో, బావసారూప్యత ఉన్నవారితో గడపడం లాంటివి ఒత్తిడిని తగ్గిస్తాయి. అలాంటి వినోదాన్ని సమాజానికి అందివ్వాలనుకున్నాను. నా పిల్లలతో నాకున్న అనుభవాలతో 'బిఫోర్ చిల్డ్రన్: ఆఫ్టర్ డైపర్స్' అనే స్టాండప్ కామెడీ షో తయారు చేసి, ఇడిన్‌బర్గ్‌లో ప్రదర్శించాను. దానికి వచ్చిన స్పందన నేపథ్యంలో... అదే వేదిక మీద వరుసగా నాలుగు వారాలపాటు టిక్కెట్లపై ప్రదర్శన కొనసాగించాను. అరవై సీట్ల ఆ హాల్ ప్రతి రోజూ నిండిపోయింది. ఆ తరువాత న్యూయార్క్‌లో ప్రదర్శన ఇచ్చినప్పుడు ఇంగ్లీష్ నటుడు, రచయిత వాల్టర్ బ్రిడ్జ్ దాన్ని మెచ్చుకున్నారు. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శనలు ఇస్తున్నాను. రంగస్థలం మీద పాత్రలు పోషించాను. కొత్త స్టాండప్ షోలను తయారు చేసి, ప్రేక్షకులకు వినోదం అందిస్తున్నాను. వాటిలో కొన్నిటితో లఘు చిత్రాలను కూడా రూపొందించాను. రోజువారీగా మనకు ఎదురయ్యే సంఘటనలే ఈ షోల్లో ప్రధానాంశాలు. ఈ గుర్తింపు నేపథ్యంలో వివిధ సంస్థల ఆహ్వానం మేరకు మోటివేషనల్ స్పీకర్‌గానూ వ్యవహరిస్తున్నాను. 2003లో 'సన్ డ్యాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్'కు వెళ్ళినప్పుడు ఒక ఆఫ్రికన్-అమెరికన్ చిత్ర నిర్మాతను కలిశాను. ఆమె తన తొలి ఫీచర్ ఫిల్మ్‌ను తక్కువ ఖర్చుతో, ఎవరి సాయం లేకుండా ఎలా నిర్మించారో నాకు చెప్పారు. కానీ షార్ట్ ఫిల్మ్‌లు తప్ప... సినిమానో, డాక్యుమెంటరీయో తీయాలనే ఆలోచన అప్పటికి నాకు లేదు.

రెండు తరాల కథ...

2024లో నాకు ఎంతో ఇష్టమైన మా అత్తగారు మరణించారు. దేశ విభజన సమయంలో ఆమె భారత్‌కు వచ్చేశారు. నేను చూసిన గొప్ప వ్యక్తుల్లో ఆమె ఒకరు. వీటన్నిటికన్నా కుటుంబం, ప్రాంతం, సంస్కృతి పరంగా... ఒక మహిళగా ఆమె ఎదుర్కొన్న అనుభవాలు ఎన్నో ఉన్నాయి. వంట గదిలో, షాపింగ్ చేస్తున్నప్పుడు, పర్యటనలకు వెళ్ళినప్పుడు మేము పంచుకున్న కబుర్లు, కష్టాలు, ఇబ్బందులు... ఇవన్నీ ఆమె మరణించిన తరువాత నాకు పదే పదే గుర్తుకు వచ్చేవి. వాటన్నిటితో ఒక డాక్యుమెంటరీ తీయాలనిపించింది. నేనే నిర్మాతగా, దర్శకురాలిగా 'డిస్పాచ్'ను ప్రారంభించాను. 2025 వేసవిలో... మండుటెండల మధ్య మన దేశంలోని వివిధ గ్రామీణ ప్రాంతాల్లో చిత్రీకరించాను. రెండు తరాల మహిళల జీవితానుభవాలకు, భావోద్వేగాలకు, సాధికారత సాధించే క్రమంలో చేసిన పోరాటానికి దృశ్య రూపం ఈ డాక్యుమెంటరీ. అది అభినందనలకు పాత్రమవుతున్నందుకు ఆనందంగా ఉంది. ప్రపంచంలోని వివిధ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో దాన్ని ప్రదర్శించడానికి ప్రయత్నిస్తున్నాను. ఈ ఉత్సాహం మరిన్ని చిత్రాల రూపకల్పన వైపు నన్ను నడిపిస్తుందనుకుంటున్నాను. అయితే... ఈలోగా మరో కొత్త రంగం నన్ను ఆకర్షిస్తే... అటువైపు అడుగులు వేయడానికి ఏమాత్రం సందేహించను."



'ఆటో' లాభాలకు రూ.25,000 కోట్ల గండి



పర్యావరణ పరిరక్షణ నిబంధనలే కారణం

న్యూఢిల్లీ: గడచిన ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఆటోమొబైల్ కంపెనీల లాభాలకు రూ.25,000 కోట్ల మేర గండి పడే అవకాశం ఉందని భారత ఆటోమొబైల్ పరిశ్రమ ఆందోళన వెలిబుచ్చింది. పర్యావరణ పరిరక్షణ (ఎండ్ ఆఫ్ లైఫ్ వెహికల్స్)-2025 నిబంధనల అమలు కంపెనీల లాభాలపై ప్రభావం చూపించనుందని పరిశ్రమ వర్గాలంటున్నాయి. ఆటోమొబైల్ కంపెనీలు గతంలో విక్రయించిన వాహనాలకు పర్యావరణ పరిహారం (ఎన్విరాన్‌మెంటల్ కాంపెన్సేషన్) కింద భారతీయ అకౌంటింగ్ ప్రమాణాలకు అనుగుణంగా కేటాయింపులు చేయాలని ఈ నిబంధన స్పష్టం చేస్తోందని, ఇది ఆటోమొబైల్ కంపెనీల పనితీరుపై ప్రభావం చూపించనుందని పరిశ్రమ నిపుణులు వెల్లడించారు. 2025 జనవరిలో పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఎండ్ ఆఫ్ లైఫ్ వెహికల్ నిబంధనలను నోటిఫై చేసిందని వారు తెలిపారు. అంతేకాకుండా ఆటోమొబైల్ కంపెనీ సంబంధిత ఉత్పత్తిదారు నిర్వచనంలోకి వచ్చే వరకు మార్కెట్లో ఉన్న వాహనాలకు 'ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబిలిటీ (ఈపీఆర్)' నిబంధనలకు కట్టుబడి ఉండాలని దీనిని స్పష్టం చేస్తోంది. గతంలో కంపెనీలు విక్రయించిన అన్ని వాహనాలకు అంటే 15 ఏళ్ల ప్రైవేట్ వాహనాలు, 20 ఏళ్ల వాణిజ్య వాహనాలకు సంబంధించి ఈపీఆర్ సర్టిఫికెట్ల కోసం ఆటోమొబైల్ తయారీదారులు ఆర్థిక కేటాయింపులు చేపట్టాల్సి ఉంటుందని పరిశ్రమకు చెందిన ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఈ నిబంధన కంపెనీల నిధులను బ్లాక్ చేయటంతో పాటు లాభాలపై తీవ్ర ప్రభావం చూపించనుందన్నారు. ప్రస్తుత ప్రాథమిక అంచనాల ప్రకారం 2025-26 ఆర్థిక సంవత్సరానికి స్థూల ప్రాతిపదికన పరిశ్రమపై ఒకసారి రూ.25,000 కోట్ల వరకు ప్రభావం పడనుందని పేర్కొన్నారు. ఇందులో రూ.14,623 కోట్లు కార్ల తయారీ కంపెనీలదిగా ఉండగా ద్విచక్ర వాహన కంపెనీలకు సంబంధించిన మొత్తం రూ.9,650 కోట్ల వరకు ఉండొచ్చని పరిశ్రమ వర్గాలంటున్నాయి. ఇప్పటికే ఈ విషయాన్ని భారతీయ ఆటోమొబైల్ పరిశ్రమ సమాఖ్య (సియామ్).. మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకువెళ్లిందన్నారు. అయితే ఈ నిబంధనలకు సంబంధించి ఇప్పటి వరకు మంత్రిత్వ శాఖ స్పష్టతనివ్వలేదని తెలిపారు. ఈ నిబంధనల్లో మార్పులు చేయకపోతే ఆటోమొబైల్ తయారీదారుల సామర్థ్యంపై ప్రభావం పడటమే కాకుండా కొత్త టెక్నాలజీలపై పెట్టుబడులు తగ్గిపోవటం సహా భవిష్యత్ ప్రణాళికలపై ప్రభావం పడనుందని పరిశ్రమ ప్రతినిధి ఒకరు తెలిపారు.

ఐటీ వ్యయాలు పెంచేందుకు బ్యాంకుల సన్నాహాలు

● సైబర్ ముప్పుల నేపథ్యంలో చర్యలు

న్యూఢిల్లీ: ఖాతాదారుల డేటా, ప్రవ్యవస్థను ఆంతాలను మరింత రక్షణ కల్పించేందుకు ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ).. ఐటీ వ్యయాలు భారీగా పెంచేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. ఆంథ్రోపిక్‌కు చెందిన క్లాడ్ మైథోస్ ఏఐ టూల్‌తో ఫైనాన్షియల్ డేటా, సెక్యూరిటీపై తీవ్ర ప్రభావం పడనుందన్న ఆందోళనతో బ్యాంకులు తమ నెట్‌వర్క్ సిస్టమ్స్‌ను మరింత బలోపేతం చేయాలని భావిస్తున్నాయి. ఇందుకనుగుణంగానే ఐటీ వ్యయాలు పెంచాలని నిర్ణయించాయి. ఆంథ్రోపిక్ మైథోస్ నేపథ్యంలో బ్యాంకులు తమ రక్షణ వ్యవస్థలను మరింత పటిష్ఠం చేసుకోవాలని ఇప్పటికే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. ప్రస్తుతం బ్యాంకులు సైబర్ అటాక్స్‌తో పాటు డేటా రక్షణపరంగా పలు కొత్త సవాళ్లను ఎదుర్కొంటున్నాయని, వీటిని కట్టడి చేసేందుకు ఐటీ వ్యయాలు తప్పనిసరిగా పెంచాల్సి వస్తోందని పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ ఎండీ, సీఈఓ స్వరూప్ కుమార్ అన్నారు.

వైజాగ్ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం పెంపు

యోకోహమా ఇండియా


గౌరవ్ మహాజన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జపాన్‌కు చెందిన టైర్ల తయారీ సంస్థ యోకోహమా ఇండియా.. ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నంలోని ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 40 శాతం నుంచి 70 శాతం మేర పెంచినట్లు ప్రకటించింది. గతంలో రోజుకు 2,000 టైర్లను తయారు చేసిన ఈ ప్లాంట్‌లో ప్రస్తుతం 5,000 టైర్లకు ఉత్పత్తిని పెంచినట్లు సంస్థ మార్కెటింగ్ హెడ్ గౌరవ్ మహాజన్ వెల్లడించారు. 2023లో రూ.750 కోట్ల పెట్టుబడితో ప్రారంభించిన ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 17 లక్షల టైర్లుగా ఉందని ఆయన తెలిపారు. దేశీయంగా టైర్లకు పెరుగుతుండటంతో అందుకనుగుణంగా వైజాగ్ ప్లాంట్‌లో ఉత్పత్తిని పెంచినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ప్లాంట్‌లో చిన్న కార్ల టైర్ల నుంచి ఎస్‌యూవీ టైర్ల వరకు ఉత్పత్తి చేస్తున్నట్లు ఆయన వివరించారు.

ధరలు పెరిగే చాన్స్: పశ్చిమాసియా యుద్ధం కారణంగా కార్బన్ బ్లాక్, కెమికల్స్, నైలాన్, పాలిస్టర్‌తో పాటు డెరివేటివ్ ఉత్పత్తుల ధరలు పెరగటంతో టైర్ల ధరలను ఇప్పటికే 3 శాతం మేర పెంచినట్లు మహాజన్ వెల్లడించారు. పశ్చిమాసియా పరిస్థితి రోజురోజుకు మరింత సంక్లిష్టం అవుతుండటంతో ముడి పదార్థాల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని, దీంతో మరోసారి ధరలు పెంచకతప్పని పరిస్థితి నెలకొందని ఆయన వివరించారు. ప్రస్తుతం కంపెనీ సార్క్ దేశాలు సహా ఆఫ్రికా మార్కెట్లకు ఎగుమతి చేస్తోందన్నారు. కాగా యోకోహమా ఇండియా దేశవ్యాప్తంగా 3,300 డీలర్ నెట్‌వర్క్‌ను కలిగి ఉందన్నారు. ఏపీ, తెలంగాణల్లో 300 వరకు డీలర్‌షిప్ నెట్‌వర్క్ ఉందని తెలిపారు.

24,400 ఎగువన బుల్లిష్

(మే 4- 8 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 23,797-24,182 పాయింట్ల మధ్యన కదలాడి 0.87 శాతం నష్టపోయి 23,998 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24,400 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

బ్రేకౌట్ స్థాయి: 24,400 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 23,600

నిరోధ స్థాయిలు: 24,200, 24,300, 24,400 (24,100 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 23,800, 23,700, 23,600 (23,900 దిగువన బేరిష్)

ఆస్ట్రో నైట్

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	535
వరంగల్	527	గోదావరి	515
చిత్తూరు	593	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 75	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	130	విజయవాడ	123
వరంగల్	130	గుంటూరు	123
కరీంనగర్	130	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	130	చిత్తూరు	115
కర్నూలు	130	నెల్లూరు	120
విశాఖపట్నం	124	అనంతపురం	120
గోదావరి	123		

24,000 వద్ద అప్రమత్తత

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం 24,000 వద్ద సైడ్‌వేస్, కన్సాలిడేషన్ ట్రెండ్‌ను కనబరుస్తూ చివరకు వీక్లీ ప్రాతిపదికన స్వల్పంగా 99 పాయింట్ల లాభంతో క్లోజైంది. వారం కనిష్ఠ స్థాయిల్లో క్లోజయి ఎలాంటి సంకేతాలు, కన్సాలిడేషన్ ట్రెండ్‌ను సూచించలేదు. స్పష్టమైన స్వల్పకాలిక దిశకు ఈ వారం ట్రేడింగ్ అత్యంత కీలకంగా ఉండనుంది. నిఫ్టీ గడచిన మూడు వారాలుగా 24,500 వద్ద బలమైన నిరోధాన్ని ఎదుర్కొంటోంది. నిఫ్టీ వరుసగా నాలుగో వారం 24,000 స్థాయిల వద్ద మరోసారి బలమైన పరీక్షను ఎదుర్కోనుంది. ఈ స్థాయిల వద్ద నిలకడగా ముగిస్తేనే అప్‌ట్రెండ్‌ను సూచిస్తుంది. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 410 పాయింట్ల లాభంతో 60,000 దిగువన ముగియగా స్మాల్ క్యాప్ ఇండెక్స్ 440 పాయింట్ల లాభంతో క్లోజైంది.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీ సానుకూలత కోసం మైనర్ నిరోధ స్థాయిలైన 24,300 ఎగువన నిలదొక్కుకోవాలి. ఇక్కడ నిలదొక్కుకుంటే 24,500 ఎగువన తదుపరి నిరోధ స్థాయిలుంటాయి. స్వల్పకాలిక దిశను తీసుకునే ముందు ఇక్కడ కన్సాలిడేషన్‌కు అవకాశం ఉంది. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం 24,500-24,600 ఎగువన నిలదొక్కుకోవాలి.

బేరిష్ స్థాయిలు: ఒకవేళ రియాక్షన్‌ను కనబరిస్తే 23,800 వద్ద మైనర్ మద్దతు స్థాయిలుంటాయి. ఇక్కడ నిలదొక్కుకోలేక పోతే స్వల్పకాలిక బలహీనతను సూచిస్తుంది. తదుపరి ప్రధాన మద్దతు స్థాయి 23,500 దిగువన ఉంటాయి. గత నెలలో ఈ స్థాయిల నుంచే రికవరీ కనబరిచింది. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనతను సూచిస్తుంది.

సోమ వారం స్థాయిలు	
నిరోధం	24,210, 24,300
మద్దతు	23,800, 23,650

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 1,226 పాయింట్లు నష్టపోయి 54,860 వద్ద క్లోజైంది. సానుకూలత కోసం 55,500 ఎగువన నిలదొక్కుకోవాలి. ఇక్కడ కన్సాలిడేషన్‌కు అవకాశం ఉంది. తదుపరి ప్రధాన నిరోధ స్థాయి 56,100. ఒకవేళ బలహీనతను సూచిస్తే 54,400 వద్ద మద్దతు స్థాయిలుంటాయి. ఇక్కడ స్వల్పకాలిక బలహీనతకు అవకాశం ఉంది.

పాటర్న్: మార్కెట్ ప్రస్తుతం 50 రోజుల చలన సగటు వద్ద గట్టి పరీక్షను ఎదుర్కొంటుంది. 24,500 వద్ద "అడ్డంగా ఏర్పడిన ట్రెండ్‌లైన్" ఎగువన ఉంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి. అలాగే 23,500 వద్ద డబుల్ బాటమ్‌ను ఏర్పరచుకుంది. ఇక్కడ విఫలమైతే మరింత బలహీనతను సూచిస్తుంది. అప్రమత్తంగా ఉండాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్స్ ఉండవచ్చు.

ఆచితూచి అడుగేయండి!

వరుసగా నష్టాలను నమోదు చేస్తూ వస్తున్న దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం కొంత పుంజుకునే అవకాశం కనిపిస్తోంది. అమెరికన్ కాంగ్రెస్‌లో ఇరాన్‌తో యుద్ధం ముగిసినట్టేనని అధ్యక్షుడు ట్రంప్ చెప్పటం, కార్పొరేట్ కంపెనీల ఫలితాలు మెరుగ్గా ఉండటమే ఇందుకు కారణం. అలాగే దీర్ఘకాలిక ఇన్వెస్టర్లు కొనుగోళ్ల బాట పట్టడం కూడా కలిసిరానుంది. అయితే మార్కెట్లలో ఇంకా అనిశ్చితి తొలగి పోలేదు. కాబట్టి ఆచితూచి వ్యవహరించటం మంచిది. ప్రస్తుతం రియల్టీ, ఎనర్జీ, మెటల్, మీడియా, ఎఫ్ఎంసీజీ, కమోడిటీస్ రంగాలు మూమెంటమ్‌ను ప్రదర్శిస్తున్నాయి.

స్టాక్ రికమండేషన్స్

కేపీఐటీ టెక్నాలజీస్: రెండేళ్ల క్రితం జీవితకాల గరిష్ఠాన్ని తాకిన ఈ షేరు అప్పటి నుంచి డౌన్‌ట్రెండ్‌లోనే కొనసాగుతోంది. దాదాపు 70 శాతం మేర దిద్దుబాటుకు లోనయ్యాయి. అయితే కీలకమైన రూ.620 స్థాయిలో మద్దతు తీసుకున్న ఈ కౌంటర్ రెండు నెలల్లో 20 శాతం మేర రాబడిని అందించింది. ఈ వారం ఆర్థిక ఫలితాలు వెలువడనుండటంతో ఆసక్తి పెరిగింది. గత గురువారం రూ.759 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.750 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.930 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.720 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బెర్జర్ పెయింట్స్: రెండేళ్లుగా ఈ షేరు రూ.400 నుంచి రూ.600 శ్రేణిలో కదలాడుతోంది. విపరీతమైన స్వింగ్స్ నమోదవుతున్నాయి. త్వరలో ఆర్థిక ఫలితాలు విడుదలవుతుండటం, రూ.380 స్థాయిలో టర్న్ అరౌండ్ కావటంతో ఈ కౌంటర్‌పై ఆసక్తి పెరిగింది. గత గురువారం రూ.473 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.460 ఎగువన ఎంటరై రూ.580 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.430 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ లైఫ్: ఏడాది కాలంలో 50 శాతం రాబడిని అందించిన ఈ షేరు ప్రస్తుతం జీవితకాల గరిష్ఠ స్థాయిని తాకిన తర్వాత పతనమవుతూ వస్తోంది. దాదాపు 17 శాతం దిద్దుబాటుకు లోనయ్యాయి. అయితే రూ.1,740 స్థాయిలో రెండోసారి మద్దతు లభించింది. గత గురువారం రూ.1,819 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,800 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,010 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.1,770 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

మోతీలాల్ ఓస్వాల్: గత ఏడాది నవంబరులో రూ.1,080 వద్ద జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేరు 44 శాతం మేర పతనమైంది. అయితే మార్చిలో రూ.617 వద్ద మద్దతు తీసుకుని 30 శాతం మేర పుంజుకుంది. పైగా 200 రోజుల సగటును దాటే అవకాశం కనిపిస్తోంది. గత గురువారం రూ.800 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.790 వద్ద ప్రవేశించి రూ.970 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.770 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

లారస్ ల్యాబ్స్: రెండేళ్లుగా ఈ షేరు బుల్‌రన్‌ను కొనసాగిస్తోంది. తాజా మార్కెట్ పరిస్థితుల్లో 17 శాతం మేర దిద్దుబాటుకు లోనైంది. పైగా డబుల్ బాటమ్ ఫామ్ అవ్వటం, రిలేటివ్ స్ట్రెంత్, వాల్యూమ్ పెరుగుతుండటం సానుకూల అంశాలు. గత గురువారం రూ.1,100 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,100 శ్రేణిలో ఎంటరై రూ.1,280 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.1,070 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

స్పోర్ట్స్

నేటి మ్యాచ్	వేదిక ముంబై
ముంబై X లఖ్‌నవూ	రా.7.30

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
పంజాబ్	9	6	2	1	13	0.855
బెంగళూరు	9	6	3	0	12	1.420
హైదరాబాద్	10	6	4	0	12	0.644
రాజస్థాన్	10	6	4	0	12	0.510
గుజరాత్	10	6	4	0	12	-0.147
చెన్నై	9	4	5	0	8	0.005
ఢిల్లీ	9	4	5	0	8	-0.895
కోల్‌కతా	9	3	5	1	7	-0.539
ముంబై	9	2	7	0	4	-0.803
లఖ్‌నవూ	8	2	6	0	4	-1.106

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు

రైజర్స్‌ను కూల్చేశారు


వరుణ్ చక్రవర్తి (3/36)

● తిప్పేసిన వరుణ్, నరైన్
● 7 వికెట్లతో కోల్‌కతా గెలుపు
● రాణించిన రహానె, రఘువంశీ

హైదరాబాద్: బ్యాటర్ల వైఫల్యంతో.. సన్‌రైజర్స్ హైదరాబాద్ వరుస ఐదు విజయాలకు బ్రేక్ పడింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వరుణ్ చక్రవర్తి (3/36), సునీల్ నరైన్ (2/31) స్పిన్ మాయాజాలంతోపాటు అంగ్‌క్రిష్ రఘువంశీ (47 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 59) అర్ధ శతకంతో అదరగొట్టడంతో.. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ 7 వికెట్లతో సన్‌రైజర్స్‌కు ఝలకిచ్చింది. తొలుత సన్‌రైజర్స్ 19 ఓవర్లలో 165 పరుగులకే కుప్పకూలింది. ఈ సీజన్‌లో హైదరాబాద్ ఆలౌటవడం ఇదే తొలిసారి. హెడ్ (28 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 61) అర్ధ శతకంతో ఆకట్టుకోగా, ఇషాన్ కిషన్ (29 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 42) ఫర్వాలేదనిపించాడు. కార్తీక్ త్యాగి 2 వికెట్లు తీశాడు. ఛేదనలో కోల్‌కతా 18.2 ఓవర్లలో 169/3 స్కోరు చేసి గెలిచింది. ఓపెనర్లు రహానె (43), అలెన్ (13 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 29) తొలి వికెట్‌కు 49 రన్స్ జోడించారు. అలెన్‌ను కమిన్స్ అవుట్ చేసినా.. రఘువంశీ, రహానె రెండో వికెట్‌కు 84 రన్స్ జోడించడంతో కోల్‌కతా గెలుపు దిశగా సాగింది. రహానెను సకీబ్, రఘువంశీని శివాంగ్ వెనక్కిపంపారు. కానీ, రింకూ (11 బంతుల్లో 2 ఫోర్లు, సిక్సర్‌తో 22 నాటౌట్), గ్రీన్ (3 నాటౌట్) పది బంతులుండగానే మ్యాచ్‌ను గెలిపించారు.

పేకమేడలా..: హెడ్, ఇషాన్ దూకుడుగా ఆడడంతో.. ఒక దశలో 105/1తో భారీ స్కోరు చేసేలా కనిపించిన సన్‌రైజర్స్.. స్పిన్నర్లు వరుణ్, నరైన్ దెబ్బకు 10.1 ఓవర్లలో 60 పరుగులు మాత్రమే జోడించి మిగతా 9 వికెట్లు చేజార్చుకొంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న రైజర్స్‌కు ఓపెనర్లు అభిషేక్ (15), హెడ్ తొలి వికెట్‌కు 22 బంతుల్లో 44 పరుగుల భాగస్వామ్యంతో అదిరే ఆరంభాన్నిచ్చారు. అయితే, నాలుగో ఓవర్లోనే అభిషేక్‌ను త్యాగి క్యాచవుట్ చేసినా.. వన్‌డౌన్‌లో వచ్చిన ఇషాన్, హెడ్ దీటుగా ఆడడంతో పవర్‌ప్లేను రైజర్స్ 71/1తో ముగించింది. ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న హెడ్.. 9వ ఓవర్‌లో వరుణ్ బౌలింగ్‌లో అవుటవడంతో.. రెండో వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక, 11వ ఓవర్లో గ్రీన్ బౌలింగ్‌లో పావెల్ అందుకొన్న అద్భుత క్యాచ్‌తో క్లాసెన్ (11) వెనుదిరగడంతో రైజర్స్ బ్యాటింగ్ పేకమేడలా కూలింది. స్మరణ్ (4), అనికేత్ (6), సలీల్ (2), కెప్టెన్ కమిన్స్ (10), శివాంగ్ (1), హర్షల్ (6) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు.


నరైన్ (2/31)

ఐపీఎల్‌లో 200 వికెట్ల క్లబ్‌లో చేరిన తొలి విదేశీ బౌలర్‌గా నరైన్ నిలిచాడు.

స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: అభిషేక్ (సి) గ్రీన్ (బి) త్యాగి 15, హెడ్ (సి) గ్రీన్ (బి) వరుణ్ 61, ఇషాన్ (సి) అనుకూల్ (బి) నరైన్ 42, క్లాసెన్ (సి) పావెల్ (బి) గ్రీన్ 11, స్మరణ్ (సి) రహానె (బి) వరుణ్ 4, అనికేత్ (సి) రహానె (బి) వరుణ్ 6, సలీల్ (బి) నరైన్ 2, కమిన్స్ (సి అండ్ బి) అనుకూల్ 10, శివాంగ్ (సి) రఘువంశీ (బి) వైభవ్ 1, హర్షల్ (సి) వైభవ్ (బి) త్యాగి 6, మలింగ (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 19 ఓవర్లలో 165 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-44, 2-105, 3-117, 4-122, 5-135, 6-139, 7-148, 8-156, 9-156, 10-165; **బౌలింగ్:** నరైన్ 4-0-31-2, వైభవ్ 3-0-25-1, కార్తీక్ త్యాగి 4-0-30-2, గ్రీన్ 3-0-34-1, వరుణ్ 4-0-36-3, అనుకూల్ 1-0-8-1.

కోల్‌కతా: రహానె (సి) స్మరణ్ (బి) సకీబ్ 43, అలెన్ (సి) క్లాసెన్ (బి) కమిన్స్ 29, రఘువంశీ (సి) మలింగ (బి) శివాంగ్ 59, రింకూ (నాటౌట్) 22, గ్రీన్ (నాటౌట్) 3; **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 18.2 ఓవర్లలో 169/3; వికెట్ల పతనం:** 1-49, 2-133, 3-151; **బౌలింగ్:** అభిషేక్ 2-0-14-0, కమిన్స్ 4-0-47-1, మలింగ 3.2-0-42-0, శివాంగ్ 4-0-31-1, హర్షల్ 2-0-17-0, సకీబ్ 3-0-17-1.


మ్యాచ్‌కు హాజరైన యూఎస్ కాన్సులేట్ జనరల్ లారా విలియమ్స్, హెచ్‌సీఏ కార్యదర్శి జీవన్ రెడ్డి, చాముండేశ్వర్‌నాథ్, షట్లర్ పీవీ సింధు, ఆమె భర్త వెంకటదత్త సాయి, నటుడు రాహుల్

నేనూ బ్రిజ్‌భూషణ్ బాధితురాలినే



లైంగికంగా వేధించాడు

స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్ సంచలన వెల్లడి

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు, బీజేపీ నేత బ్రిజ్‌భూషణ్ సింగ్ తనను లైంగికంగా వేధించాడని ఒలింపియన్ వినేశ్ ఫొగట్ వెల్లడించింది. ఈమేరకు వీడియో ద్వారా ఆమె ఈ సంచలన విషయాన్ని బయటపెట్టింది. గతంలో బ్రిజ్‌భూషణ్ లైంగిక వేధింపులపై ఆరుగురు మహిళా రెజ్లర్లు ఫిర్యాదు చేయగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ కేసుపై కోర్టులో విచారణ జరుగుతోంది. ఆ ఆరుగురు రెజ్లర్లలో తానూ ఒకరినని వినేశ్ తెలిపింది. 'బాధితుల గౌరవానికి, మర్యాదకు సంబంధించిన విషయం కనుక వారి పేర్లు వెల్లడించకూడదని సుప్రీంకోర్టు మార్గదర్శకాలు చెబుతున్నాయి. కానీ కొన్ని పరిస్థితుల రీత్యా ఈ విషయాన్ని చెబుతున్నా. ఫిర్యాదు చేసిన రెజ్లర్లలో నేను కూడా ఉన్నా. మా వాంగ్మూలాల సేకరణ జరుగుతోంది' అని వినేశ్ ఆ వీడియోలో వివరించింది. బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద 2023లో రెజ్లర్లు చేసిన ఆందోళనలో వినేశ్ ప్రముఖ పాత్ర పోషించింది.



మాకేమైనా జరిగితే కేంద్రానిదే బాధ్యత

జాతీయ సీనియర్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌ను ఈనెల 10 నుంచి 12 వరకు ఉత్తరప్రదేశ్‌లోని గోండాలో డబ్ల్యూఎఫ్ఐ నిర్వహిస్తోంది. సెప్టెంబరులో ఆసియా క్రీడలు జరుగుతుండడంతో ఈ టోర్నీకి ప్రాధాన్యమేర్పడింది. ఇక..పారిస్ ఒలింపిక్స్ అనంతరం 18 నెలల తర్వాత మళ్లీ రెజ్లింగ్ బరిలో దిగుతున్న వినేశ్ ఈ టోర్నీలో 57 కిలోల విభాగంలో తలపడుతోంది. గోండా బ్రిజ్‌భూషణ్ స్వస్థలం. పైగా..టోర్నీని ఓ ప్రైవేటు కాలేజీలో నిర్వహిస్తున్నారు. ఆ కాలేజీ కూడా బ్రిజ్‌భూషణ్‌దేనని వినేశ్ వెల్లడించింది. అందువల్ల..ఈ టోర్నీ నిష్పక్షపాతకంగా జరిగే అవకాశం లేదన్న వినేశ్.. ఈ పోటీలలో తనకు, తన బృందానికి ఏదైనా జరిగితే అందుకు కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యతని ఆ వీడియోలో తెలిపింది. బ్రిజ్‌భూషణ్ డబ్ల్యూఎఫ్ఐ నుంచి వైదొలగినా..తన అనుచరుడైన ప్రస్తుత అధ్యక్షుడు సంజయ్ సింగ్ ద్వారా పరోక్షంగా పెత్తనం చెలాయిస్తున్నాడని వినేశ్ ఆరోపించింది.

వేదికను మార్చం: ర్యాంకింగ్ టోర్నీ వేదికను గోండా నుంచి మార్చే ప్రసక్తి లేదని డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు సంజయ్ సింగ్ స్పష్టంజేశాడు. వినేశ్‌తోపాటు ఇతర స్టార్ రెజ్లర్ల భద్రతకు తనది పూచి అని చెప్పాడు.

మిట్టల్ చేతికి రాజస్థాన్ రాయల్స్

● రూ.15,600 కోట్లతో డీల్

జైపూర్: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో మరో అపర కుబేరుడు భాగస్వామ్యం కానున్నాడు. బ్రిటన్‌కు చెందిన ప్రవాస భారతీయుడు లక్ష్మీ మిట్టల్ కుటుంబం రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీని దక్కించుకుంది. ఈ ఏడాది మార్చిలో ఈ జట్టు కొనుగోలు కోసం కల్ సోమానీ గ్రూప్ రూ.15,300 కోట్లతో బిడ్ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే నిధులు సమీకరించుకోవడంలో విఫలమైన సోమానీ గ్రూప్ పోటీ నుంచి వైదొలగింది. దీంతో తాజాగా లక్ష్మీ మిట్టల్ అతడి కుమారుడు ఆదిత్య మిట్టల్, అదార్ పూనావాలాలతో కూడిన గ్రూప్ రూ.15,660 కోట్ల అత్యధిక ధరతో బిడ్ వేసింది. తాజా ఒప్పందంలో మిట్టల్ ఫ్యామిలీకి 75 శాతం, పూనావాలాకు 18శాతం, మనోజ్ బదాలేకు 7శాతం వాటాలు ఉంటాయి. అలాగే పార్ల్ రాయల్స్, బార్బడోస్ రాయల్స్ జట్ల యాజమాన్య హక్కులు కూడా ఈ డీల్‌లో భాగం కానున్నాయి.

ఉబెర్ కప్ చాంపియన్ కొరియా

హోర్సెన్స్ (డెన్మార్క్): ఉబెర్‌కప్ బ్యాడ్మింటన్ ట్రోఫీని కొరియా మహిళల జట్టు సొంతం చేసుకొంది. ఆదివారం జరిగిన ఫైనల్లో కొరియా 3-1తో డిఫెండింగ్ చాంప్ చైనాకు షాకిచ్చింది.

'మాడ్రిడ్' కింగ్.. సినర్



మాడ్రిడ్: ప్రపంచ టెన్నిస్ నెంబర్ వన్ ఆటగాడు జానిక్ సినర్ మాడ్రిడ్ ఓపెన్‌లో చాంపియన్‌గా నిలిచాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో టాప్‌సీడ్ సినర్ (ఇటలీ) 6-1, 6-2తో జ్వెరెవ్ (జర్మనీ)ని చిత్తుచేసి ఇక్కడ తొలిసారి టైటిల్ నెగ్గాడు. దీంతో సినర్.. వరుసగా ఐదో మాస్టర్స్ 1000 ఈవెంట్ గెలిచిన తొలి ఆటగాడిగా రికార్డుకెక్కాడు.

గుజరాత్ హ్యాట్రిక్

వరుసగా మూడో విజయం
పంజాబ్‌కు రెండో ఓటమి


సుదర్శన్ (57)


హోల్డర్ (4/24)

అహ్మదాబాద్: స్వల్ప ఛేదనే అయినా ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ ఆఖరి ఓవర్‌లో గట్టెక్కింది. అటు తమ బ్యాటర్లు విఫలమైన చోట పంజాబ్ బౌలర్లు పోరాడినా ఫలితం దక్కలేదు. సాయి సుదర్శన్ (41 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్సర్‌తో 57), వాషింగ్టన్ సుందర్ (23 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్సర్‌తో 40 నాటౌట్) కీలక ఇన్నింగ్స్‌తో గుజరాత్‌ను ఆదుకున్నారు. దీంతో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో గుజరాత్ 4 వికెట్లతో నెగ్గింది. పంజాబ్‌కిది వరుసగా రెండో ఓటమి కాగా.. టైటాన్స్‌కు హ్యాట్రిక్ గెలుపు. ముందుగా పంజాబ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 163 పరుగులు చేసింది. సూర్యాన్ష్ షెడ్గే (29 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో 57), స్టొయినిస్ (31 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్సర్‌తో 40) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' హోల్డర్‌కు 4.. రబాడ, సిరాజ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో గుజరాత్ 19.5 ఓవర్లలో 167/6 స్కోరు చేసి గెలిచింది. అర్ష్‌దీప్, వైశాక్‌లకు రెండేసి వికెట్లు లభించాయి. కెప్టెన్ గిల్ (5) విఫలమైనా.. సుదర్శన్, బట్లర్ (26) రెండో వికెట్‌కు 53 రన్స్ జోడించారు. అయితే ఆఖర్లో పంజాబ్ పట్టు బిగించడంతో కాస్త ఉత్కంఠ నెలకొంది. 6 బంతుల్లో 11 పరుగులు కావాల్సిన వేళ ఐదో బంతిని సుందర్ సిక్సర్‌గా మలచి మ్యాచ్‌ను ముగించాడు.

ఆదుకున్న సూర్యాన్ష్-స్టొయినిస్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ ఈ సీజన్‌లో తొలిసారి తడబడింది. పేసర్లు హోల్డర్, రబాడ, సిరాజ్‌ల ధాటికి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయిన వేళ.. సూర్యాన్ష్, స్టొయినిస్ అద్భుతంగా ఆదుకున్నారు. దీంతో జట్టు కాస్త సవాల్ విసిరే స్కోరు చేయగలిగింది. ముందుగా భీకర ఫామ్‌లో ఉన్న ఓపెనర్ ప్రియాన్ష్ (2), కూపర్ (0)లను సిరాజ్ తొలి ఓవర్‌లోనే వెనక్కిపంపాడు. కెప్టెన్ శ్రేయాస్ (19), ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (15) కొద్దిసేపు క్రీజులో నిలిచి మూడో వికెట్‌కు 33 రన్స్ జోడించారు. అటు పరుగులు రావడం కూడా కష్టంగా మారగా.. 47/5 స్కోరుతో పంజాబ్ తీవ్ర కష్టాల్లో పడింది. ఈ దశలో సూర్యాన్ష్ ఎదురుదాడికి దిగాడు. అతడికి స్టొయినిస్ సహకరించడంతో స్కోరుబోర్డులో కదలిక వచ్చింది. 14వ ఓవర్‌లో సూర్యాన్ష్ 6,6,4,4,6తో 27 రన్స్ రాబట్టగా జట్టు స్కోరు వంద దాటింది. దీంతో అతను 24 బంతుల్లోనే తన తొలి హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. కానీ 16వ ఓవర్లో సూర్యాన్ష్‌ను రబాడ అవుట్ చేయడంతో ఆరో వికెట్‌కు 79 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. ఇక 18వ ఓవర్‌లో స్టొయినిస్, బార్ట్‌లెట్ (0)లను వరుస బంతుల్లో హోల్డర్ పెవిలియన్‌కు చేర్చి ప్రత్యర్థి పరుగుల వేగానికి బ్రేక్ వేశాడు. ఆఖరి ఓవర్‌లో యాన్సెన్ (20) 6,4తో 14 పరుగులు రాగా, జట్టు స్కోరు కూడా 160 దాటింది.

స్కోరుబోర్డు

పంజాబ్: ప్రియాన్ష్ (సి) నిషాంత్ (బి) సిరాజ్ 2, ప్రభ్‌సిమ్రన్ (సి) సుతార్ (బి) రబాడ 15, కూపర్ (సి) బట్లర్ (బి) సిరాజ్ 0, శ్రేయాస్ (బి) హోల్డర్ 19, వధేరా (సి) బట్లర్ (బి) హోల్డర్ 0, సూర్యాన్ష్ (సి) బట్లర్ (బి) రబాడ 57, స్టొయినిస్ (సి) వాషింగ్టన్ (బి) హోల్డర్ 40, యాన్సెన్ (సి) గిల్ (బి) రషీద్ 20, బార్ట్‌లెట్ (బి) హోల్డర్ 0, వైశాక్ (నాటౌట్) 1, అర్ష్‌దీప్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 163/9; వికెట్ల పతనం:** 1-2, 2-2, 3-35, 4-36, 5-47, 6-126, 7-141, 8-141, 9-162; **బౌలింగ్:** సిరాజ్ 4-0-28-2, రబాడ 4-1-22-2, హోల్డర్ 4-0-24-4, అర్షద్ 3-0-29-0, రషీద్ 4-0-32-1, మానవ్ సుతార్ 1-0-27-0.

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) బార్ట్‌లెట్ (బి) వైశాక్ 57, గిల్ (సి) కూపర్ (బి) అర్ష్‌దీప్ 5, బట్లర్ (సి) శ్రేయాస్ (బి) వైశాక్ 26, నిషాంత్ (సి) వైశాక్ (బి) స్టొయినిస్ 15, వాషింగ్టన్ (నాటౌట్) 40, తెవాటియా (సి) బట్లర్ (బి) యాన్సెన్ 2, హోల్డర్ (సి) కూపర్ (బి) అర్ష్‌దీప్ 5, అర్షద్ (నాటౌట్) 8, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 19.5 ఓవర్లలో 167/6; వికెట్ల పతనం:** 1-16, 2-69, 3-94, 4-124, 5-140, 6-152; **బౌలింగ్:** బార్ట్‌లెట్ 4-0-38-0, అర్ష్‌దీప్ 4-0-24-2, యాన్సెన్ 4-0-33-1, వైశాక్ 4-0-31-2, స్టొయినిస్ 2.5-0-26-1, చాహల్ 1-0-13-0.

దూసుకుపోతున్న 'స్వచ్ఛ రథం'

» పంచాయతీల్లో భారీగా ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ

» ఏప్రిల్‌లో 1866 టన్నులు.. బదులుగా గ్రామీణులకు 3.3 కోట్ల విలువైన నిత్యావసర వస్తువుల పంపిణీ

» రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సిద్ధమైన వాహనాలు

అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో 'స్వచ్ఛ రథం' దూసుకుపోతోంది. గ్రామాల్లో ప్లాస్టిక్, ఇతర పొడి వ్యర్థాలను నిరోధించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ తీసుకొచ్చిన ఈ పథకం సత్ఫలితాలనిస్తోంది. 'చెత్తతో సంపద' నినాదంతో ఒక్క ఏప్రిల్‌లోనే రాష్ట్రవ్యాప్తంగా 1866 టన్నుల వ్యర్థాలను సేకరించారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా మార్చి నెలాఖరుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో స్వచ్ఛ రథం వాహనాలను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఈ క్రమంలో పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించిన మొదటి నెలలోనే రికార్డు స్థాయి ఫలితాలను నమోదయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణుల నుంచి మొత్తంగా 1866 టన్నుల పొడి చెత్తను సేకరించారు. దానికి బదులుగా రూ.3.31 కోట్ల విలువైన నిత్యావసర వస్తువులను అందించారు. ఏప్రిల్ 2న నిర్వహించిన స్కూల్ డే కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల నుంచి ఒక్కరోజే ఒక టన్ను పొడి చెత్తను సేకరించారు. పర్యావరణం పట్ల ప్రజల్లో, విద్యార్థుల్లో పెరుగుతున్న సామాజిక స్పృహకు ఇది నిదర్శనంగా నిలుస్తోంది.



మాచర్లలో స్వచ్ఛ రథం వాహనాన్ని ప్రారంభిస్తున్న సీఎం (ఫైల్)

అమల్లో పూర్తి పారదర్శకత

స్వచ్ఛ రథాలు క్షేత్రస్థాయిలో అద్భుత పనితీరు కనబరుస్తున్నాయి. సగటున ఒక్కో వాహనం ప్రతి రోజు 190 కిలోల పొడి చెత్తను సేకరిస్తుంది. దానికి బదులుగా సుమారు రూ.3420 విలువైన వస్తువులను పంపిణీ చేస్తోంది. ఒక కేజీ పొడి చెత్తకు సగటున రూ.18 విలువ గల నిత్యావసర సరుకులు అందుతున్నాయి. ఈ లావాదేవీలలో పూర్తి పారదర్శకత పాటించేందుకు గానూ మార్కెట్ ధరల ప్రాతిపదికన పొడి చెత్త విలువను నిర్ణయించే అధికారాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారికి కల్పించారు. స్వచ్ఛ రథాలను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా, మండల స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ విభాగాలను ఏర్పాటు చేశారు. గ్రామస్థాయిలో పంచాయతీ అభివృద్ధి అధికారి నేతృత్వంలో స్వచ్ఛ రథం ప్రయోజనాలు, తద్వారా కలిగే లాభాలపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ 'స్వచ్ఛ రథం' కార్యక్రమం గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తూ, పర్యావరణాన్ని కాపాడుతూ.. గ్రామాలను 'స్వర్ణ గ్రామాలు-స్వచ్ఛ గ్రామాలు'గా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తోంది. గతంలో ఆర్థికంగా ఉన్న వ్యర్థాల నిర్వహణ పద్ధతులను ఈ కార్యక్రమం సమూలంగా మారుస్తోంది.



నీటి కుంటలు బ్రోచర్‌ను చూస్తున్న పీవీ సింధు

శ్రీసిటీకి 'క్యారియర్'!

» వెయ్యి కోట్లతో ఏసీల పరిశ్రమ పెట్టనున్న దిగ్గజ సంస్థ

» ఎల్లుండి శంకుస్థాపన.. హాజరుకానున్న లోకేశ్



తిరుపతి, మే 3(ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన దిగ్గజ ఎయిర్ కండిషనర్ తయారీ సంస్థ 'క్యారియర్'.. శ్రీసిటీలో ఉత్పత్తి సంస్థను ప్రారంభించనుంది. దాదాపు రూ.వెయ్యి కోట్ల పెట్టుబడితో గృహేతర వినియోగానికి సంబంధించిన భారీ ఏసీలను తయారు చేయనుంది. శ్రీసిటీలో ఈ సంస్థకు సుమారు 40 ఎకరాలు కేటాయించారు. బుధవారం (6న) శంకుస్థాపన జరుగనుంది. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ హాజరు కానున్నారు. క్యారియర్ సంస్థ సీఎండీ డేవిడ్ గిట్లిన్ కూడా వస్తున్నట్లు తెలిసింది. ఈ పరిశ్రమతో వెయ్యి మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. మరో రెండు వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.

ఏపీ గ్రామీణ మహిళలకు త్రోబాల్ శిక్షణ

» ఈశా గ్రామోత్సవం కోసం సన్నద్ధత

అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): దేశంలోనే అతి పెద్ద గ్రామీణ క్రీడా మహోత్సవం ఈశా గ్రామోత్సవం-2026 కోసం ముందస్తుగా ఏపీ, తెలంగాణలో 14 ఏళ్లు, అంతకంటే పైబడిన గ్రామీణ మహిళల కోసం ఉచిత త్రోబాల్ శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఈశా ఫౌండేషన్ సంస్థ ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనే వారికి నిపుణుల మార్గదర్శకత్వంలో శిక్షణ, ఆసక్తికరమైన కార్యకలాపాలు, ప్రతిరోజూ అల్పాహారం అందిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో చిత్తూరులో మే 27 నుంచి 31 వరకు బండపల్లి జడ్పీ హైస్కూల్, గుడిపాల సీఎన్ఆర్ పాఠశాలలో శిక్షణ తరగతులు జరుగుతాయి. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం పూడిపర్తిలో మే 13 నుంచి 17 వరకు, బుచ్చిరెడ్డిపాలెం మండలం కొత్తల్లులో మే 20 నుంచి 24 వరకు శిబిరాలు నిర్వహిస్తారు. అదనంగా వెంకటాచలం మండలం కనుపూరులో శిబిరం నిర్వహిస్తారు. విశాఖపట్నంలో మే 27 నుంచి 31 వరకు శిబిరం జరుగుతుంది. ఈ శిక్షణా శిబిరాల్లో పాల్గొనే వారు ఈశా గ్రామోత్సవంలో భాగస్వాములు కావడానికి అవకాశముంటుంది. విజేతలు రూ.5లక్షల వరకు బహుమతులు గెలుచుకునే అవకాశముంటుందని ఆ సంస్థ పేర్కొంది.

7, 8 తేదీల్లో కలెక్టర్ల కాన్ఫరెన్స్

అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 7, 8వ తేదీల్లో జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ 4.7ను నిర్వహించనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్లు, సెక్రటరీలు, హెచ్‌వోడీలు సిద్ధంగా ఉండాలని సూచించారు.. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌ను ఎప్పటిలానే సచివాలయంలోని ఐదవ బ్లాక్‌లోనే నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు.

ఫోరెన్సిక్‌తో నేరాలకు బ్రేక్!

(మొదటి పేజీ తరువాయి)

ఐదెకరాల స్థలంలో అంతర్జాతీయ స్థాయిలో నిర్మించిన ఐదు భవనాల సముదాయం పూర్తయింది. ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి చంద్రబాబు దీన్ని ప్రారంభించనున్నారు. ఎఫ్ఎస్ఎల్ ఇచ్చే కచ్చితమైన నివేదికలు నేరస్తులకు శిక్ష పడేలా చేస్తాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. సీఆర్‌డీఏ భవనం తర్వాత రాజధానిలో ప్రారంభంకానున్న భవన సముదాయం ఇదేనని తెలిపారు. దేశంలోని ఎనిమిది అత్యాధునిక ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌ల్లో ఇదొకటని పేర్కొన్నారు.

నేరస్తులు తప్పించుకోలేరు: డీజీపీ

రాష్ట్రంలో నేరం చేసిన వ్యక్తి తప్పించుకోలేడని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా అన్నారు. 'రాష్ట్రంలో నేరం చేసిన వ్యక్తి ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పించుకోకూడదని సీఎం చంద్రబాబు పదే పదే మాకు చెబుతున్నారు. అందుకే ఏపీలో ఎఫ్ఎస్ఎల్‌ను బలోపేతం చేస్తున్నాం. కర్నూలు, గుంటూరు, విశాఖపట్నంలోని ప్రాంతీయ ఎఫ్ఎస్ఎల్‌లకు తోడు అనంతపురం, విజయవాడ, తిరుపతి, రాజమహేంద్రవరంలోనూ ఏర్పాటు చేశాం. గత నెలలో తిరుపతిలో ప్రారంభించాం.. ఈ నెలలో రాజమహేంద్రవరంలో ప్రారంభం కాబోతోంది.. అమరావతిలో అంతర్జాతీయ స్థాయి సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌ను కూడా సీఎం చంద్రబాబుతో ప్రారంభం చేయిస్తాం' అని చెప్పారు. ఫోరెన్సిక్ విభాగాన్ని బలోపేతం చేసేందుకు పూర్తి సహకారం అందించిన సీఎం చంద్రబాబుకు పోలీసుశాఖ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. సిబ్బంది కొరత గురించి చెప్పగానే ఎనిమిది మంది ఏడీలు, 45 మంది సైంటిఫిక్ ఆఫీసర్లు, సైంటిఫిక్ నాలెడ్జ్ ఉన్న మరో 156 మంది హోంగార్డుల నియామకానికి సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని డీజీపీ వివరించారు.



ఇటీవల ప్రారంభమైన తిరుపతిలోని ఆర్ఎఫ్ఎస్ఎల్ కేంద్రం

త్వరితగతిన విచారణ...: ఒకప్పుడు నేరాలు జరిగితే.. ఘటనా స్థలంలో నిపుణులు సేకరించే వేలి ముద్రలు, తల వెంట్రుకలు, రక్తం.. వంటివి కేసు పరిష్కారంలో కీలక పాత్ర పోషించేవి. వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి తే ఆరు నెలలకో, ఏడాదికో నివేదిక వచ్చేది. ఈ ప్రక్రియలో జాప్యం వల్ల కేసులు ఎక్కువగా నిలబడేవి కావు. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా నేరస్థులు కూడా పాత పద్ధతులు, దర్యాప్తు విధానాలను పసిగట్టి జాగ్రత్త పడుతున్నారు. ఆనవాళ్లు దొరక్కుండా నేరాలు చేసి తప్పించుకొంటున్నారు. అటువంటి వారి ఆట కట్టించేందుకు దర్యాప్తు సంస్థలు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను పాటిస్తున్నాయి. దీని కోసం కోట్లాది రూపాయల విలువైన సైబర్ ఫోరెన్సిక్, డిజిటల్ ఫోరెన్సిక్, కెమిస్ట్రీ, బయాలజీ వంటి ల్యాబ్‌లు ఏర్పాటు చేసుకుని నేరగాళ్లను కచ్చితంగా గుర్తిస్తున్నాయి. ఈ క్రమంలోనే రాష్ట్రంలో ఫోరెన్సిక్ విభాగాన్ని బలోపేతం చేస్తున్న పోలీసుశాఖ అమరావతిలో అంతర్జాతీయ స్థాయి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నిర్మాణాన్ని పూర్తి చేసింది. మరో వైపు రాష్ట్ర వ్యాప్తంగా ప్రాంతీయ ల్యాబ్‌లు నెలకొకటి చొప్పున ప్రారంభిస్తూ దర్యాప్తు వ్యవస్థను బలోపేతం చేసుకుంటోంది.

2017లోనే నిర్మాణాలు ప్రారంభం..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడ నేరం జరిగినా ఘటనా స్థలంలో సేకరించే ఆధారాలను భద్రపరిచి హైదరాబాద్ ఎఫ్ఎస్ఎల్‌కు పంపేవారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి సెంట్రల్ ఫోరెన్సిక్ ల్యాబ్ లేకుండా పోయింది. దీంతో 2017లో కేంద్రంతో మాట్లాడిన సీఎం చంద్రబాబు రాష్ట్రానికి అధునాతన ఎఫ్ఎస్ఎల్ నిర్మాణానికి అనుమతి తీసుకొచ్చారు. రూ.253 కోట్ల అంచనాతో రాజధానిలోని తుళ్లూరు ప్రాంతంలో దీని నిర్మాణానికి 2017 డిసెంబరు 28న భూమిపూజ చేశారు. మొదటి శ్లాబు వేసేలోపు ఏపీలో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైంది. అంతే.. మొత్తం నిర్మాణం ఆగిపోయింది. 2024లో మళ్లీ చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం రావడంతో ఐదెకరాల విస్తీర్ణంలో 5 బ్లాకులుగా చేపట్టిన నిర్మాణం పూర్తయింది. ఈ ల్యాబ్‌లో ఏర్పాటు చేసే అధునాతన పరికరాలు ఇరాన్-అమెరికా యుద్ధం వల్ల షిప్పులో ఆగిపోయాయని అధికారులు చెబుతున్నారు. త్వరలోనే వాటిని భవనాల్లో ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రారంభం చేయించాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు.

ఐదెకరాల్లో.. ఐదు భవనాలు...

ఐదెకరాల్లో చేపట్టిన ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రధాన భవనంలో పరిపాలన మొత్తం ఏర్పాటు చేసి.. మిగతా నాలుగింటిలో ఫిజిక్స్ ల్యాబ్, కెమిస్ట్రీ ల్యాబ్, బయాలజీ ల్యాబ్, బాలిస్టిక్ ల్యాబ్ ఏర్పాటు చేస్తున్నారు. భవన సముదాయం దాదాపు పూర్తి కాగా ప్రస్తుతం ప్రహరీ నిర్మాణం జరుగుతోంది. మరోవైపు వీటిలో అవసరమైన పరికరాలను రూ.41 కోట్ల ఖర్చుతో పోలీసు శాఖ తెప్పిస్తోంది. రాష్ట్రంలో ఎక్కడ ఎలాంటి నేరం జరిగినా నిమిషాల్లోనే క్రైమ్ స్పాట్‌కు వెళ్లేలా పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన మొబైల్ ఎఫ్ఎస్ఎల్ వాహనాలు సేకరించే ఆధారాలను 48 గంటల్లోనే నిర్ధారించి దర్యాప్తు అధికారికి తెలియజేస్తామని ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ పీహెచ్‌డీ రామకృష్ణ తెలిపారు. డీఎన్ఏ, నార్కోటిక్స్, సైబర్, బయోమెట్రిక్, బాలిస్టిక్ లాంటి పరీక్షలతో పాటు ఫోరెన్సిక్ అకౌంటింగ్‌కు సంబంధించిన ఎక్సలెన్స్, గత నేరాల నమూనాలతో సరిపోల్చగల డేటాబేస్ యాక్సిక్ కూడా ఉంటుందన్నారు.

పవన్ 'మ్యాజిక్' భేష్

» గ్రామీణాంధ్రప్రదేశ్ కోసం వినూత్న కార్యక్రమాలు

» సరికొత్త మ్యాజిక్ డ్రెయిన్లతో పారిశుధ్యం మెరుగు

» ప్రజలకు ఆరోగ్యం.. భూగర్భ జలాలు వృద్ధి

» ఉపముఖ్యమంత్రికి పీవీ సింధు ప్రశంసలు

అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): గ్రామీణాంధ్రప్రదేశ్ లక్ష్యసాధన కోసం ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ విప్లవాత్మక ఆలోచనలను అమలు చేస్తున్నారని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, ఒలింపిక్స్ మెడలిస్టు పీవీ సింధు ప్రశంసించారు. ఉపముఖ్యమంత్రిగా ఆయన 20 నెలల పాలన గురించి తన అభిప్రాయాన్ని తెలియజేస్తూ ఓ వీడియో విడుదల చేశారు. పవన్ ఆలోచనల నుంచి పురుడుపోసుకున్న మ్యాజిక్ డ్రెయిన్స్ లాంటి సరికొత్త విధానాలు అమలు చేయడం ద్వారా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగవుతుందని పేర్కొన్నారు. పల్లెల్లో మురుగు సమస్య నివారణలో మ్యాజిక్ డ్రెయిన్లు గేమ్ చేంజర్ లాంటివన్నారు. పాలనా వ్యవహారాలు కొత్తే అయినా పవన్ వినూత్న కార్యక్రమాలతో ప్రజా సమస్యలకు పరిష్కార మార్గాలు అన్వేషిస్తున్నారని పేర్కొన్నారు. 'మన దేశంలో మెజారిటీ శాతం ప్రజలు గ్రామాల్లో నివసిస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్యం పెద్ద సవాలుగా నిలిచింది. సరైన మురుగునీటి పారుదల వ్యవస్థ లేక ప్రజలు అపరిశుభ్ర వాతావరణంలో జీవనం సాగిస్తున్నారు. ఈ సమస్యకు పవన్ కల్యాణ్ మ్యాజిక్ డ్రెయిన్ల రూపంలో అద్భుత పరిష్కార మార్గాన్ని కనుగొన్నారు. ఇంకుడు గుంతలతో కూడిన డ్రెయిన్లు ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీటిని క్షణాల్లో మాయం చేస్తాయి. మూడంచెల ఫిల్టర్ బెడ్ల ద్వారా శుద్ధిచేసిన నీటిని భూగర్భ జలంగా మార్చేస్తాయి. మురుగునీటి నిల్వ, దుర్వాసన తదితర సమస్యలకు మ్యాజిక్ డ్రెయిన్లు చక్కటి పరిష్కార మార్గం. సాధారణ సిమెంట్ డ్రెయిన్ల నిర్మాణంతో పోలిస్తే మ్యాజిక్ డ్రెయిన్లకు 80 శాతం నిర్మాణ వ్యయం కూడా ఆదా అవుతుంది. గ్రామీణ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు పారిశుధ్యాన్ని ఈ మ్యాజిక్ డ్రెయిన్లు పెంపొందిస్తాయి. ఆంధ్రప్రదేశ్, రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం పవన్‌కల్యాణ్ భవిష్యత్తులోనూ ఇలాంటి ముందుచూపుతో కూడిన వినూత్న కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని ఆకాంక్షిస్తున్నా' అని సింధు వీడియోలో పేర్కొన్నారు.

ఐటీ దిగాలు..

ఉపాధి జిగేలు!



(మొదటిపేజీ తరువాయి)

స్వయం ఉపాధి దిశగానూ అడుగులు వేస్తోంది. ప్రస్తుతం కంపెనీలు డిగ్రీ పట్టా కంటే 'స్కిల్ (నైపుణ్యం)'కే ప్రాధాన్యత ఇస్తున్నాయి. రాబోయే కాలంలో ఏ రంగంలోనైనా ప్రత్యేక నైపుణ్యం ఉన్నవారికి స్థానం ఉంటుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కొత్త సాంకేతికతలు, మార్పులకు అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకోవడం ముఖ్యమని విద్యావేత్త మెండెం కిరణ్‌కుమార్ తెలిపారు. ఐటీ ఉద్యోగాలు పోవడమంటే.. అవకాశాలు పోవడం కాదని, అవి రూపాంతరం చెందుతున్నాయని గుర్తించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా సేవా రంగంలో (సర్వీస్ సెక్టార్) ఉన్న అవకాశాలు సామాన్యమైనవి కావని.. సమాజ అవసరాలను గుర్తించి దానికి తగ్గట్లు నైపుణ్యాన్ని పెంచుకుంటే ప్రతి రంగం ఒక బంగారు గని వంటిదేనని పేర్కొన్నారు.

నాడు కోడింగ్.. నేడు నెక్స్ట్ జనరేషన్ కోర్సులు!

ఐటీ రంగంలో మనుగడ సాగించాలంటే ఇప్పుడు డిగ్రీ ఉంటే చాలదు. కేవలం జావా లేదా పైథాన్ నేర్చుకుంటే ఉద్యోగం వచ్చే రోజులు పోయాయి. ఇప్పుడు మార్కెట్ కోరుకుంటున్న సరికొత్త కోర్సుల్లో నైపుణ్యాలు తప్పనిసరి అయ్యాయి. ఇది గ్రహించిన యువత సంబంధిత కోర్సుల్లో ఆసక్తి చూపుతున్నారు.

కృత్రిమ మేధ (ఏఐ), డేటా సైన్స్

సాఫ్ట్‌వేర్ రంగం లో ఉన్నా సరే ఏఐ నైపుణ్యం లేకపోతే మనుగడ కష్టమని తేలిపోయింది. సాధారణ ప్రోగ్రామింగ్ స్థానంలో ఏఐ అప్లికేషన్ల తయారీకి డిమాండ్ పెరిగింది. 2026చివరికి దేశానికి 10 లక్షల మంది ఏఐ నిపుణులు అవసరమని అంచనా.

సెమీకండక్టర్ ఇంజినీరింగ్

భారత్ ఇప్పుడు గ్లోబల్ చిప్‌హబ్‌గా మారుతోంది. చిప్ తయారీ యూనిట్లు భారీగా వస్తుండటంతో ఈ రంగంలో నిపుణుల కొరత నెలకొంది. ఇందులో నైపుణ్యం ఉన్నవారికి లక్షల్లో జీతాలు లభిస్తున్నాయి.

సైబర్ సెక్యూరిటీ అండ్ ఫోరెన్సిక్

డిజిటల్ లావాదేవీలు, నేరాలు పెరుగుతుండటంతో బ్యాంకింగ్, రక్షణ కవచంలా నిలిచే సైబర్ నిపుణులకు భారీ ప్యాకేజీలు ఆఫర్ చేస్తున్నాయి.

పునరుత్పాదక ఇంధన కోర్సులు

పెట్రోల్ ఇంజన్ల కాలం పోతోంది. గ్రీన్ ఎనర్జీ, సోలార్, విండ్ పవర్ రంగాల్లో ఇంజనీర్లకు డిమాండ్ పెరిగింది. పర్యావరణ పరిరక్షణ కోర్సులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈవీ బ్యాటరీ మేనేజ్‌మెంట్, ఎలక్ట్రిక్ పవర్ ట్రెయిన్ ఇంజనీరింగ్‌కు డిమాండ్ పెరిగింది. సోలార్, విండ్ పవర్, ఎలక్ట్రిక్ వెహికిల్ (ఈవీ) టెక్నాలజీ భవిష్యత్తును శాసించనున్నాయి.

బయో- టెక్నాలజీ అండ్ హెల్త్‌కేర్ డేటా

కోవిడ్ తర్వాత హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్, బయో ఇన్ఫర్మేటిక్స్ కోర్సుల్లో చేరేవారి సంఖ్య 25శాతం పెరిగింది.

మార్కెట్‌లో ఉపాధికి కొత్త మార్గాలెన్నో..

ప్రస్తుతం సమాజంలో ప్రజలు విలాసానికి, ఆరోగ్యానికి, అందానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇదే ఇప్పుడు నిరుద్యోగులకు కల్పవృక్షంగా మారింది. ఐటీ కొలువు పోయినవారు, ఉద్యోగం దొరకనివారు ఇప్పుడు సర్వీస్ సెక్టార్‌లో రాణిస్తున్నారు.

వెల్‌నెస్ అండ్ లైఫ్ స్టైల్

ఒకప్పుడు మెట్రో నగరాలకే పరిమితమైన స్పా, మసాజ్ సెంటర్లు ఇప్పుడు జిల్లా కేంద్రాలకు కూడా విస్తరించాయి. పనిఒత్తిడి, జీవనశైలి మార్పుల కారణంగా స్పా, యోగా, వెల్‌నెస్ థెరపీలకు డిమాండ్ పెరిగింది. శిక్షణ పొందిన థెరపిస్టులు నెలకు లక్షన్నరకు పైగా సంపాదిస్తున్నారు. కేవలం తలదువ్వడం, మేకప్ వేయడం కాదు.. ఇప్పుడు హెయిర్ డిజైనింగ్స్, స్పెషల్ మేకప్ వంటి కోర్సులకు విపరీతమైన డిమాండ్ ఉంది. పెళ్లిళ్ల సీజన్‌లో ఒక్కో మేకప్ ఆర్టిస్ట్ రోజుకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు సంపాదిస్తున్నారు.

ప్రభుత్వ చేయూత.. శిక్షణ వేదికలెన్నో

స్వయం ఉపాధి కోరుకునే వారి కోసం అనేక ప్రైవేటు, ప్రభుత్వ శిక్షణ సంస్థలు అందుబాటులోకి వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ యూనివర్సిటీ ద్వారా పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా అడ్వాన్స్‌డ్ కోర్సులను అందిస్తున్నారు. నేరుగా ఉపాధి కల్పించే 17 రకాల కోర్సులను ప్రభుత్వం అందిస్తోంది. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థలతో కలిసి సర్టిఫికేషన్ కోర్సులు నిర్వహిస్తున్నారు. నిరుద్యోగులకు ఉచితంగా బ్యూటీ, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, ఐటీ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. కోర్సెరా, ఉడెమీ వంటి సంస్థల ద్వారా గూగుల్ డేటా అనలిటిక్స్ వంటి షార్ట్ టర్మ్ కోర్సులపై యువత ఆసక్తి చూపుతున్నారు. అలాగే గ్రామీణ యువతకు బ్యూటీషియన్, టైలరింగ్, హ్యాండీక్రాఫ్ట్‌లో శిక్షణ ఇస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ నుంచి స్పా థెరపీ వైపు..

హైదరాబాద్‌కు చెందిన ప్రణయ్ ఒక పెద్ద సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. లే- ఆఫ్‌లో ఉద్యోగం పోవడంతో కుంగిపోకుండా థాయ్‌లాండ్‌లో వెల్‌నెస్ థెరపీ కోర్సు చేశారు. ఇప్పుడు హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో సొంతంగా స్పా నిర్వహిస్తూ నెలకు రూ.3లక్షలకుపైగా సంపాదిస్తున్నారు. 'ఐటీలో రేపు ఉద్యోగం ఉంటుందో లేదో తెలియదు.. కానీ ఇక్కడ నా నైపుణ్యం నా చేతుల్లోనే ఉంది. ఐటీలో ఉన్నప్పుడు లేని ప్రశాంతత, ఆదాయం ఇక్కడ ఉన్నాయని మరో పది మందికి ఉపాధి ఇస్తున్నా' అని గర్వంగా చెబుతున్నారు ప్రణయ్.

కోడింగ్ వదిలి సైబర్ సెక్యూరిటీలోకి..

విశాఖపట్నానికి చెందిన మౌనిక సాధారణ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ పనిచేసేవారు. ఐటీరంగం కుదేలవడంతో 'ఎథికల్ హ్యాకింగ్' కోర్స్ నేర్చుకున్నారు. ప్రస్తుతం ఒక ప్రముఖ బ్యాంక్‌లో సైబర్ సెక్యూరిటీ అనలిస్ట్‌గా నెలకు రూ.1.50లక్షల వేతనంతో పనిచేస్తున్నారు.



మేకప్ ఆర్టిస్ట్‌గా..

వరంగల్‌కు చెందిన లాస్య ఎంటెక్ చదివారు. సాఫ్ట్‌వేర్ రంగం సంక్షోభంలో ఉండటంతో తన ఆసక్తిని వృత్తిగా మార్చుకుని 'బ్రైడల్ మేకప్'లో శిక్షణ తీసుకున్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ఆమె పాపులర్ మేకప్ ఆర్టిస్ట్. ఒక్కో పెళ్లి సీజన్‌లో ఆమె సంపాదన అక్షరాలా రూ.10లక్షలకు పైమాటేనట!

క్లౌడ్ కిచెన్స్..



తక్కువ పెట్టుబడితో ఇంటి నుంచే ఆహారాన్ని తయారు చేసి ఆన్‌లైన్‌లో విక్రయించే సరికొత్త ఉపాధి క్లౌడ్ కిచెన్లతో ఏర్పడింది. ఎల్‌బీ నగర్‌కు చెందిన ఉమారాణి తన కుటుంబంతో సహా క్లౌడ్ కిచెన్ నిర్వహిస్తూ.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కంటే కూడా మంచి ఆదాయం పొందుతున్నారు.

డ్రోన్ టెక్నాలజీతో పొలాల్లోకి..

సూర్యాపేట జిల్లాకు చెందిన యువ ఇంజినీర్ నితీశ్‌రెడ్డి.. ఉద్యోగ వేట వదిలి 'అగ్రి డ్రోన్' ఆపరేటింగ్‌లో సర్టిఫికేషన్ చేశారు. ఇప్పుడు తన సొంత డ్రోన్‌తో చుట్టుపక్కల గ్రామాల్లో పురుగుమందుల పిచికారీ చేస్తూ నెలకు రూ.90వేలకు పైగానే నికర ఆదాయం పొందుతున్నారు.



ఈవెంట్స్‌లో కింగ్..

పుట్టినరోజు పార్టీల నుంచి కార్పొరేట్ ఈవెంట్ల వరకు ప్రతిదీ ఇప్పుడు ఈవెంట్ మేనేజర్ల చేతుల్లోనే ఉంది. సృజనాత్మకత ఉంటే చాలు.. పెట్టుబడి తక్కువ లాభం ఎక్కువగా ఉంటుంది. విజయవాడకు చెందిన కిరణ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి 'ఈవెంట్ మేనేజ్‌మెంట్' ప్రారంభించారు. ఇప్పుడు 20 మందికి పైగా ఉపాధి కల్పిస్తున్నారు.

పెట్ గ్రూమింగ్.. సరికొత్త ట్రెండ్



జంతుప్రేమికులు పెరగడంతో శునకాలు, పిల్లులను సంరక్షించే 'పెట్ కేర్ సెంటర్లు', వాటికి అందం అద్దే 'పెట్ గ్రూమర్స్'కు కొత్త మార్కెట్ ఏర్పడింది. విశాఖపట్నంలో ఒక ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ 'పెట్ గ్రూమింగ్ (పెంపుడు జంతువుల అలంకరణ)' సెంటర్ తెరిచారు. ఈ వినూత్న వ్యాపారం ఇప్పుడు మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

సోలార్ టెక్నీషియన్స్



ప్రభుత్వాలు సౌర విద్యుత్‌ను ప్రోత్సహిస్తున్న క్రమంలో సోలార్ ప్యానెళ్లు, వ్యవస్థల ఏర్పాటు, సర్వీసింగ్ చేసే టెక్నీషియన్లకు డిమాండ్ పెరిగింది. ఖమ్మం పట్టణానికి చెందిన శ్రీనివాసరావు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పోవడంతో ఈ రంగంలో స్కిల్స్ నేర్చుకున్నారు. ఇప్పుడు రూ.80 వేలకుపైగా సంపాదిస్తున్నారు.

చంద్రబోస్ సోదరుడి మృతి



కలికిరి, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ గేయ రచయిత చంద్రబోస్ అన్న రాజేందర్ ఆదివారం ఏపీలోని అన్నమయ్య జిల్లా కలికిరిలో నడిరోడ్డుపై కుప్పకూలి మృతి చెందారు. తెలంగాణలోని వరంగల్ జిల్లాకు చెందిన రాజేందర్ హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. రెండురోజుల క్రితం ఆయన బెంగళూరు, మదనపల్లె ప్రాంతాల్లోని స్థలాలను పరిశీలించేందుకు వెళ్లారు. అనంతరం తన స్నేహితుడు శ్రీనివాసులరెడ్డిని కలిసేందుకు కలికిరికి వచ్చారు. అప్పటికే ఆయన హైదరాబాద్‌కు వెళ్లడంతో తాను తిరిగి వచ్చేవరకు తన ఇంట్లో ఉండమని సూచించారు. దీంతో రాజేందర్ కలకడ రోడ్డు సత్యాలేఔట్‌లోని శ్రీనివాసులరెడ్డి నివాసంలో బస చేశారు. కాగా ఆదివారం ఉదయం 7.30 గంటలకు ఛాతీలో నొప్పి వస్తోందని రాజేందర్ సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లారు. ఆయన్ను పరీక్షించిన వైద్యుడు అంతా బాగానే ఉందని, మరోసారి ఎక్కడైనా చెకప్ చేయించుకోమని సలహా ఇచ్చారు. దీంతో అక్కడి నుంచి కలికిరి గాంధీ చౌరస్తా ఎస్బీఐ సమీపంలోని ఒక హోటల్‌లో టిఫిన్ తిన్న రాజేందర్ రోడ్డు పైకి వచ్చి ఉన్నట్టుండి కుప్పకూలి మృతి చెందారు. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించి హైదరాబాద్‌లోని మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వారు తాము అక్కడికి చేరుకోవడానికి ఆలస్యమవుతుందని చెన్నైలోని సమీప బంధువులకు తెలపడంతో.. వారు కలికిరి పోలీసులను సంప్రదించి మృతదేహాన్ని హైదరాబాద్‌కు తరలించారు.

అమరావతి రాష్ట్ర సంపద

» అభివృద్ధిని ఓర్వలేకే వైసీపీ విమర్శలు

» విజయసాయిరెడ్డికి మతి భ్రమించింది: బుద్దా వెంకన్న



విజయవాడ అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని మాత్రమే కాదని, రాష్ట్ర ప్రజల సంపద అని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బుద్దా వెంకన్న అన్నారు. విజయవాడలోని తన కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని నాశనం చేసి, ప్రజాధనాన్ని దోచుకున్నారని, అందుకే ప్రజలు ఎన్నికల్లో 11 సీట్లు ఇచ్చి పక్కన కూర్చోబెట్టారని ఎద్దేవా చేశారు. సీఎం చంద్రబాబుపై నమ్మకంతో కూటమికి ప్రజలు అధికారం ఇచ్చారని, ఇప్పుడు రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని చెప్పారు. అమరావతిలో అభివృద్ధి పరుగులు పెడుతోందని, అది చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. విజయసాయిరెడ్డికి అన్ని పార్టీలు తలుపులు మూసేశాయని, దీంతో మతి భ్రమించి మాట్లాడుతున్నాడని విమర్శించారు. ఇలా ఇంకోసారి చంద్రబాబు గురించి మాట్లాడితే దేహశుద్ధి చేస్తామని హెచ్చరించారు. విజయసాయిరెడ్డి పార్టీ పెట్టి, సర్పంచ్‌గా గెలిచినా తాను రాజకీయాలను వదిలేస్తానని సవాల్ విసిరారు. రాష్ట్రానికి గూగుల్ డేటా సెంటర్‌ను తెచ్చిన ఘనత చంద్రబాబు, లోకేశ్‌లదేనన్నారు. చంద్రబాబుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వస్తున్న ఖ్యాతిని చూసి కుళ్లుకుంటున్నారని, అందుకే సజ్జల, జోగి రమేశ్, విడదల రజని తదితరలతో వాగిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబుపైనా, అమరావతిపైనా విషం చిమ్మితే వైసీపీ నాయకుల సంగతి చూస్తానని హెచ్చరించారు.

సీపీఐ రామకృష్ణకు డి.రాజా పరామర్శ

కర్నూలు, మే 3(ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణను ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఆదివారం ఫోన్‌లో పరామర్శించారు. రామకృష్ణ తల్లి గౌరమ్మ (100) శుక్రవారం మృతిచెందడంతో శనివారం కర్నూలు జిల్లా ఆలూరు మండలంలోని స్వగ్రామం మొలగవెల్లిలో ఆమెకు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణను డి.రాజా పరామర్శించారు. అలాగే, పార్టీ తరపున సంతాప లేఖ రాశారు. 'సామాజిక విలువలతో కూడుకున్న జీవితం గౌరమ్మది. ఆ విలువలే రామకృష్ణ సీపీఐ జాతీయ కార్యదర్శిగా, మాజీ ఎమ్మెల్యేగా ప్రజాజీవితంలో రాణించడానికి దోహదం చేశాయి' అని లేఖలో డి.రాజా పేర్కొన్నారు.

పాస్టర్ ఆనంద్‌కు మళ్లీ నోటీసులు

- ఎస్సీ హోదా రద్దుకు డీఎల్ఎస్‌సీ సిఫారసు
- ఈ నెల 19న తుది నిర్ణయం.. అభ్యంతరాలకు 15 రోజుల గడువు
- బాపట్ల కలెక్టర్ వినోద్‌కుమార్ వెల్లడి

బాపట్ల, మే 3 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ఆనంద్‌కు ఎస్సీ హోదా రద్దు చేయాలని కోరుతూ జిల్లా స్థాయి స్క్రూటినీ కమిటీ (డీఎల్ఎస్‌సీ) చైర్మన్, జాయింట్ కలెక్టర్ భావన బాపట్ల జిల్లా కలెక్టర్‌కు సిఫారసు చేశారు. దీని ఆధారంగా కలెక్టర్ వినోద్‌కుమార్ పాస్టర్‌కు మరోసారి నోటీసులిచ్చారు. పారదర్శకత కోసం ఆ ప్రతిని పిటిషనర్ అక్కుల రామిరెడ్డికి కూడా పంపించామని కలెక్టర్ ఆదివారం వెల్లడించారు. అధికారిక ప్రక్రియ ప్రకారం.. నోటీసులు జారీ చేసిన నాటి నుంచి అభ్యంతరాలకు 15 రోజులు గడువు ఉంటుందని, ఏమైనా ఉంటే పాస్టర్ ఆనంద్ ఆలోపు తనకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని.. డాక్యుమెంట్లు ఉన్నా అందించవచ్చని ఆయన తెలిపారు. ఈ నెల 19న తుది నిర్ణయం వెలువరిస్తామని చెప్పారు. పాస్టర్ ఆనంద్ ఎస్సీ హోదా రద్దు వివాదంలో డీఎల్ఎస్‌సీ తుది విచారణ మే 1న బాపట్ల జిల్లా కలెక్టరేట్ వేదికగా జరిగింది. ఇరుపక్షాల వాదనలను కమిటీ రికార్డు చేసింది. ఏప్రిల్ 18న జరిగిన తొలి విచారణకు హాజరుకాని పాస్టర్ ఆనంద్.. తుది విచారణకు వచ్చారు. మతం మారితే ఎస్సీ హోదా వర్తించదన్న రాష్ట్ర హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు కూడా సమర్థించడంతో కమిటీ సిఫారసులకు ప్రాధాన్యం ఏర్పడింది. ఈ క్రమంలోనే తుది విచారణ జరిగిన రెండ్రోజుల వ్యవధిలోనే పాస్టర్ ఆనంద్ ఎస్సీ హోదాను రద్దు చేయాలని కమిటీ కలెక్టర్‌కు సిఫారసు చేసింది.

కల్తీ నెయ్యితో ప్రసాదం మహాపాపం

- సింఘాల్, వైవీ, ధర్మారెడ్డి, భూమనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి: భానుప్రకాశ్‌రెడ్డి

తిరుపతి(నేరవిభాగం), మే 3 (ఆంధ్రజ్యోతి): కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వరునికి కల్తీ ప్రసాదాలను నివేదించి మహా పాపానికి ఒడిగట్టిన పాపాత్ములపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. మాజీ చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, అప్పటి ఈవోలు అనిల్‌కుమార్ సింఘాల్, ధర్మారెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. దీనిని బుధవారం (6న) జరిగే పాలక మండలి సమావేశంలో తాను ప్రతిపాదిస్తానని తెలిపారు. ఆదివారం ఆయన ఓ వీడియో సందేశం విడుదల చేశారు. శ్రీవారి ఆలయంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అపచారాలు అన్నీ ఇన్నీ కావన్నారు. అత్యంత పవిత్రమైన లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యిని వాడడంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నాటి సీఎం జగన్ పరోక్ష సహకారంతో టీటీడీలో అవినీతి రాజ్యమేలిందని ఆరోపించారు. ముఖ్యంగా స్వామివారి ప్రసాదాల తయారీకి వాడే నెయ్యి విషయంలో అప్పటి పాలకమండలి నిబంధనలను ఇష్టారాజ్యంగా సడలించిందన్నారు. నాడు ప్రసాదాల తయారీకి వాడిన అసలు నెయ్యే కాదని, కేవలం కెమికల్స్‌తో తయారుచేసిన రసాయన నెయ్యి అని సిట్, దినేశ్‌కుమార్ కమిషన్ స్పష్టం చేశాయని చెప్పారు. పవిత్రమైన నైవేద్యాల్ని కల్తీ చేసి, దేవుడికి, భక్తులకు ద్రోహం చేసినవారు ముమ్మాటికీ పాపాత్ములేనన్నారు. స్వామి పట్ల అపచారం చేసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. భక్తుల నమ్మకాన్ని వమ్ము చేసిన వారికి చట్టపరంగా తగిన బుద్ధి చెప్పేవరకు పాలక మండలి విశ్రమించదన్నారు.

సనాతన ధర్మానికి వైసీపీ వ్యతిరేకం

- ఐదేళ్లలో ఆలయాలకు సున్నం కూడా వేయలేదు: మంత్రి ఆనం

ఉలవపాడు, మే 3(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మానికి, హిందూ మత ప్రచారానికి, ధార్మిక సంస్థల ఆలోచనలకు వ్యతిరేకంగా గత వైసీపీ ప్రభుత్వం పనిచేసిందని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విమర్శించారు. ఐదేళ్ల పాలనలో ఏనాడూ హిందువుల మనోభావాలకు అభీష్టంగా పనిచేసిన దాఖలాలు లేవన్నారు. ప్రకాశం జిల్లా ఉలవపాడులోని వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన రథోత్సవాన్ని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి మంత్రి ప్రారంభించారు. నూతన రథానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలోని ఆలయాలకు సున్నం కూడా వేసిన పరిస్థితి లేదన్నారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆలయాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని, టీటీడీ సహకారంతో 5,000 నూతన ఆలయాల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. వచ్చే రెండేళ్లలో 800 ఆలయాల పునర్నిర్మాణానికి కట్టుబడి ఉన్నామన్నారు. రూ.50 వేల కంటే తక్కువ ఆదాయం ఉన్న ఆలయాల్లో పనిచేస్తున్న పూజారులు, అర్చకులకు ప్రతినెలా రూ.10,000 దేవదాయశాఖ చెల్లిస్తోందని చెప్పారు.

జగన్‌ది గొడ్డలి పార్టీ కాక మరేంటి?

- వైసీపీవి నేరపూరిత రాజకీయాలు
- రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత ప్రమాదకరం: నసీర్ అహ్మద్

అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): ఒక్క అవకాశ మంటూ అధికారంలోకి వచ్చి గొడ్డలి సంస్కృతిని పెంచి పోషించినందుకే ప్రజలు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని 11 సీట్లకు పరిమితం చేశారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ ఎద్దేవా చేశారు. జగన్ పార్టీ గొడ్డలి పార్టీ కాక మరేమవుతుందని ప్రశ్నించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో నసీర్ అహ్మద్ మాట్లాడుతూ తమది గొడ్డలి పార్టీ కాదని మాజీ మంత్రి విడదల రజని చెప్పడం హాస్యాస్పదమన్నారు. సొంత బాబాయ్‌ని గొడ్డలితో నరికి చంపిన చరిత్ర కలిగిన వైసీపీని గొడ్డలిపార్టీ అనక మరేమంటారని ప్రశ్నించారు. అధికారం కోసం కన్నవాళ్లను బజారుకు ఈడ్చి, అడ్డు వచ్చిన వారిని అంతమొందించే మనస్తత్వం జగన్‌దని ఆరోపించారు. పరిటాల రవి నుంచి వివేకా హత్య వరకు రక్త చరిత్రను జగన్ కొనసాగిస్తున్నాడన్నారు. పరిటాల రవి, వివేకా హత్య కేసుల్లో సాక్షులను సైతం అంతమొందిన చరిత్ర అతనిదని విమర్శించారు. బీసీ వర్గానికి చెందిన పారిశ్రామిక వేత్త బాలయ్య యాదవ్ వంటి సామాన్య కార్యకర్తలను పొట్టన పెట్టుకున్నది వైసీపీ కాదా అని ప్రశ్నించారు. దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని చంపి, శవాన్ని ఇంటికి పంపిన అమానవీయ సంస్కృతి వైసీపీదన్నారు. మాస్కు అడిగినందుకు డాక్టర్ సుధాకర్‌ను వేధించి, ఆయన ప్రాణాలు పోయేలా చేశారని, గుంటూరు రమ్య, పలమనేరు మిస్బా, పులివెందుల నాగమ్మ.. ఇలా ఎందరో ఆడబిడ్డల హత్యలకు జగన్ పాలన కారణమని విమర్శించారు. నిందలు మోపి, మానసిక క్షోభకు గురిచేసి మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ ప్రాణాలు తీసిన పాపం వైసీపీదేనన్నారు. సొంత పార్టీ నేతలను కూడా చిత్ర హింసలు పెట్టిన సైకో పార్టీ వైసీపీ అన్నారు. నేరపూరిత రాజకీయాలు చేస్తున్న జగన్, వైసీపీ రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత ప్రమాదకరమని విమర్శించారు.

కరీంనగర్ నడిబొడ్డున..
పట్టపగలు.. నగల దుకాణంలో లూటీ

సిబ్బందిని బెదిరించి ఒక కిలో ఆభరణాలు దోపిడీ


- తిరగబడ్డ మేనేజర్, సిబ్బంది.. కాల్పులు జరిపిన దొంగలు
- ముగ్గురికి తీవ్ర గాయాలు..



పీఎంజే జ్యువెల్లర్స్‌లో సిబ్బందిని తుపాకీతో బెదిరిస్తున్న దుండగుడు (సీసీ ఫుటేజ్)

కరీంనగర్, మే 3(ఆంధ్రజ్యోతి): పట్టపగలు.. నగల దుకాణం తెరిచీతెరవగానే.. అందులోకి చొరబడిన ఐదుగురు దుండగులు తుపాకులతో సిబ్బందిని బెదిరించి, నిర్బంధించి దాదాపు కిలో ఆభరణాలను దోచుకుపోయారు! తిరగబడిన షాపు మేనేజర్, సిబ్బందిపై కాల్పులు జరపగా.. ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. కరీంనగర్ జిల్లా కోర్టుకు సమీపంలో.. ఆదివారం ఉదయం జరిగిన ఈ ఘటన సంచలనం సృష్టించింది. కరీంనగర్ జ్యోతినగర్ ప్రాంతంలోని పీఎంజే జ్యువెలరీ షాపును ఆదివారం తెరవగానే.. 11.01 గంటల సమయంలో ఒక వ్యక్తి దుకాణంలోకి ప్రవేశించాడు. తనకు బంగారం చైన్ కావాలని, మోడల్స్ చూపించాలని సిబ్బందిని కోరాడు. అప్పుడే లాకర్ నుంచి ఆభరణాలు తీసుకువచ్చి సర్దుతున్న షోరూం సిబ్బంది అతడితో మాట్లాడుతుండగానే మరో నలుగురు లోపలికి చొరబడ్డారు. ఐదుగురూ కలిసి.. తుపాకులు చూపించి సెక్యూరిటీ గార్డును, సిబ్బందిని.. మొత్తం ఎనిమిది మందినీ బెదిరించి చేతులు పైకెత్తించి, మోకాళ్ల మీద కూర్చోబెట్టారు. చేతికందిన ఆభరణాలను రెండు బ్యాగ ుల్లో సర్దుకున్నారు. ఆ సమయంలో.. దుకాణం మార్కెటింగ్ మేనేజర్ ముస్తాక్‌అలీ వారికి ఎదురు తిరిగి, ఒకరి తుపాకీని పట్టుకునే ప్రయత్నం చేశారు. దీంతో ధైర్యం తెచ్చుకున్న మిగతా సిబ్బంది కూడా ఎదిరించే ప్రయత్నం చేశారు. దీంతో వారు ఒక్కసారిగా సిబ్బందిపై నాలుగు రౌండ్ల కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో.. మేనేజర్ ముస్తాక్ అలీ, రాజేశ్, కమలహాసన్, బూర్ల మధుకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ హడావుడిలో దుండగులు ఆభరణాలున్న బ్యాగుల్లో ఒకదాన్ని తీసుకుని.. సరిగ్గా 11.12 గంటలకు బయటకు పరుగులు తీశారు. మరో బ్యాగును నగలతో సహా దుకాణంలోనే వదిలి పారిపోయారు. దొంగలు వెళ్లిపోగానే షాపు సిబ్బంది పోలీసులకు ఫోన్ చేశారు. పోలీసులు వచ్చి గాయపడ్డవారిని ఆసుపత్రికి తరలించారు. క్లూస్‌టీం ఆధారాలను సేకరించారు. కాగా.. ఈ లూటీ.. అంతర్రాష్ట్ర ముఠా పనేనని పోలీసులు అనుమానిస్తున్నారు.

మన బంగారం.. మన దేశానికి!



(మొదటి పేజీ తరువాయి)

మన దేశానికి తీసుకొచ్చింది. తులం మేలిమి బంగారం మార్కెట్ రేటు ఇవాళ రూ.లక్షన్నర దాకా ఉంది! అదే కిలో బంగారం విలువ రూ.కోటిన్నర పైమాటే!! అంటే.. ఈ మూడేళ్లలో తెచ్చిన బంగారం దాదాపు 3,78,950 కిలోలు. దాని విలువ ఏకంగా రూ.5.72 లక్షల కోట్లు. ఇలా తెచ్చిన బంగారంతో.. మన మొత్తం పుత్తడి నిల్వల్లో (880.52 టన్నులు).. 77 శాతం, అంటే 680 టన్నులు మనవద్దే ఉన్నట్టయింది. మరో 197.67 టన్నుల బంగారం ఇంకా బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, బ్యాంక్ ఆఫ్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్స్ వద్ద ఉంది. మిగతా బంగారం వివిధ డిపాజిట్ల రూపంలో ఉంది.

విదేశాల్లో ఉంచడమెందుకు?

ప్రపంచ దేశాలకు బంగారు సంరక్షకులుగా (గోల్డ్ కస్టోడియన్స్) వ్యవహరిస్తున్న రెండు అతి పెద్ద బ్యాంకులు.. 'ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ న్యూయార్క్', బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్. వీటిలో న్యూయార్క్ ఫెడరల్ రిజర్వ్ బ్యాంకు వాల్టుల్లో ఏకంగా ఇలా వివిధ దేశాలకు చెందిన 5 లక్షల బంగారు కడ్డీలు (గోల్డ్ బార్) ఉన్నాయి. ఒక్కో గోల్డ్ బార్ బరువు.. 12.4 కిలోలు. అంటే ఒక్క న్యూయార్క్ బ్యాంకులోనే 62 లక్షల కిలోల బంగారం ఉంది. ఇక, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వాల్టుల్లో 4,30,000 బంగారు కడ్డీలున్నాయి. అంటే 53,32,000 కిలోలు!! ఈ బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ ప్రపంచవ్యాప్తంగా మన ఆర్బీఐ లాంటి 60 కేంద్ర బ్యాంకులకు సేవలందిస్తోంది. ఒకదేశం తనవద్ద ఉన్న బంగారాన్ని అమ్మి వెంటనే నగదు పొందాలన్నా.. వేరే దేశంతో వ్యాపారం చేయాలన్నా భౌతికంగా బంగారాన్ని తరలించడం కష్టం. అదే లండన్‌లోనో, న్యూయార్క్‌లోనో ఈ బ్యాంకుల్లో నిల్వ ఉంచితే వాటిలోని ఒక దేశ లాకర్ నుంచి మరో దేశ లాకర్‌లోకి మార్చడం సులువు. అందుకే ఈ ఏర్పాటు. భారతదేశం కూడా ఇలా కొంత బంగారాన్ని లండన్‌లో అట్టేపెట్టింది. కానీ.. 2022లో రష్యా ఉక్రెయిన్‌పై, ఈ ఏడాది ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలియని తీవ్ర అనిశ్చితి నెలకొంది. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో, అంతర్జాతీయ ఒత్తిళ్లు ఉన్నప్పుడు.. రాజకీయంగా, భౌగోళికంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పుడు.. మన బంగారంపై మనకు మాత్రమే అధికారం ఉండాలంటే ఆ పుత్తడి మన దేశంలోనే ఉండాలి. అందుకే భారతదేశం మన పసిడిని మన దేశానికి పెద్ద ఎత్తున తీసుకొచ్చేస్తోంది. ఇంకో కారణం ఏంటంటే.. విదేశీ బ్యాంకుల్లో మన బంగారాన్ని ఉంచాలంటే అందుకు పెద్ద ఎత్తున అద్దెలు చెల్లించాల్సి వస్తుంది. మన దేశంలోనే భద్రపరచుకుంటే ఆ ఖర్చులు తగ్గుతాయి. పైపెచ్చు గతంతో పోలిస్తే మనదేశంలో పుత్తడిని అత్యంత భద్రంగా నిల్వ చేసుకునే సామర్థ్యం పెరిగింది. ఈ కారణాలన్నింటి రీత్యా.. అంతర్జాతీయ లావాదేవీల నిమిత్తం కొంత బంగారాన్ని అక్కడ ఉంచి మిగతా మొత్తాన్ని ఆర్బీఐ ఇక్కడికి తీసుకొచ్చేస్తోంది. ఒక్క మనదేశమే కాదు.. జర్మనీ, టర్కీ, ఫ్రాన్స్, పోలండ్ ఇలా చాలా దేశాలు న్యూయార్క్‌లో, లండన్‌లో.. ఇలా వేరే దేశాల్లో ఉంచిన తమ బంగారాన్ని తమ తమ దేశాలకు తీసుకెళ్లిపోతున్నాయి.

ఏ దేశం వద్ద ఎంత బంగారం

ప్రపంచంలో అత్యధికంగా బంగారు నిల్వలున్న దేశం అమెరికా. ఆ తర్వాతి స్థానంలో జర్మనీ ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థికవేత్తలు, పెట్టుబడిదారులు, పరిశోధకులు ఎక్కువగా ఉపయోగించే అత్యంత విశ్వసనీయమైన వెబ్‌సైట్ 'ట్రేడింగ్ ఎకనమిక్స్' ప్రకారం 2025 డిసెంబరు నాటికి పుత్తడి నిల్వల జాబితాలో టాప్-10 దేశాలు...

దేశం	నిల్వ (టన్నుల్లో)
అమెరికా	8,133
జర్మనీ	3,350
ఇటలీ	2,452
ఫ్రాన్స్	2,437
రష్యా	2,327
చైనా	2,306
స్విట్జర్లాండ్	1,040
ఇండియా	880
జపాన్	846
టర్కీ	614

పసిడితోనే పలుకుబడి..

సామాన్యుల నుంచి సంపన్నుల దాకా.. భారతీయులందరి దృష్టిలో బంగారం అంటే కేవలం ఒక లోహం కాదు. అదో భావోద్వేగం. ఆర్థిక కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకునే అండ. వ్యక్తులకే కాదు.. దేశాలకైనా ఇదే వర్తిస్తుంది! అందుకే ప్రపంచవ్యాప్తంగా అన్నిదేశాలూ ఒకప్పుడు తాము ముద్రించే కరెన్సీకి సరిపడా బంగారాన్ని నిల్వ ఉంచుకునేవి. కానీ, 1930ల్లో ప్రపంచవ్యాప్తంగా అలముకున్న ఆర్థిక మాంద్యం (గ్రేట్ డిప్రెషన్) నేపథ్యంలో.. రెండు ప్రపంచయుద్ధాల తర్వాత.. చాలా దేశాలు ఈ పద్ధతిని వదిలిపెట్టాయి. మధ్యలో కొన్నాళ్లు బంగారానికి డాలర్ రిజర్వ్ కరెన్సీగా ఉండేది. కానీ, 1971లో నిక్సన్ దెబ్బకు ఆ రెంటికీ సంబంధం తెగిపోయాక ప్రపంచదేశాలన్నీ పూర్తిస్థాయిలో పేపర్ కరెన్సీ (దీన్నే ఫియట్ కరెన్సీ అంటారు) విధానానికి అలవాటు పడ్డాయి. అయితే.. ముద్రించే నోట్లకు సమానంగా బంగారాన్ని నిల్వ చేయట్లేదుగానీ.. మార్కెట్లో తమ కరెన్సీ విలువ పడిపోకుండా చూసుకోవడానికి, అంతర్జాతీయ పెట్టుబడిదారుల నమ్మకాన్ని చూరగొనడానికి బంగారాన్ని ఎప్పటికప్పుడు కొంటూ వస్తున్నాయి. భారతదేశం కూడా ఇదే క్రమంలో భారీగా బంగారు నిల్వలను కూడబెట్టింది. పెడుతూ వస్తోంది. అలా మన ఆర్బీఐ గత మూడేళ్లలో 8600 కిలోల బంగారాన్ని కొనుగోలు చేసింది.

చివరాఖరు: యుద్ధాలు, తీవ్ర ఆర్థిక సంక్షోభం వంటివి వచ్చినప్పుడు ఇతరదేశాలు మన కరెన్సీని అంగీకరించకపోవచ్చు. అప్పుడు మన వద్ద ఉన్న బంగారమే మనకు దిక్కవుతుంది. 1991లో ఇలాగే మన వద్ద విదేశీ మారక ద్రవ్యం నిల్వలు నిండుకున్నప్పుడు.. అప్పు కోసం మన బంగారాన్ని విదేశీ బ్యాంకుల్లో తాకట్టు పెట్టాల్సి వచ్చింది. అందులో భాగంగా తొలుత సుమారు 20 టన్నుల బంగారాన్ని యూనియన్ బ్యాంక్ ఆఫ్ స్విట్జర్లాండ్‌కు, ఆ తర్వాత 47 టన్నుల బంగారాన్ని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌కు విమానాల్లో పంపించాం. ఒక దేశానికి ఆ పరిస్థితి దాపురించిందంటే.. అది 'ఆర్థిక అవమానమే'. అయితే, ఆ దుస్థితి మనకు ఎంతో కాలం లేదు. అప్పట్లో ప్రభుత్వం అమలు చేసిన ఆర్థిక సంస్కరణల వల్ల తాకట్టు పెట్టిన బంగారాన్ని 4-5 నెలల్లోనే విడిపించుకోగలిగాం. కానీ, ఆ బంగారాన్ని భారత్‌కు తీసుకురాకుండా భద్రత, ఆర్థిక అవసరాల రీత్యా అక్కడే ఉంచాం. ఇప్పుడు మన పసిడిని అదే లండన్ నుంచి సగర్వంగా తెచ్చుకోవడం దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుగుదలకు గొప్ప సంకేతం.

మామిడి ధర ఢమాల్

(మొదటి పేజీ తరువాయి)



కాయలకు కవర్లు కట్టి సాగు చేసిన మామిడి తోట

కుంగదీస్తోంది. ఏటికేడాది ధర లేక మామిడి రైతులు కొన్నేళ్లుగా నష్టాలను చవిచూస్తున్నారు. ఈ ఏడాది అయినా ధరలు ఆశించిన స్థాయిలో ఉంటాయనుకుంటే.. పశ్చిమాసియా యుద్ధంతో ఎగుమతులు ఆగిపోవడం, హోటల్స్ మూతపడటం, డీజిల్ సంక్షోభం వంటి ప్రతికూల పరిస్థితులు రైతుల మార్కెటింగ్ అవకాశాలను తీవ్రంగా దెబ్బతీశాయి. ఏప్రిల్ మొదటి వారం నుంచే సైజులను బట్టి కాయ ులు కోయాల్సి ఉండగా, కూలీల కొరతతో కోతలు సాగలేదు. ఏప్రిల్ ముగింపులో కాయలన్నీ ఒకేసారి కోతకు రావడం, మార్కెట్‌లోకి ఒకేసారి కాయలు పెద్ద ఎత్తున రావడంతో ధరలు పతనమయ్యాయని రైతులు చెబుతున్నారు. ఢిల్లీ సేఠ్‌లు (కమీషన్ వ్యాపారులు) సిండికేట్‌గా ఏర్పడి ధరలు పెరగకుండా చేస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. మరోపక్క నల్లి తామర వల్ల ఈ ప్రాంతంలోని తోటల్లోని మామిడి కాయలు నాణ్యత లేక.. ఇతర ప్రాంతాల కాయలతో పోటీ పడలేకపోతున్నాయి. ఈ కారణంతో ధరలు పతనమయ్యాయని రైతులు వాపోతున్నారు.

తోతాపురి ధర అమాంతం పతనం

తోతాపురి (కలెక్టర్) రకం మామిడి ధరలు అమాంతం పతనమయ్యాయి. ప్రస్తుతం తోతాపురి కాయ రూ.4-7 ఉంది. యుద్ధ సమయంలో పంపించిన జ్యూస్ వెనక్కి రావడంతో.. తోతాపురిని కొనేందుకు జ్యూస్ ఫ్యాక్టరీ యజమానులు ముందుకు రాకపోవడం ధర పడిపోవడానికి కారణంగా తెలుస్తోంది.

పొరుగు రాష్ట్రాలకు పంపినా

బంగినపల్లి రకం మామిడికాయలను కొందరు రైతులు నాందేడ్, ఇండోర్ వంటి ప్రాంతాలకు తీసుకెళ్లినా.. అక్కడా ధర రావట్లేదు. అక్కడ కాయకు రూ.20, రూ.30 మాత్రమే లభిస్తుండటంతో ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్, అమరావతి, ఇండోర్ వంటి నగరాల్లో అమ్మకాలు, కొనుగోళ్లు జరగడం లేదని, అందుకే ధరలపై ప్రభావం పడిందని అక్కడి సేఠ్‌లు అంటున్నారు.

కాయలకు కవర్లు కట్టినా..!

కోతల ప్రారంభ సమయంలో కవర్లలో పండించిన మామిడి టన్ను రూ.1.7 లక్షలు, రూ.1.80 లక్షలు పలికింది. ప్రస్తుతం ఆ కాయలకూ గిరాకీ బాగా తగ్గింది. నాందేడ్, అమరావతి మార్కెట్‌లో కవర్లు కట్టిన మామిడికాయలు టన్ను రూ.50-60 వేలే పలుకుతోందని అక్కడికి వెళ్లిన ఎన్టీఆర్ జిల్లా రైతులు వాపోతున్నారు.

టన్నుకు క్వింటాన్నర కాయలు తరుగు

మామిడి కాయల కొనుగోలు సమయంలో టన్ను కాయలకు క్వింటాన్నర కాయలను తరుగు కింద తీయడంతో రైతులు నష్టపోవాల్సి వస్తోంది. నాణ్యత లేనందునే తరుగు కింద కాయలు తీస్తున్నామని కమీషన్ వ్యాపారులు అంటున్నారని రైతులు వాపోతున్నారు.

తోటలను వదిలేయడం మేలు

-రాయల రామారావు (తెల్లదేవరపల్లి)



నాకు 15 ఎకరాల తోట ఉంది. మొత్తం తోతాపురి రకం. మొత్తం కాయలు చేతికొచ్చేందుకు రూ.5 లక్షలు ఖర్చయింది. 30 టన్నుల దిగుబడి వచ్చింది. టన్ను రూ.7 వేలకు కొన్నారు. రూ.2.10 లక్షలు వచ్చింది. రూ.2.90 లక్షలు నష్టం వచ్చింది. ఈ పరిస్థితుల్లో తోటలను గాలికొదిలేయడం మేలు.

మస్కట్‌లో మహిళ నరకయాతన

- స్పందించిన డిప్యూటీ సీఎం పవన్
- స్వగ్రామానికి రప్పించేందుకు ఏర్పాట్లు



మస్కట్‌లో రోదిస్తున్న షహనాజ్

అమరావతి/వాల్మీకిపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం గ్రామానికి చెందిన నిరుపేద మహిళ దూదేకుల షెహనాజ్.. తమ కుటుంబపోషణకు ఉపాధి నిమిత్తం ఓ ఏజెంట్ ద్వారా ఒమన్‌లోని మస్కట్‌కు వెళ్లింది. ఏజెంట్ చేతిలో మోసపోయిన ఆమె అక్కడ నరకయాతన పడింది. తనకు జీతం ఇవ్వడం లేదని, ఆహారం పెట్టడం లేదని, నీళ్లు ఇవ్వడం లేదని, అడిగితే కొడుతున్నారని, వేధింపులకు గురిచేస్తున్నారని.. తన భర్తకు ఫోన్ చేసి చెప్పడంతో పాటు వీడియో కూడా తీసి పంపింది. తనను కాపాడాలంటూ రోదిస్తూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను వేడుకుంది. ప్రాణాలు పోయేలా ఉన్నాయని ఆమె మాటలకు పవన్ చలించిపోయారు. తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని తన కార్యాలయ అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు భారత విదేశాంగ శాఖ, ఒమన్‌లోని దౌత్య కార్యాలయాన్ని సంప్రదించారు. బాధితురాలి భర్త అబూబాకర్ అలియాస్ బావాజాన్ ద్వారా ఒమన్‌లోని ఏజెంట్ ద్వారా మాట్లాడారు. పవన్ చొరవతో బాధితురాలిని దేశానికి రప్పించేందుకు విమాన టికెట్ బుక్ చేసినట్టు సమాచారం. మంగళవారం లేదా బుధవారం ముంబై చేరుకొనే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. షహనాజ్ ఇబ్బందులపై ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి స్పందించారు. ఏపీఎన్‌ఆర్‌టీఎస్ ప్రెసిడెంట్ వేమూరు రవికుమార్, డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్ సర్వీసెస్ నాగేంద్రబాబు అక్కిలితో ఫోన్‌లో మాట్లాడారు.

ఈసారి సులువుగా 'నీట్'..!

(మొదటి పేజీ తరువాయి)

కష్టంగా ఉంది. స్టేట్‌మెంట్‌లు, డయాగ్రమ్‌ల ఆధారంగా ప్రశ్నలు ఉన్నాయి. కాలిక్యులేషన్స్ ఎక్కువ.

సజావుగా ముగిసిన పరీక్ష

రాష్ట్రంలో నీట్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. నిమిషం ఆలస్యం నిబంధనను అమలు చేయడంతో పలువురు విద్యార్థులు పరీక్ష రాయలేకపోయారు. కన్నీరు పెట్టుకుంటూ నిరాశగా వెనుదిరిగారు. రాష్ట్రవ్యాప్తంగా 28 నగరాల్లోని 180 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. ఈసారి చిన్న నగరాల్లో కూడా పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పరీక్ష సమయం కాగా ఉదయం 11.30 గంటల నుంచే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈసారి రాష్ట్రం నుంచి దాదాపు 58వేల నుంచి 59వేల మంది విద్యార్థులు నీట్ రాసినట్లు తెలుస్తోంది. విశాఖ జిల్లాలోని 18 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు 8,112 మందికి గాను 7,900 మంది హాజరయ్యారు. శ్రీకాకుళం జిల్లాలోని 4 కేంద్రాల్లో మొత్తం 1,951 మంది విద్యార్థులకు గాను 1,904 మంది హాజరయ్యారు. శ్రీకాకుళం మండలం పెద్దపాడులోని కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి ఇద్దరు విద్యార్థినులు 10 నిమిషాలకు పైగా ఆలస్యంగా రావడంతో అధికారులు లోపలకు అనుమతించలేదు. విద్యార్థినులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా కాళ్లు పట్టుకుంటామని బతిమిలాడారు. అయితే నిర్ణీత సమయం దాటిపోయిందని అధికారులు నిరాకరించడంతో ఆ ఇద్దరు విద్యార్థినులు నిరాశతో వెనుదిరిగారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రానికి ఓ దివ్యాంగ విద్యార్థి మధ్యాహ్నం 1.28 గంటలకు చేరుకున్నాడు. నిర్ణీత సమయం (1.30 గంటలు) దగ్గర పడుతుండటంతో అక్కడ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ ఆ విద్యార్థిని భుజంపై ఎత్తుకుని పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లారు. ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1,728 మంది విద్యార్థులకు గాను 1,681 మంది పరీక్ష రాశారు. 47 మంది గైర్హాజరయ్యారు. ఎన్టీఆర్ జిల్లాలోని 32 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా, 11,496 మంది అభ్యర్థులకు గాను 11,345 మంది, కృష్ణాజిల్లాలోని రెండు పరీక్షా కేంద్రాల్లో 763 మందికి గాను 742 మంది హాజరయ్యారు.

పేపర్ ఈజీగా ఇచ్చారు..!

ఎన్నడూ లేని విధంగా గతేడాది నీట్ ప్రశ్నపత్రాన్ని చాలా కఠినంగా ఇచ్చారు. దాంతో ఈ ఏడాది పరీక్ష మరింత కఠినంగా ఉంటుందనే భావనతో విద్యార్థులు చాలా పకడ్బందీగా సిద్ధమయ్యారు. అయితే, విద్యార్థుల అంచనాలను తలకిందులు చేస్తూ ప్రశ్నపత్రం ఈసారి చాలా సులువుగా ఇచ్చారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌లోని ప్రశ్నలనే ఎక్కువగా ఇచ్చారని చెబుతున్నారు. గతేడాది భౌతిక శాస్త్రం ప్రశ్నలు విద్యార్థులను బెంబేలెత్తించాయి. 12-15 ప్రశ్నలకు జవాబులు ఇవ్వడమే విద్యార్థులకు కష్టమైంది. ఈసారి భౌతికశాస్త్రం విభాగంలో 25-30 ప్రశ్నలకు సగటు విద్యార్థి కూడా సరైన జవాబులిచ్చేలా ప్రశ్నపత్రం ఉందని నిపుణులు చెబుతున్నారు. అయితే ఓ 4-5 ప్రశ్నలు మాత్రం విద్యార్థులను గందరగోళంలోకి నెట్టేలా ఉన్నాయని చెబుతున్నారు. ఇక, రసాయన శాస్త్రంలో ఐదారు ప్రశ్నలే ట్రిక్కీగా ఇవ్వగా.. విద్యార్థులు వీటిలో తప్పులు చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జీవశాస్త్రంలో అన్నీ తేలిగ్గానే ఇచ్చినట్లు విద్యార్థులు చెప్పారు. బయాలజీలో 360 మార్కులకుగాను ఈసారి మెజార్టీ విద్యార్థులు 350 వరకు మార్కులు సాధించే అవకాశం ఉంటుందని నిపుణులు వెల్లడించారు. మొత్తమ్మీద పేపర్ నిడివి ఎక్కువ, ట్రికీ కాలిక్యులేషన్స్ కారణంగా కటాఫ్ పది నుంచి పదిహేను మార్కులు పెరగవచ్చని హైదరాబాద్‌లోని ఎక్స్‌లెన్సియాకు చెందిన డాక్టర్ పవన్ కుమార్ కాసు వెల్లడించారు.



ఆలస్యంగా రావడంతో లోపలికి అనుమతించలేదని హైదరాబాద్‌లోని ఓ పరీక్ష కేంద్రం వద్ద రోదిస్తున్న ఓ విద్యార్థిని

నెలాఖరుకు కీ, జూన్‌లో ఫలితాలు

నీట్-2026 ఫలితాలు జూన్ రెండో వారంలో వెల్లడయ్యే అవకాశం ఉందని ఎన్టీఏ వర్గాలు పేర్కొన్నాయి. ఈ నెలాఖరులోగా కీ విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 820కి పైగా ఉన్న వైద్య కళాశాలలో 1.29 లక్షల ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. 22.79 లక్షల మందికిపైగా నీట్-2026 పరీక్షకు హాజరైనట్లు తెలుస్తోంది. దీంతో ఒక్కో సీటుకు సగటున 1,718 మంది పోటీ పడుతున్నారు.

570 స్కోర్ చేస్తే కన్వీనర్ కోటా సీటు

గతేడాది ఆలిండియా టాప్ ర్యాంకర్ 686 మార్కులు సాధించారు. 600 మార్కులు దాటిన వారు కేవలం వెయ్యి మందే ఉన్నారు. ఈసారి పేపర్ చాలా తేలిగ్గా రావడంతో విద్యార్థులు ఎక్కువ మార్కులు సాధించవచ్చు. ఈ ఏడాది టాపర్లు 720 మార్కులకు గాను 720 మార్కులు సాధించే అవకాశం కనిపిస్తోంది. ఈసారి 685 మార్కులు స్కోర్ చేస్తే ఆలిండియా స్థాయిలో వెయ్యిలోపు ర్యాంకు వచ్చే అవకాశం ఉంటుంది. ఏపీలో దాదాపు 570 మార్కులు సాధించే జనరల్ కేటగిరీ విద్యార్థులకు కన్వీనర్ కోటాలో సీటు వచ్చే అవకాశం ఉంటుంది.

- డి. శంకర్‌రావు, డీన్, శ్రీచైతన్య కాలేజీ, హైదరాబాద్

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.